



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY







SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 8 | సంచిక : 339 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | సోమవారం 25 ఆగస్టు 2025 | పేజీలు : 12 | వెల : 2/-


# ఎరువులపై విజిలెన్స్ దాడులు
# ముమ్మరం చేయాలి

- దారి మళ్లించినా.. ధరలు పెంచినా కేసులే
- యూరియా కోసం రైతులెక్కడా ఇబ్బంది పడకూడదు
- మార్క్‌ఫెడ్‌కు 70% కేటాయింపులు
- పీఏసీఎస్, ఆర్ఎస్‌కేల్లో సరిపడా నిల్వలుంచాలి: సీఎం చంద్రబాబు



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

ఎరువులు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని.. విజిలెన్స్ దాడులు ముమ్మరం చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. 'నల్లబజారుకు ఎరువులు తరలించే వ్యాపారుల లైసెన్సులు రద్దు చేయాలి. ధరలు పెంచి అమ్మేవారిపైనా కేసులు నమోదుచేయాలి. యూరియా కోసం రైతులు ఇబ్బంది పడకూడదు. ఎక్కువగా ఎరువులు విక్రయించే రిటైల్ వ్యాపారుల్లో.. తరచూ కొనుగోలు చేసేవారు ఉన్నట్లు గుర్తిస్తే వారిపై విచారణ చేయండి. యూరియా, ఇతర ఎరువుల నిల్వలు తనిఖీ చేయాలి. వాటి లభ్యతపై రైతులకు పూర్తిస్థాయి సమాచారాన్ని అందుబాటులో ఉంచాలి' అని స్పష్టంచేశారు. ఎరువుల లభ్యత, సరఫరాపై ఆదివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాతో పాటు

- మిగతా 2లో



## మొదటిసారి రుణం తీసుకునేవారికి కనీస సిబిల్ స్కోర్ అక్కర్లేదు

- రుణ దరఖాస్తులకు కనీస క్రెడిట్ స్కోర్‌ను ఆర్బీఐ సూచించలేదు
- కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి
- క్రెడిట్ చరిత్ర, గత చెల్లింపుల చరిత్ర, చెల్లింపుల్లో జాప్యం, రుణాల సెటిల్‌మెంట్ వంటివి ఉంటాయి.
- కేవలం క్రెడిట్ చరిత్ర లేదన్న కారణంతో మొదటిసారి రుణం తీసుకునే వారి రుణ దరఖాస్తును బ్యాంకులు తిరస్కరించరాదు

5



## ఓట్ల తారుమారుకు మోదీ యత్నం

- బిహార్లో జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) ద్వారా పేదల ఓట్లు దొంగిలించాలని ఆయన అనుకుంటున్నారు
- చిన్న పిల్లలు సైతం 'ఓట్ల దొంగా.. గద్దె దిగు' అంటున్నారని.. ఈసీ వారితో మాట్లాడాలని సూచించారు.

## అంతరిక్షం నుంచి ఎంతో అందంగా భారత్



- హైదరాబాద్ సూర్యోదయాన్ని 16సార్లు చూశా
- యాక్సియం- 4 మిషన్ అనుభూతిని వివరించిన శుభాంశు శుక్లా
- "భారత వాయుసేనలో చేరిన కొత్తలో నేను సిగ్గరిని
- మాట్లాడాలన్నా సంకోచించే వాడిని. నా నిర్ణయాలపై నాకే సందేహాలు వస్తుండేవి

5

## సుధాకర్‌రెడ్డికి తుది వీడ్కోలు

- చంద్రబాబు, రేవంత్, వెంకయ్య సహా ప్రముఖుల నివాళి
- అధికార లాంఛనాలతో అంతిమ యాత్ర.. గాంధీ వైద్య కళాశాలకు భౌతిక కాయం అప్పగింత
- సుధాకర్‌రెడ్డి మృతి తీరని లోటు:సీఎం చంద్రబాబు



5

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డికి ప్రభుత్వం అధికార లాంఛనాలతో తుది వీడ్కోలు పలికింది. గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రి నుంచి ఉదయం 10 గంటలకు హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌కు ఆయన భౌతిక కాయాన్ని తీసుకువచ్చారు. అక్కడ ప్రజలు, కార్యకర్తల సందర్శనార్థం ఉంచారు. రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సుధాకర్‌రెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించారు. మధ్యాహ్నం 3 గంటలకు సురవరం

- మిగతా 2లో

# చితికిపోతున్న చిన్న పరిశ్రమలు



- టీడీపీ కూటమి సర్కారు వచ్చాక 2,191 ఎంఎస్ఎంఈ యూనిట్లు మూత
- పార్లమెంటు సాక్షిగా కేంద్ర ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ వెల్లడి
- ఏ ఏడాది రాయితీలు ఆ ఏడాదే చెల్లిస్తామన్న మాటలు ఒట్టిదే
- ముడి సరుకుల ధరలతోపాటు ప్రభుత్వ విద్యుత్ చార్జీల పోటు
- ప్రభుత్వ తీరుతో దాదాపు 30 వేల మంది ఉపాధి కోల్పోయినట్లు అంచనా

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలు తీవ్ర గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. టీడీపీ కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ఇవి తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. ఫలితంగా.. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ యూనిట్లు ఇప్పుడు తెగ మూతపడుతున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖే సాక్షాత్తు పార్లమెంటులో ఇటీవలే వెల్లడించింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఈ ఏడాది జూలై 28 వరకు మొత్తం 2,191 ఎంఎస్ఎంఈ యూనిట్లు మూతపడినట్లు తెలిపింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 1,401 యూనిట్లు ఈ ఆర్థిక సంవత్సరం మొదటి నాలుగు నెలల్లోనే 790కి పైగా యూనిట్లు మూతపడ్డాయంటే రాష్ట్రంలో ఎంఎస్ఎంఈల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థంచేసుకోవచ్చు.

- మిగతా 2లో



## 'ఓట్ల చోరీ' తరువాత అధికారాన్ని చోరీ చేసే పనిలో బీజేపీ ఉంది

- విపక్ష ప్రభుత్వాలను 30 రోజుల్లో కూల్చడమే బీజేపీ లక్ష్యం
- అందుకు 130వ రాజ్యాంగ సవరణ బిల్లు
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపణలు
- ఈ బిల్లులు పౌరులు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూల్చివేయడానికి ఈడీ, సీబీఐ లాంటి సంస్థలకు అవకాశం కల్పిస్తాయి
- ఇది ప్రజాస్వామ్యంపై బుల్డోజర్ నడపడం లాంటిది'

5

## కొత్త టీచర్లతో పాఠశాలలకు మహర్దశ

- మెగా డీఎస్సీతో 16,347 మంది కొత్త ఉపాధ్యాయులు
- మోడల్ ప్రైమరీ స్కూళ్లతో నూతన అధ్యాయం
- ప్రాథమిక బడిలో ప్రతి తరగతికి ఒక టీచర్
- టీచర్లపై పనిభారం తగ్గింపు
- తొమ్మిది రకాల పాఠశాలల విధానం
- పాఠశాల విద్యలో కీలక సంస్కరణలు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

తిరోగమనం దిశగా సాగుతున్న ప్రభుత్వ విద్యకు కూటమి ప్రభుత్వం కొత్త ఉత్సాహం తీసుకొచ్చింది. పిల్లలు వెళ్లిపోతున్నారు.....ఉన్న టీచర్లే ఎక్కువైపోయారని గత వైసీపీ ప్రభుత్వం తేల్చగా...పాఠశాలలను పునర్వ్యవస్థీకరించి 16,347 పోస్టులతో చంద్రబాబు ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించింది. ఈ టీచర్లు ఒకటి, రెండు వారాల్లో పాఠశాలల్లో అడుగుపెట్టబోతున్నారు.

- మిగతా 2లో



# చితికిపోతున్న చిన్న పరిశ్రమలు

-మొదటిపేజీ తరువాయి

ఎంఎస్ఎంఈలు ఇలా మూతపడుతుండటంతో సుమారుగా 30,000 మంది ఉపాధి కోల్పోయినట్లు అంచనా.

**షాక్ కొడుతున్న విద్యుత్ బిల్లులు..**

టీడీపీ కూటమి సర్కారు అధికారంలోకి రాగానే బిల్లుల రూపంలో ఎంఎస్ఎంఈలకు గట్టిగా కరెంట్ షాక్ ఇచ్చింది. ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఏపీలోని ఎంఎస్ఎంఈలపై విద్యుత్ బిల్లుల భారం విపరీతంగా పెరిగిపోయింది. అలాగే, పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇవ్వకపోవడం, మానవ వనరుల కొరత, ముడి సరుకుల ధరలు పెరుగుదల, ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం వంటివి వీటిని వెంటాడుతున్నాయి. విజయవాడ కేంద్రంగా పనిచేసే ఒక ఎంఎస్ఎంఈకి సగటున యూనిట్ ఛార్జీ రూ.13.55 పడితే అదే తమిళనాడులో సగటున యూనిట్ ధర 7%–%8లుగా ఉంది. అంటే యూనిట్‌కు దాదాపు రూ.6 అదనం. ఈ స్థాయిలో విద్యుత్ బిల్లులు బాదితే ఇతర రాష్ట్రాలతో ఎలా పోటీపడాలని ఆ సంస్థ ప్రతినిధి వాపోయారు.

**ప్రోత్సాహకాల ఊసేలేదు..**

ఇక అధికారంలోకి వచ్చిన వెంటనే ఏ ఏడాది ప్రోత్సాహకాలు ఆ ఏడాదే ఇచ్చేస్తాం.. ఇందుకోసం ప్రత్యేకంగా కార్పస్ ఫండ్ పెడుతున్నామన్న చంద్రబాబు, ఇతర కూటమి నేతల మాటలు నీటిమూటలయ్యాయి. సుమారు రూ.10,000 కోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాల్లో కనీసం ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. ఇవి ఇవ్వకపోగా వీటిని అడగడానికి వెళ్లిన పారిశ్రామిక ప్రతినిధులను అధికారులు పీ%–%4 దత్తత అంటూ వేధిస్తున్నారని వారు వాపోతున్నారు. పరిశ్రమ నడపడానికి, జీతాలివ్వడానికి మా దగ్గర డబ్బుల్లేవని చెబుతున్నా.. ఆ సంగతి తర్వాత చూద్దాంలే ముందు రెండొందల బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నుట్లు ప్రకటన చేయమనడంతో చేసేదిలేక మొుక్కుబడిగా ప్రకటన చేసి వచ్చేసినట్లు మరో పారిశ్రామిక ప్రతినిధి చెప్పారు. దీన్నిబట్టి రాష్ట్రంలో



పరిస్థితి ఎలా ఉందో అర్థంచేసుకోవచ్చు. ఇంకోపక్క ఎంఎస్ఎంఈల ఉత్పత్తులను ప్రభుత్వ శాఖలు కూడా కొనుగోలు చేయకపోవడం, ప్రభుత్వ అసమర్థ విధానాలతో ప్రజల్లో కొనుగోలు శక్తిపడిపోవడంతో ఈ ప్రభావం ఎంఎస్ఎంఈ యూనిట్లపై ప్రత్యక్షంగా పడుతోంది. కోవిడ్ వంటి సంక్షోభం వచ్చినా ఏ ఒక్క పరిశ్రమ మూతపడకూడదన్న ఉద్దేశంతో గత వైఎస్ జగన్ ప్రభుత్వం రీస్టార్ట్ ప్యాకేజీతో ఆదుకుంది. కానీ, ఇప్పుడు ఈ ప్రభుత్వం మా ప్రోత్సాహకాలు మాకివ్వండని అడిగితే బ్యాంకు నుంచి రూ.5 వేల కోట్ల అప్పు తీసుకుంటున్నాం.. రాగానే ఇస్తామని చెప్పి ఆరునెలలు దాటినా చిల్లిగవ్వ ఇవ్వలేదని పారిశ్రామికవేత్తలు మండిపడుతున్నారు.

**సకాలంలో ప్రోత్సాహకాలు విడుదల చేయాలి..**

రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలు అనేక గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం, అధిక విద్యుత్ ఛార్జీలు, ప్రభుత్వ శాఖల కొనుగోళ్లు లేకపోవడం, టెక్నాలజీ అప్‌గ్రెడేషన్ లేకపోవడం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు వంటి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాయి. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలను ఆదుకోవడానికి తమిళనాడు తరహా విధానం అమలుచేయాలంటూ ఇప్పటికే ప్రభుత్వానికి ఒక నివేదిక ఇచ్చాం. సకాలంలో ప్రోత్సాహకాలు విడుదలచేసి మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉంది.

# కొత్త టీచర్లతో పాఠశాలలకు మహర్దశ

-మొదటిపేజీ తరువాయి

కొత్త సార్లతో ప్రభుత్వ పాఠశాలలు నిండుగా మళ్లీ కళకళలాడనున్నాయి. రాష్ట్రంలో కొన్నేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా మారింది. ప్రతి సంవత్సరం విద్యార్థులు తగ్గిపోతున్నారు. 2021–22లో 44లక్షల మంది విద్యార్థులుంటే 2024–25 నాటికి ఆ సంఖ్య 34.5 లక్షలకు పడిపోయింది. విద్యార్థుల సంఖ్య పడిపోవడంతో కొత్త టీచర్ల అవసరమే లేదని, ఉన్న టీచర్లే మిగిలిపోయారని గత జగన్ ప్రభుత్వం తేల్చింది. దీంతో ప్రభుత్వ పాఠశాలలు మళ్లీ పుంజుకోవడం కష్టమేనని భావించిన సమయంలో కూటమి ప్రభుత్వం వినూత్న విధానాలు ప్రవేశపెట్టింది. ముఖ్యంగా కునారిల్లుతున్న ప్రాథమిక విద్యను తిరిగి గాడిలో పెట్టేందుకు మోడల్ ప్రైమరీ స్కూళ్లు అనే కొత్త విధానం తీసుకొచ్చింది. గతేడాది వరకూ రాష్ట్రంలో ఒకరిద్దరు టీచర్లతోనే నెట్టుకొస్తున్న ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక టీచర్ అనే విధానం అమల్లోకి తెచ్చింది. రెండుమూడు దశాబ్దాల కిందట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు పెద్దసంఖ్యలో ఉండేవారు. ప్రతి పాఠశాలలో కనీసం ముగ్గురు చొప్పున టీచర్లు పాఠాలు చెప్పేవారు. కాలక్రమంలో ప్రైవేటు పాఠశాలలు పెరగడంతో ప్రభుత్వ ప్రాథమిక విద్య అత్యంత దయనీయంగా మారింది. నలుగురైదుగురు పిల్లలతో నడుస్తున్న బడుల సంఖ్య వేలల్లోకి చేరింది. గత విద్యా సంవత్సరం వరకు 20 మంది విద్యార్థులు కూడా లేని పాఠశాలల సంఖ్య 13వేలుగా ఉంది. ఈ పరిస్థితిని చక్కదిద్దే లక్ష్యంతో కొత్తగా మోడల్ ప్రైమరీ స్కూళ్లను ప్రవేశపెట్టారు. గతంలో ఉన్నట్టుగా తరగతికి ఒక టీచర్ విధానం తెచ్చారు. ప్రస్తుతం ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఐదు తరగతులకు కలిపి ఒక్కరే టీచర్ బోధిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య 45 దాటిన పాఠశాలలను మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా మార్చారు. రాష్ట్రవ్యాప్తంగా 9600 ప్రాథమిక పాఠశాలలు మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా మారాయి. వాటిలో 45 నుంచి 59 వరకు విద్యార్థులుంటే నలుగురు టీచర్లను, 59 దాటితే ఐదుగురు టీచర్ల చొప్పున కేటాయించారు. ఆ పాఠశాలలకు హెచ్ఎం పోస్టు కూడా ఇచ్చారు.

**జీవో 117 రద్దు**

వైసీపీ ప్రభుత్వం జీవో 117ను తీసుకొచ్చి పాఠశాల విద్యను అస్తవ్యస్తం చేసింది. ఉపాధ్యాయులు ఈ జీవో మాకొద్దు అని రోడ్డెక్కే స్థాయిలో ఆ జీవో ప్రభుత్వ విద్యపై ప్రతికూల ప్రభావం చూపింది. టీచర్లకు బోధన సమయాన్ని అమాంతం పెంచేసి గుక్క తిప్పుకోకుండా చేశారు. 4250 ప్రాథమిక పాఠశాలల్లోని 3 నుంచి 5 తరగతులను సమీప ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసి ఊరి బడిని దూరం చేశారు. ఫలితంగా మా బడి మాకు కావాలని తల్లిదండ్రులూ రోడ్డెక్కే పరిస్థితి వచ్చింది. అప్పుడే తాము అధికారంలోకి వస్తే జీవో 117ను రద్దుచేస్తామని తెలుగుదేశం నేతలు హామీ



ఇచ్చారు. హామీకి అనుగుణంగా కూటమి ప్రభుత్వం జీవో 117ను రద్దు చేసి ప్రత్యామ్నాయంగా జీవో 21ను తీసుకొచ్చింది. టీచర్ల బోధన సమయాన్ని వారానికి 32 పీరియడ్లకు తగ్గించింది. ఉన్నత పాఠశాలల్లో సెక్షన్‌కు విద్యార్థుల సంఖ్యను 53 నుంచి 49కు తగ్గించింది. ఫౌండేషనల్ పాఠశాలల్లో గతంలో 30 మంది విద్యార్థులు దాటితే రెండో టీచర్‌ను ఇచ్చేవారు. నూతన విధానంలో 20 మంది దాటితే రెండో టీచర్‌ను ఇస్తున్నారు.

**తొమ్మిది రకాల పాఠశాలలు**

గత ప్రభుత్వంలో ఆరు రకాల బడుల విధానం ఉండగా కూటమి ప్రభుత్వం వాటిని తొమ్మిది రకాల బడులుగా మార్చింది. తొమ్మిది రకాల బడుల విధానంపై తొలుత వ్యతిరేకత వచ్చింది. ఆ తర్వాత నూతన మోడల్ ప్రైమరీ స్కూళ్లు, పనిభారం తగ్గింపుతో వ్యతిరేకత కొంతమేర తగ్గింది. శాటిలైట్ ఫౌండేషనల్ స్కూల్(ప్రీప్రైమరీ 1, ప్రీప్రైమరీ 2), ఫౌండేషనల్ స్కూల్(ప్రీప్రైమరీ 1, ప్రీప్రైమరీ 2, 1, 2 తరగతులు), బేసిక్ ప్రైమరీ స్కూల్(ప్రీప్రైమరీ 1, ప్రీప్రైమరీ 2, 1–5 తరగతులు), మోడల్ ప్రైమరీ స్కూల్(ప్రీప్రైమరీ 1, ప్రీప్రైమరీ 2, 1–5 తరగతులు), ప్రాథమికోన్నత పాఠశాల(ప్రీప్రైమరీ 1, ప్రీప్రైమరీ 2, 1–8 తరగతులు), ఉన్నత పాఠశాల (6– 10 తరగతులు), ఉన్నత పాఠశాల (1– 10 తరగతులు), ఉన్నత పాఠశాల ప్లస్(6– 12 తరగతులు), ఉన్నత పాఠశాల ప్లస్(1– 12 తరగతులు) విధానం అమలు చేస్తున్నారు. 45 మంది విద్యార్థులు దాటిన పాఠశాలలను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా పరిగణించి ప్రతి తరగతికి ఒక టీచర్‌ను ఇచ్చారు. బేసిక్ ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా టీచర్లు ఉంటారు.

**పూర్తిస్థాయిలో టీచర్లు**

చాలాకాలం నుంచి పాఠశాలల్లో టీచర్ పోస్టుల బ్లాకింగ్ విధానం అమల్లో ఉంది. అంటే ప్రతి పాఠశాలలో కనీసం ఒకట్రెండు పోస్టులు ఖాళీగా ఉంచుతారు. టీచర్ల కొరత కారణంగా ఈ విధానం అమలుచేసేవారు. కానీ కూటమి ప్రభుత్వం చేసిన టీచర్ల బదిలీల్లో బ్లాకింగ్ విధానం తొలగించింది. దీంతో టీచర్లు పట్టణాలకు దగ్గరగా ఉన్న పాఠశాలలను ఎక్కువగా కోరుకుని అక్కడికి వెళ్లారు. దీంతో అక్కడ వంద శాతం టీచర్లు నిండారు. పూర్తి గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో కొరత పెరిగింది. ఇప్పుడు కొత్త టీచర్లతో ఆ పాఠశాలల్లో ఖాళీలన్నీ భర్తీ అవుతాయి. దీంతో దాదాపుగా అన్ని పాఠశాలల్లో నూరు శాతం టీచర్ల భర్తీ జరుగుతుంది. దీనివల్ల సబ్జెక్టు టీచర్ కొరత ఉండదు.

**రేపటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన**

**డీఎస్సీ కాల్ లెటర్లలో జాప్యం**

డీఎస్సీ మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం నుంచి చేపట్టనున్నట్లు పాఠశాల విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. కాల్ లెటర్ల విడుదలలో ఏర్పడిన జాప్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం కాల్ లెటర్లు విడుదల చేసి సోమవారం నుంచి సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టాలని తొలుత నిర్ణయించారు. కానీ, ఆదివారం అర్ధరాత్రి వరకు కాల్ లెటర్లు విడుదల కాలేదు. సోమవారం ఉదయం కాల్ లెటర్లు విడుదల చేసే అవకాశం ఉంది. దీంతో సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం నుంచి చేపట్టనున్నారు.

## ఎరువులపై విజిలెన్స్ దాడులు ముమ్మరం చేయాలి

-మొదటిపేజీ తరువాయి

వ్యవసాయశాఖ, విజిలెన్స్ విభాగాల అధికారులతో సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా ఎరువుల సరఫరాపై ఆయన ఆరా తీశారు. అవసరానికి తగినంత యూరియా అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. వ్యవసాయేతర అవసరాలకు యూరియా తరలించకుండా కట్టడి చేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. 'ప్రైవేటు వ్యాపారులకు కేటాయింపులు తగ్గించాలి. 70% ఎరువులను మార్క్‌ఫెడ్‌కే ఇవ్వాలి. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్), రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కే) ద్వారా రైతులకు ఎరువుల్ని అందుబాటులో ఉంచేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలి. అక్కడ సరిపడా నిల్వలు ఉంచాలి. రైతులు ఎక్కడా యూరియా కోసం ఇబ్బందులు పడకూడదు' అని అన్నారు. 'స్థానిక అధికారులతో.. జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలి. పరిశ్రమలు, రవాణా, విజిలెన్స్, పోలీసు, వ్యవసాయ అధికారులు, జిల్లా కలెక్టర్ల సమన్వయంతో రోజువారీ పరిశీలన జరగాలి. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలి. ఎక్కడైనా సమస్య వస్తే స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలి' అని ఆదేశించారు. ఎరువుల సరఫరా, నిల్వల పోర్టల్‌పైనా ఈ సందర్భంగా సీఎం ఆరా తీశారు. 'రియల్ టైమ్ ప్రాతిపదికన ఐఎంఎఫ్ఎస్ పోర్టల్‌లో ఎరువుల అమ్మకాల సమాచారం అప్‌డేట్ కావడం లేదు. సాకులు చెప్పకుండా నిరంతరం ఈ సమాచారాన్ని అప్‌డేట్ చేయాలి. ఎరువుల వాడకంపై రైతుల్లో అవగాహన పెంచాలి' అని ఆదేశించారు.

# దోపిడీలో స్మార్ట్ రి'కార్డు'


కొత్త రైస్ కార్డుల ఖర్చు రూ.8 కోట్లు

పేరుకే స్మార్ట్.. సాంకేతికత ఎక్కడ

నిత్యావసర సరుకులు అపేసి కొత్త కార్డులిస్తే సామాన్యులకు లాభమేంటి

కేవలం కమీషన్ల కోసమే కొత్త కార్డులు ఇస్తున్న ప్రభుత్వం

కొత్త కార్డుల పంపిణీని గొప్పగా ప్రచారం చేసుకుంటున్న కూటమి




అమరావతి

కూటమి ప్రభుత్వం సాంకేతికత పేరుతో నిత్యం ప్రజలను మోసం చేస్తోంది. టెక్నాలజీ సాయంతో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామంటూ కోతలు కోస్తోంది. ఇందులో భాగంగానే ప్రజా పంపిణీ వ్యవస్థలో (పీడీఎస్) 'స్మార్ట్ కార్డుల పంపిణీ'ని ఘనకీర్తిగా ప్రచారం చేసుకుంటూ అభాసుపాలవుతోంది. వాస్తవానికి, ప్రభుత్వం కొత్తగా పంపిణీ చేసే కార్డులు పేరుకే స్మార్ట్.. అందులో ఎటువంటి సాంకేతికతను అనుసంధానించే చిప్ వ్యవస్థ లేదు. చిన్న సైజులో కార్డులను ముద్రించి దానికి సాంకేతిక పరిభాషలోని 'స్మార్ట్'ను జోడించి లబ్ధిదారులను మభ్యపెడుతోంది. దీని కోసం ఏకంగా రూ.8 కోట్ల వరకు ఖర్చు చేయడం గమనార్హం. సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 1.45 కోట్ల లబ్ధిదారులకు కొత్త కార్డుల పంపిణీ చేపట్టనుంది.

**అదనపు లబ్ధి శూన్యం!**

కేంద్ర ప్రభుత్వం పీడీఎస్‌ను సాంకేతిక వ్యవస్థతో అనుసంధానించింది. వన్ నేషన్.. వన్ రేషన్ నినాదాన్ని తీసుకొచ్చింది. అంటే, వేలిముద్ర వేసి దేశంలో ఎక్కడ నుంచైనా రేషన్ తీసుకునే వెసులుబాటు కల్పించింది. ఆధార్ నంబర్ ద్వారా కూడా రేషన్ పొందొచ్చు. కేములం ప్రభుత్వంలోని ఉమాత్యులు, కొందరు అధికారులు కమీషన్ల కోసం ఇలాంటి కొత్త ఆలోచనలను సృష్టించి స్మార్ట్‌గా వెనకేసుకుంటున్నట్టు వినికిడి. పైగా పాత కార్డులో కుటుంబ సమేతంగా రేషన్ లబ్ధిదారులు ఫొటోలు ఉండేవి. స్మార్ట్ కార్డులో ఇంటి యజమానురాలి పాస్‌పోర్టు సైజు ఫొటో తప్ప ఇతరులు కనిపించరు. కేవలం వారి పేర్లు మాత్రమే ఉంటాయి. అది కూడా మూడు పేర్ల వరకు బాగానే కనిపిస్తాయి. అంతకు మించి ఎక్కవ మంది లబ్ధిదారులు ఒకే కార్డులో ఉంటే వారి పేర్లు కుచించుకుపోవడం, లేదా లేకుండా ఉండటమే ఈ స్మార్టు కార్డు ప్రత్యేకత. దీనికి ఒక క్యూఆర్ కోడ్‌ను పెట్టి మిగిలిన వారి పేర్లు అందులో జోడిస్తున్నట్టు సమాచారం. వాస్తవానికి, ఈ%–%పోస్ మెషిన్‌కు, బియ్యం తూకం వేసే ఎలక్ట్రిక్ కాటాకు అనుసంధానం ఉండాలి. లబ్ధిదారుడి వివరాల ప్రకారం ఎలక్ట్రిక్ కాటాలో సరైన తూకంలో బియ్యం వేస్తేనే ఈపోస్ మెషిన్ అంగీకరించి లావాదేవీని అనుమతిస్తుంది. ఇది కేంద్ర ప్రభుత్వం నిబంధన మేరకు ప్రవేశపెట్టిన ప్రక్రియ. కానీ, కూటమి పాలనలో కొందరు డీలర్లు ఈ%–%పోస్ మెషిన్లను చేతుల్లో పెట్టుకుని తిరుగుతూ ఇష్టారీతిలో పీడీఎస్ వ్యవస్థను భ్రష్టు పట్టిస్తుంటే.. ప్రభుత్వం బయట గొప్పలు చెప్పుకుంటోంది.

**స్మార్ట్ కోతలు.. పంపిణీలోనూ కోతలే!**

రేషన్ సరుకుల పంపిణీలోనూ కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది. ఒక్క బియ్యం మినహా మరే సరుకులూ ఇవ్వడం లేదు. కందిపప్పు, పామాయిల్, చింతపండు, గోధుమ పిండి తదితర సరుకులన్నీ ఎక్కడా ఇవ్వడం లేదు. ఎన్నికల సమయంలో మాత్రం 18 రకాల నిత్యావసరాలు ఇస్తామని ప్రగల్భాలు పలికారు. తీరా, అధికారంలోకి వచ్చాక.. గత ప్రభుత్వం ఇస్తున్న సరుకులన్నింటినీ ఆపేశారు. రూ.220 కోట్లకుపైగా కందిపప్పు బకాయిలు పేరుకుపోవడంతో కాంట్రాక్టర్లు సరఫరాకు కూడా ముందుకు రావట్లేదు.

## సుధాకర్‌రెడ్డికి తుది వీడ్కోలు



-మొదటిపేజీ తరువాయి

భౌతిక కాయానికి పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం సుధాకర్‌రెడ్డి భౌతిక కాయాన్ని గాంధీ వైద్య కళాశాలకు అప్పగించేందుకు అంతిమ యాత్ర మొదలైంది. ఇందులో భాగంగా హిమాయత్‌నగర్ వై జంక్షన్ వరకు పోలీసుల మార్చ్ సాగింది. అక్కడి నుంచి రెడ్ వాలంటీర్లు కవాతు చేశారు. నారాయణగూడ చౌరస్తా, చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, ముషీరాబాద్ మీదుగా యాత్ర సాగింది. సాయంత్రం 4.45 గంటలకు సురవరం భౌతిక కాయాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించారు. ఈ సందర్భంగా విప్లవ జోహార్లు అంటూ కార్యకర్తలు పాటలు పాడుతూ సుధాకర్‌రెడ్డికి కడసారి వీడ్కోలు పలికారు.

**రేవంత్, చంద్రబాబు నివాళి..**

సీపీఐ దిగ్గజ నేత సురవరం సుధాకర్ రెడ్డి పేరును శాశ్వతంగా గుర్తుండేలా చేస్తామని, ఈ మేరకు క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజలకు ఆదర్శంగా నిలిచిన వారిని తమ ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. మఖ్దూం భవన్‌లో సుధాకర్‌రెడ్డి భౌతిక కాయానికి రేవంత్ నివాళులు అర్పించారు. సురవరం మృతి సీపీఐకి, దేశానికి తీరని లోటని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. సుధాకర్‌రెడ్డి భౌతిక కాయానికి చంద్రబాబు అంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. సురవరంతో తనకు సుదీర్ఘ స్నేహం ఉందని చంద్రబాబు తెలిపారు. ఆయనకు అనేక ఉద్యమాలు నడిపిన అనుభవం ఉందని అన్నారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సురవరం భౌతిక కాయానికి నివాళులు అర్పించి, సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సురవరం మా తొలి ప్రొఫెసర్

గాంధీ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిర

సుధాకర్ రెడ్డి భౌతిక కాయాన్ని వైద్య కళాశాలకు అప్పగించడం స్ఫూర్తిదాయకం. ఆయన గాంధీ కళాశాల విద్యార్థులకు తొలి అనాటమీ ప్రొఫెసర్ అవుతారు. ఆయన శరీరం ద్వారా ఎంతో మంది విద్యార్థులు వైద్య శాస్త్రాన్ని నేర్చుకుంటారు. ఆయన కుటుంబ సభ్యులు, సీపీఐ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు.



## కోరుకొండలో నలుగురు బెట్టింగ్ రాయుళ్లు అరెస్టు

**డీఎస్పీ వైస్ శ్రీకాంత్.**

**8.40 లక్షలు సీజ్.**

**8 చరవాణీలు, యాక్టివా బైక్ స్వాధీనం.**



**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:**

కోరుకొండ మండలం కాపవరంలో ఆన్లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురు బెట్టింగ్ రాయుళ్లలను అరెస్టు చేసినట్లు రాజమహేంద్రవరం ఉత్తర మండల డిఎస్పి వై శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం కోరుకొండ పోలీస్ స్టేషన్లో ఎస్పి శ్రీకాంత్ పాత్రికేయులతో మాట్లాడుతూ ఆదివారం ఉదయం కాపవరం గ్రామంలో ఒక ఇంట్లో ఆన్లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం ప్రకారం తమ సిబ్బంది ఇంటిపై దాడి నిర్వహించమన్నారు. ఈ దాడిలో కాపవరం గ్రామానికి చెందిన గోసంశెట్టి వీర ప్రసాద్, జాజుల బాల చక్రం, గుమ్మలదొడ్డి గ్రామానికి చెందిన కొణతాల నానాజీ, అచ్చుతాపురం గ్రామానికి చెందిన నల్లల లక్ష్మీ నరసయ్యలను అరెస్టు చేసి వారి వద్ద నుండి 8.40 లక్షల రూపాయల నగదు, 8 చరవాణీలు, ఎల్ఈడి టీవీ, యాక్టివ్ హెూండా బైక్ స్వాధీనం చేసుకున్నామన్నారు. నలుగురు అరెస్ట్ చేసి, కోర్టుకు తరలించమన్నారు. వైజాగ్ కి చెందిన రాకేష్ ఆన్లైన్ బెట్టింగ్ కి ప్రముఖుడని, రాకేష్ తో పాటు మరో ఆరుగురు పరారీలో ఉన్నారని వారి కోసం పోలీసులు గాలిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీకాంత్ మాట్లాడుతూ అపరిచితులకు ఇల్లు అద్దెకి ఇవ్వొద్దని, వారి సమాచారం పూర్తిగా తెలుసుకొని అద్దెకు ఇవ్వాలన్నారు. యువత కష్టపడకుండా డబ్బు సంపాదించాలన్న దురుద్దేశంతో ఆన్లైన్ బెట్టింగ్ లకు పాల్పడి, అన్ని విధాల నష్టపోయాక ఆత్మహత్య చేసుకున్న సందర్భాలు ఉన్నాయ న్నారు. కుటుంబ సభ్యులు తమ పిల్లల రోజువారి కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన కోరుకొండ ఎస్సై నాగార్జున, ట్రైనీ ఎస్సై అంజని, సీతానగరం ఎస్సై రామ్ కుమార్, హెచ్ సి శ్రీను, ప్రసాద్, రమేష్, గోవింద్, సతీష్, జి గోపి, ఏసుబాబు తదితరులకు శ్రీకాంత్ చేతుల మీదగా రివార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పవర్ లిఫ్టింగ్ పోటీల ఛాంపియన్ ట్రోఫీలు, ఒలింపిక్ మెడల్స్ ఆవిష్కరణ

**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** పవర్ లిఫ్టింగ్ పోటీల ఛాంపియన్ ట్రోఫీలు, ఒలింపిక్ మెడల్స్ ఆవిష్కరణ. నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా ఈనెల 29న ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ అమలాపురంలో 4వ యునైటెడ్ ఈస్ట్ అండ్ వెస్ట్ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీలను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు సంబంధించిన చాంపియన్షిప్ ట్రోఫీలను, ఒలింపిక్ మెడల్స్ ను ఆదివారము ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ నందు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లాడ శరత్ బాబు ఆవిష్కరించారు. ఈ పోటీలు యొక్క వివరాలను జిల్లా ఒలింపిక్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పప్పుల శ్రీరామ్ చంద్ర మూర్తి వివరిస్తూ .. ఈ పవర్ లిఫ్టింగ్ పోటీలను సబ్-జూనియర్, సీనియర్, మాస్టర్స్ ( పురుషులు, మహిళలు) విభాగాలలో



30 క్యాటగిరి లలో నిర్వహించి, విజేతలకు మెరిట్ సర్టిఫికెట్స్, ఒలింపిక్ మెడల్స్ ను, ఛాంపియన్షిప్ ట్రోఫీలను, నగదు బహుమతులను బహుకరిస్తామని తెలిపారు.. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సెక్రెటరీ డాక్టర్ గోకరకొండ నాగేంద్ర, వైస్ ప్రెసిడెంట్ కల్వకొలను బాబు, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గారపాటి చంద్రశేఖర్, ఈ పోటీలకు ఛాంపియన్ ట్రోఫీల స్పాన్సర్ అమలాపురం వైస్ ఎంపీపీ అడపా వెంకట సుబ్రహ్మణ్యం ( అడపా భోగి రాజు జ్ఞాపకార్థం చాంపియన్ ట్రోఫీలను బహుకరిస్తున్నారు ), అమలాపురం టౌన్ టిడిపి లీడర్ ఆశెట్టి ఆదిబాబు, సాకూరు గున్నేపల్లి సర్పంచ్ పెద్దిరెడ్డి రాము, మెంబర్స్ ఎరుబంటి చంటి, గొల్లగోటి నారాయణరావు, నార్ని శ్రీను, పవర్ లిఫ్టింగ్ పోటీల ఆర్గనైజర్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

ఉత్సవ మండపాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేసుకోవాలి

నిమజ్జన కార్యక్రమ వివరాలు ముందుగానే పోలీస్ వారికి తెలపాలి

ఇతర మత మందిరాల కు దూరంగా మండపాలు ఏర్పాటు చేయాలి

డీజేలు, బాణసంచా, అశ్లీల నృత్యాలు నిర్వహించరాదు

మండపేట రూరల్ సీఐ పి దొర రాజు



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్:** వినాయక చవితి ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని మండపేట రూరల్ సీఐ పి దొర రాజు అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలో పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఆదివారం స్థానిక ఎస్సై డి సురేష్ బాబు అధ్యక్షతన, మండల వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు అనుమతులు పొందిన మండప కమిటీలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తొలుత రాయవరం ఎస్సై సురేష్ బాబు మాట్లాడుతూ మండపాల నిర్వహణకు అనుమతులు పొందిన 57 కమిటీల వారు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, క్యూఆర్ కోడ్ లను లామినేషన్ చేసి అందుబాటులో ఉంచుకోవాలన్నారు, మండపం వద్ద విలువైన వస్తువులు, వెండి, బంగారు వస్తువులను ఉంచవద్దని, ముఖ్యంగా రాత్రి సమయంలో ప్రతిరోజు మండపం వద్ద హుండీల కు కాపలాగా ఇద్దరు వ్యక్తులు పహారా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారుల పై వచ్చి పోయే వాహనాలకు ఇబ్బంది కలిగించకుండా ఏర్పాట్లు చేసుకోవాలని, మండపాల వద్ద, నిమజ్జనం కార్యక్రమ, ఊరేగింపు సమయంలో బాణాసంచా ను ఉపయోగించ రాదని, నిమజ్జనానికి ఒక రోజు ముందుగానే పోలీస్ స్టేషన్ లో తెలియపరిచి అనుమతులు పొందాలని, అసాంఘిక కార్యకలాపాల జోలికి పోకుండా వ్రతం ఆచరించినట్లు భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమాలు నిర్వహించాలని, చిన్నపిల్లలు, అధికంగా మద్యం సేవించిన వారు నిమజ్జన కార్యక్రమాలకు దూరంగా ఉండేలా చూడాలని కమిటీలకు సూచించారు. అనంతరం మండపేట రూరల్ సిఐ పి దొర రాజు మాట్లాడుతూ వినాయక ఉత్సవాల నిర్వహణకు బాధ్యతలు తీసుకున్న వ్యక్తులు మధ్యలో తొలగిపోక, పూర్తి బాధ్యతలు వహించాలని 5 అడుగుల పరిమితికి మించిన విగ్రహాలను పెట్టొద్దని, సాధ్యమైతే మట్టి విగ్రహాలను ఉపయోగిస్తూ, పర్యావరణహితం గా ఉండేలా చూడాలని సూచించారు. దురలవాట్లకు దూరంగా ఉండే వారే మండపంలో వద్ద బాధ్యతలు వహించే లా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా ఇతర మతాలకు సంబంధించిన దేవాలయాల వద్ద మండపాలు ఏర్పాటు చేసి కించపరిచే వ్యాఖ్యల ద్వారా మతసామరస్యం దెబ్బతినేలా ప్రవర్తించకూడదని హెచ్చరించారు. వినాయక చవితి ఉత్సవాలలో ప్రాముఖ్యమైన మండపం లోని లడ్డు వంటి పవిత్రమైన వస్తువులకు రక్షణ కల్పించేలా పటిష్ట భద్రతను ఏర్పాటు చేసుకోవాలని, అవసరమైతే తాత్కాలిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపం నిమిత్తం ఏర్పాటు చేసే విద్యుత్తును డైరెక్ట్ గా తీగల నుండి కాక, దగ్గరలోని దేవాలయాలు లేదా సమీపంలోని గృహాల వద్ద నుండి అనుమతి పొంది విద్యుత్తును తీసుకోవాలని వివరించారు, దీపాలు, మండే గుణం కలిగిన వస్తువులు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అగ్ని ప్రమాదాలను అదుపు చేసేందుకు నీరు, ఇసుక బస్తాలు, చిన్నపాటి అగ్నిమాపక యంత్రాలు వంటివి ముందుగానే చూసుకోవాలని సూచించారు, ప్రైవేట్ స్థలాలలో మండపాలు ఏర్పాటు చేసుకునేవారు తప్పనిసరిగా స్థల యజమాను ల వద్దనుండి అనుమతి పొందాలని, దేవాలయాలలో కాక విడిగా మండపాలు ఏర్పాటు చేసుకునేవారు తప్పనిసరిగా రామచంద్రపురం డిఎస్పీ కార్యాలయం నుండి సౌండ్ పర్మిషన్ పొందాలని, ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే పాటలు భజనలు సాంస్కృతిక కార్యక్రమాలు వంటివి మోనో స్పీకర్స్ ద్వారా నిర్వహించాలని హెచ్చరించారు. నిమజ్జన కార్యక్రమం జరిగించడాని కి ఒకరోజు ముందుగా రూట్ మ్యాప్, ఏర్పాట్ల గూర్చి స్థానిక పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని తద్వారా పోలీస్,రెవిన్యూ, పంచాయితీ వారి ద్వారా ఊరేగింపుకు అవసరమైన ఏర్పాట్లు అందుతాయని ట్రాఫిక్ అంతరాయం లేకుండా మండపం నుండి నిర్ణిత నిమజ్జన ప్రాంతం వరకు బందోబస్తు ఏర్పాటు చేసి ఆ ప్రాంతంలో గజ ఈతగాళ్లు ను ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంటుందని వివరిస్తూ, ఈ నిమజ్జన కార్యక్రమాన్ని పురస్కరించుకొని, డిజే కు ఎటువంటి పర్మిషన్ లేదని కనుక ఎవరు పెట్టొద్దని వివరించారు, కోయ డాన్సులు, హిజ్రాల వేషధారణలు వంటివి కాక సాంస్కృతిక వేషధారణలతో నిమజ్జన కార్యక్రమాన్ని మర్యాదగా సాగినవ్వాలని, అశ్లీల నృత్యాలు,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి స్వామివారికి అపకీర్తిని తేవద్దని హెచ్చరించారు. కార్యక్రమాలు పూర్తయి క్షేమంగా ఇంటికి చేరేంతవరకు బాధ్యతలను కమిటీలు స్వీకరించాలని, మండలంలో వినాయక చవితి ఉత్సవాలు,పోలీసులకు సహకరిస్తూ ప్రశాంతంగా జరిగేలా అన్ని విధాలుగా బాధ్యతలు వహిస్తూ ముందుండి నడిపించాలని మండపేట రూరల్ సిఐ దొర రాజు కమిటీలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎ ఎస్సై రాంబాబు, హెడ్ కానిస్టేబుల్ వీర్రాజు, మండలంలోని వినాయకచవితి ఉత్సవ కమిటీ లు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆల్ ఈజ్ వెల్ సభ్యుల చే జె ఎన్ టి యు లో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం....




**కాకినాడ సిటీ:విశ్వం వాయిస్ న్యూస్** స్థానిక జె ఎన్ టి యు లో కాకినాడ ఆల్ ఈజ్ వెల్ సభ్యుల చే పర్యావరణ పరిరక్షణ లో భాగంగా మొక్కలు నాటడం మరియు అనవసరమైన మొక్కల ను ఏరివేసే క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలు చేపట్టారు.మరీ ఎక్కువ గా పెరిగిపోయిన గడ్డి మరియు తుప్పలను గ్రాస్ కట్టర్ తో శుభ్రం చేసారు. ఆల్ ఈజ్ వెల్ స్థాపకులు కిషోర్ మాట్లాడుతూ" ఒక చెట్టును నాటడం ద్వారా, మీరు మన పిల్లలకు పచ్చని స్థలాన్ని మరియు కల్తీ లేని ఆక్సిజన్ను అందించవచ్చని, స్థానిక మొక్కలతో తోటపనికి కూడా ఇది వర్తిస్తుందని. అవి తక్కువ నిర్వహణను కలిగి ఉండటమే కాకుండా, నీటిని ఆదా చేస్తాయని, కార్బన్ కాలుష్యాన్ని తగ్గిస్తాయని, ఎక్కువ ఎరువులు లేదా పురుగుమందులు అవసరం లేకుండా స్థానిక వన్యప్రాణుల ఆరోగ్యానికి మద్దతు ఇస్తాయని,పర్యావరణ పరిరక్షణ కోసం తపించే ప్రతి ఒక్కరూ మా సంస్థ కు ఒక చెట్టును దానం చేయవచ్చని అన్నారు. కాకినాడ ఐడిఎ కార్యదర్శి డా అడ్డాల మాట్లాడుతూ" పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి అత్యంత ప్రభావవంతమైన మార్గాలు .. మీ ఆహారాన్ని స్థానికంగా ఎక్కువగా కొనడం లేదా మీరే పెంచుకోవడం, మీ ఆహార వ్యర్థాలను కంపోస్ట్ చేయడం, ఎక్కువ గా మొక్కలు నాటడం, కారును తక్కువగా ఉపయోగించడం, నీటిని ఆదా చేయడం, రసాయన వినియోగాన్ని తగ్గించడం, పర్యావరణ సమస్యల గురించి శ్రద్ధ వహించడం మరియు ప్రకృతి తల్లితో మీ స్వంత సంబంధాన్ని పెంపొందించుకోవడం అని అన్నారు. ఈ పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం లో రవి వర్మ, రాజేంద్ర రెడ్డి, టి. వి. వి. ఎస్. ఎన్. రెడ్డి,స్వామి, కమలాకర్, చక్రధర్, తేజ, రమేష్, బాబి, సూర్య,వినోద్ పాల్గొని శ్రమదానం చేసారు.

## వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్‌గా వెంకటరత్నం




**విశ్వం వాయిస్- కాజులూరు** కాజులూరు శ్రీ జగన్నాథవేణుగోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గా పుల్లెపు వెంకటరత్నం(నాని) నియమితులయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బండారు లోవరాజు, సాలిగ్రామ సుబ్బలక్ష్మి, బండారు రాజేశ్వరి, వాసంశెట్టి సత్యవేణి, రేకాడి త్రినాథవర్మ, మాసాబత్తుల మణి, గండికోట లోవరాజు, మేడూరి వీరాంజనేయులు ఎంపికయ్యారు. కొత్తగా ఎంపికైన ఆలయ కమిటీ సభ్యులు రామచంద్రపురం నియోజకవర్గ జనసేన ఇన్చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు చంద్రశేఖర్ ఆలయ కమిటీని ప్రత్యేకంగా అభినందించారు. జనసేన నాయకులు అన్యం శ్రీరామచంద్రమూర్తి, కాజులూరు సొసైటీ అధ్యక్షులు యాళ్ల వెంకటరమణ, నీటి సంఘం అధ్యక్షులు యాళ్ల సత్తిబాబు, జనసేన సీనియర్ నాయకులు యాళ్ల రవి, కూటీ రంజిత్ కుమార్, చోడిశెటి శ్రీను, ఆలయ అర్చకులు రాకుదిటి శ్రీనివాస్ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

## పవన్ జన్మదినాన్ని పురస్కరించుకొని. ఈ నెల 31న కాజులూరులో మెగా రక్తదాన శిభిరం

**విశ్వం వాయిస్- కాజులూరు** మండల కేంద్రమైన కాజులూరులో జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈనెల 31వ తేదీన మెగా రక్తదాన శిభిరం నిర్వహించనున్నట్లు జనసేన పార్టీ నాయకులు అన్యం శ్రీరామచంద్రమూర్తి పేర్కొన్నారు. కాజులూరు జడ్పీ హైస్కూల్ ప్రాంగణం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటలవరకు రక్తదాన శిభిరం నిర్వహించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. జనసేన కార్యకర్తలు, నాయకులు, పవన్ కళ్యాణ్ అభిమానులు ఈ శిభిరంలో పాల్గొని రక్తదానం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఎడిటర్ వాయిస్

# అరెస్ట్ అయితే ఔట్

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు రభస చేశాయి. నేరారోపణలు ఎదుర్కొంటూ రిమాండ్‌లో ఉండేవారు.. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో కొనసాగరాదంటూ ప్రభుత్వం కొత్త బిల్లును పార్లమెంట్ ముందుకు తెచ్చింది. పోలీసు కస్టడీలోకి వెళ్లిన 30రోజుల్లో రాజీనామా చేయాలి.. లేకపోతే పదవి దానంతట అదే పోతుందన్నది కొత్త బిల్లు ముఖ్యాంశముఖ్య ఉద్దేశ్యం ఏంటంటే.. తీవ్రమైన అవినీతి, ఇతర నేరారోపణలు ఎదుర్కొంటున్న వారు.. 30 రోజుల కంటే ఎక్కువగా పోలీసు కస్టడీలో ఉంటే ఆ మరుసటి రోజు నుంచి వారి పదవి ఉండదు. ప్రధాని, ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులందరికీ ఈ నిబంధన వర్తింపచేయనున్నారు. 5 ఏళ్ల కంటే ఎక్కువ శిక్ష పడే నేరారోణలు కలిగిన వారందరికీ ఈ నిబంధన వర్తింప చేయాలని కొత్త బిల్లులో ప్రతిపాదించారు. దీనిపైనే ఇండియా అలయెన్స్ తీవ్ర నిరసన వ్యక్తం చేస్తోంది.నేరం నిరూపణ అయ్యే వరకూ ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రతివ్యక్తి అనుమానితుడు మాత్రమే.. నేరారోణపులు ఎదుర్కొంటున్న వ్యక్తికి నిస్పాక్షికమైన విచారణ కోరుకునే హక్కు రాజ్యాంగం కల్పించింది. ఆర్టికల్ 21లో ఇది ఓ భాగం. కానీ ఈ కొత్త బిల్లు నేరు నిరూపణ, శిక్ష లేకండానే... కేవలం ఆరోపణల మీద ఆరెస్ట్ అయినా సరే... పదవి వదులు కోవాలని కొత్త బిల్లులో ప్రతిపాదించారు. ఆర్టికల్ 21 ప్రతివ్యక్తికీ జీవించే హక్కును, వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని కల్పించింది. నేరారోపణలు ఉంటే ఫెయిర్ ట్రయల్ పొందే హక్కు కల్పించింది. అలాగే ఆర్టికల్ 14 చట్టం ముందు ప్రతి ఒక్కరూ సమానులే అని చెబుతోంది. ఇప్పుడు తీసుకొచ్చే రాజ్యాంగ సవరణతో ఈ ప్రాథమిక హక్కులకే భంగం కలుగుతుందని ప్రతిపక్షాలు చెబుతున్నాయి.ప్రస్తుతం ఉన్న వెసులుబాటు.. అనేక సమస్యలకు కారణం అవుతోందని కేంద్రం చెబుతోంది.ఓ ముఖ్యమంత్రి జైలుకు వెళితే.. పరిపాలన అంతా కుంటుపడుతుంది. సీఎం జైలులో ఉంటే కేబినెట్ సమావేశాలు జరగవు. ఫైళ్లు ముందుకెళ్లవు. శాసన వ్యవహారాల్లో పాల్గొనలేరు.ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు మంత్రివర్గం సమిష్టిగా బాధ్యత వహిస్తుందని రాజ్యాంగం చెబుతోంది. కానీ ఇలా నిర్బంధంలో ఉన్న వారు చేసే పనులు రాజ్యాంగ పరంగా నైతికమేనా అన్న ప్రశ్న తలెత్తుతుంది.తీవ్రమైన నేరాలు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొనే వారు అత్యున్నత పదవుల్లో కొనసాగితే.. అవన్నీ సాధారణం అనే భావన పెరిగిపోతుంది. ఇంతటి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు వ్యవస్థలను నడిపిస్తుంటే ప్రజల్లో ఆ సంస్థల పట్ల విశ్వాసం దెబ్బతింటుంది.ఇప్పుడు ప్రతిపాదించిన బిల్లు చట్టరూపంలోకి వస్తే..నెలరోజులకు మించి కళంకితులు పదవుల్లో ఉండే అవకాశం లేదు. దీనిని రాష్ట్ర, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులతో పాటు.. ప్రధానిని కూడా దీని పరిధిలోకి తీసుకొచ్చామని కేంద్రం చెబుతోంది.రాజ్యాంగంలోని ఆర్టికల్ 75 ప్రధాని నియామకం, మంత్రిమండలి గురించి చెబుతుంది. మంత్రిమండలిలో అనర్హతపై చర్చించే ఆర్టికల్ 75, క్లాజ్ 5కు ఇప్పుడు సవరణ ప్రతిపాదించారు. దీని ప్రకారం క్లాజ్ 5ఎ చేరుస్తారు. ప్రతిపాదిత బిల్లులో కేంద్రమంత్రి వర్గంలోని సభ్యుడు నేరారోపణల కారణంగా ఐదు సంవత్సరాలకు పైబడి శిక్ష పడే నేరంలో నెలరోజుల పాటు కస్టడీలో ఉంటే... ప్రధాని సిఫారసుతో అతన్ని 31 వరోజు రాష్ట్రపతి తొలగించాలి.ఇదే పరిణామాలతో ప్రధానమంత్రి ఐదేళ్ల పైబడి శిక్ష పడే నేరారోణపణలు ఎదుర్కొంటూ.. 30 రోజులకు పైబడి కస్టడీలో ఉన్నట్లైతే.. ఆయన స్వయంగా రాజీనామా చేయాలి. లేనిపక్షంలో 31వరోజు నుంచే ప్రధాని పదవి ఉండదు.ఆర్టికల్ 164 లోని ముఖ్యమంత్రి నియామకానికి సంబంధించి 4వ క్లాజ్‌కు అదనంగా 4ఎ జతపరుస్తారు. దీని ప్రకారం ఆరోపణలు ఎదుర్కొంటున్న రాష్ట్ర మంత్రులను ముఖ్యమంత్రి సిఫారసుతో గవర్నర్ 31వ రోజు తొలగిస్తారు. అలాగే ఈ విధమైన ఆరోపణలు ఎదుర్కొనే ముఖ్యమంత్రి నెలరోజులలోపు రాజీనామా చేయకపోతే.. 31వ రోజు నుంచి సీఎంగా పరిగణించరు.ఇదే పద్ధతిలో ఆర్టికల్ 239ఎఎలో 5వ క్లాజ్ ను సవరించి ఢిల్లీ ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రులకు ఇదే వర్తింపచేస్తారుచూడటానికి నైతిక స్ఫూర్తితో .. పాలనా వ్యవస్థలను సంస్కరించేందుకు తెచ్చిన గొప్ప సంస్కరణగా ఇది కనబడుతున్నా.. దీనిపై పెద్ద రాజకీయం ఉందని ప్రతిపక్షాలు అంటున్నాయి. అందుకే వాళ్లు ఆ స్థాయిలో దీనిని వ్యతిరేకించారు. ప్రతిపక్షాల గొడవకు పార్లమెంట్‌లోకి మార్షల్స్ రావలసి వచ్చింది.



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# కొత్త పొద్దులో తపాలాభారతి




ఘన చరిత్ర కలిగిన తపాలా శాఖ ఎట్టకేలకు నిద్రావస్థను వీడి ప్రైవేట్ కొరియర్ సంస్థలతో పోటీకి దీటుగా డిజిటలైజేషన్ వైపు అడుగులు వేస్తోంది. దశలవారీగా దేశమంతటా పోస్టాఫీసుల్లో సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్ ప్రక్రియ చేపట్టారు. నగదు రహిత ఆన్‌లైన్ చెల్లింపులకు మార్గం సుగమమైంది. మరోపక్క లాభసాటి కాదనుకుంటున్న రిజిస్టర్డ్ పోస్టు విత్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్ సర్వీసు ఈ నెలాఖరు నుంచి రద్దు చేస్తున్నారు. గతంలో రద్దు చేసిన రిజిస్టర్డ్ బుక్‌పోస్ట్ స్థానంలో ఈ ఏడాది మే 1 నుంచి జ్ఞాన్ పోస్ట్ సర్వీసును ప్రవేశపెట్టారు. వ్యాపార విస్తరణలో భాగంగా ఇ%-%కామర్స్ తరహాలో ఆదివారాలు, సెలవు రోజుల్లోనూ బట్వాడాకు పథకాలు రచిస్తున్నారు. లాభాలే లక్ష్యం చేసుకోకుండా, సామాన్యుడిపై భారం మోపకుండా సేవల నాణ్యతను పెంచడం ఇప్పుడు తపాలాశాఖ ముందున్న సవాలు. భారతదేశ తపాలా శాఖకు సుదీర్ఘ చరిత్ర ఉంది. బ్రిటిష్ ఇండియా గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్స్ 1774 మార్చిలో, ఈస్టిండియా కంపెనీ వాణిజ్య ప్రయోజనాల పరిరక్షణ కోసం మొదటిసారి తపాలా సేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. లార్డ్ డల్‌హౌసి 1850లో ఏర్పాటు చేసిన పోస్టాఫీస్ కమిషన్ సిఫారసుల మేరకు 1854లో పోస్టాఫీస్ చట్టాన్ని తెచ్చారు. బెంగాల్ ప్రధాన కేంద్రంగా 700 పోస్టాఫీసులు హోంమంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో పనిచేసేవి. సంస్థాన ప్రాంతాలు సహా దేశమంతటా ఒకే టారిఫ్, పోస్టల్ స్టాంపులతో ఏకీకృత సేవలకు ఈ చట్టం వీలు కల్పించి ఆధునిక తపాలా వ్యవస్థకు పునాది వేసింది. నాటి నుంచి అంచెలంచెలుగా విస్తరిస్తూ దేశ సామాజిక, ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోంది. తపాల సేవలకే పరిమితం కాకుండా, స్మాల్ సేవింగ్స్ డిపాజిట్లు, లైఫ్ ఇన్సూరెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకూ తపాలా శాఖ ద్వారా సేవలు అందుతున్నాయి. మారిన అవసరాలు, టెక్నాలజీని దృష్టిలో పెట్టుకుని 2023లో ఇండియన్ పోస్టాఫీస్ చట్టాన్ని కొత్తగా తెచ్చారు. 2024 జూన్ 18 నుంచి అమలులోకి వచ్చిన ఈ చట్టం ద్వారా డిజిటల్ ఎలక్ట్రానిక్ సాంకేతికతకు అనుగుణంగా ప్రభుత్వ ఆమోదంతో తగిన నిర్ణయాలు తీసుకోవడానికి పోస్టల్ డైరెక్టర్ జనరల్‌కు అధికారాలు కట్టబెట్టింది. పాత చట్టంలో ప్రతి నిర్ణయానికీ పార్లమెంటరీ ఆమోదం పొందాల్సి వచ్చేది. సిబ్బంది జవాబుదారీకి సంబంధించి కొత్త చట్టంలో వెసులుబాటు కల్పించడంపై ఆక్షేపణలు వచ్చాయి. తపాలా ద్వారా పంపే వస్తువుల నష్టం, ఆలస్యం, సరైన చిరునామాదారుకు చేర్చకపోవడం వంటి పొరపాట్లకు సిబ్బందిని జవాబుదారీతనం నుంచి తప్పించారు. దురుద్దేశపూర్వకంగా తప్పు చేసే వారికి మాత్రం ఇది వర్తించదు. లయబిలిటీ క్లాజును తొలగించడం సిబ్బందిలో ఉపేక్షకు, నిర్లక్ష్యానికీ దారితీయవచ్చనే విమర్శలు వచ్చాయి. సర్వీసుల నాణ్యతపై కూడా ప్రతికూల ప్రభావం పడవచ్చు. డిజిటల్ చెల్లింపులకు ఇంతకాలానికి పోస్టాఫీసుల్లో వెసులుబాటు కలిగింది. అయితే కొత్త టెక్నాలజీకి పూర్తిగా సిబ్బంది సన్నద్ధం కాకపోవడం, అన్ని పోస్టాఫీసుల్లో అప్‌డేషన్ పూర్తికాకపోవడంతో సర్వీసులు నత్తనడకన సాగుతున్నాయి. మరో పక్క యాభై ఏళ్లుగా అందుబాటులో ఉన్న రిజిస్టర్డ్ పోస్ట్ విత్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్ సర్వీసును 2025 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ఉపసంహరించుకుంటున్నారు. ఈ సర్వీసును స్పీడ్ పోస్ట్‌లో విలీనం చేస్తున్నట్లు తపాలాశాఖ ప్రకటించింది. ప్రైవేట్ కొరియర్ సంస్థ పోటీ కారణంగా రిజిస్టర్డ్ పోస్టుల సంఖ్య 25 శాతం తగ్గింది. దీనికి తోడు డిజిటల్ ఎడాప్షన్‌లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారట. ఇప్పటివరకూ లీగల్ నోటీసులను, ఉద్యోగ నియామక పత్రాల వంటి డాక్యుమెంట్లను రిజిస్టర్డ్ పోస్టు ద్వారానే పంపేవారు. ఈ సర్వీసు ద్వారా పొందే ఎక్‌నాలెడ్జిమెంట్‌కు చట్టబద్ధత ఉంది. కోర్టులు కూడా నోటీసు అందినదనడానికి దీన్ని రుజువుగా పరిగణించేవి. స్పీడ్ పోస్ట్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్‌కు ఈ విధమైన చట్టబద్ధత ఉంటుందా అనేది తేలాల్సి ఉంది. స్పీడ్ పోస్ట్ టారిఫ్, దూరాన్ని బట్టి మారుతుంది. కనుక కస్టమర్లపై అదనపు భారం పడుతుంది. గతంలో రద్దు చేసిన రిజిస్టర్డ్ ప్రింటెడ్ బుక్ పోస్ట్ స్థానే 2025 మే 1వ తేదీ నుంచి జ్ఞాన్ పోస్ట్ పేరుతో కొత్త పోస్టల్ సర్వీసును అందుబాటులోకి తెచ్చారు. అయితే జ్ఞాన్ పోస్ట్‌కు తగినంత ప్రచారం కల్పిం చకుండా గుట్టుగా ఉంచడంతో రచయితలు, పబ్లిషర్ల వినియో గానికి పూర్తిగా రాలేదు. యూనివర్శిటీలు, గుర్తింపు పొందిన బోర్డుల స్టడీ మెటీరియల్‌ను పోటీ పరీక్షలు రాసేవారు చదివే పాఠ్యపుస్తకాలను జ్ఞాన్ పోస్ట్ ద్వారా పంపవచ్చు. సామాజిక, సాంస్కృతిక, మత అంశాలతో ప్రచురించిన పుస్తకాలను ఈ జ్ఞాన్ పోస్ట్ ద్వారా చేరవేయవచ్చు. 300 గ్రాముల వరకు రూ.20తో మొదలయ్యే టారిఫ్ 5 కిలోలకు గరిష్ఠంగా రూ.100 వసూలు చేస్తారు. జీఎస్టీ అదనం. పీరియాడికల్స్‌ను మాత్రం అనుమతించరు. రచయితలు, ప్రచురణకర్తలకు కాస్తంత ఊరట కలిగించే జ్ఞాన్ పోస్ట్ సర్వీసులకు పలుచోట్ల తపాలా సిబ్బంది మోకాలడ్డుతున్నారు. ఒక పుస్తకం మాత్రమే పంపాలనీ, నాలుగువైపులా బుక్ పాకెట్ తెరచి ఉంచాలనీ, ఇలా ఎవరికి తోచిన రూల్స్ వారు చెప్తూ వేధిస్తున్నారు. ఐదు కిలోల వరకు పంపే వెసులుబాటును నీరుగారుస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దాలి. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఇ%-%కామర్స్ సంస్థలతో పోటీపడేందుకు తపాలాశాఖ సన్నద్ధమవుతోంది. ఇప్పుడు ఒక షిఫ్ట్‌లోనే పోస్ట్‌మెన్ బట్వాడా విధులు నిర్వరిస్తున్నారు. దీన్ని మూడు షిఫ్ట్‌లకు పెంచి, ఆదివారాలు, సెలవు రోజుల్లో కూడా బట్వాడా చేసి ఆదాయం పెంచుకోవాలని తపాలాశాఖ యోచిస్తోంది. దీంతో పాటు ఇతర ఆదాయం పెంపు మార్గాలపైనా తపాలా శాఖ దృష్టి పెట్టనుంది. లాభసాటిగా లేని గ్రామీణ పోస్టాఫీసులను మూసివేయడమో, సమీప పోస్టాఫీసుల్లో విలీనం చేయడమో జరగవచ్చు. అంతగా వినియోగంలో లేని మనియార్డర్, పోస్ట్‌కార్డ్, ఇన్‌ల్యాండ్ లెటర్ మునుముందు రోజుల్లో కనుమరుగు కావచ్చు. శాశ్వత ప్రాతిపదికన సిబ్బంది నియామకాలను చేపట్టి, భవనాల వంటి మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించినప్పుడే తపాలా శాఖ ఆశించిన లక్ష్యాలు సాధించగలదు.

# ముంబై చేస్తున్న హెచ్చరిక!



ప్రణాళికాబద్ధంగా లేని పట్టణీకరణను పరిహసిస్తూ తరచు ప్రకృతి వైపరీత్యాలు విరుచుకు పడుతున్నా పాలకులు మేల్కొనటం లేదనటానికి మళ్లీ నీట మునిగిన ముంబై మహానగరమే సాక్ష్యం. ముంబై దక్షిణ ప్రాంతంలో గురువారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో ఏకధాటిగా 300 మి.మీ., పశ్చిమ శివారు ప్రాంతంలో 200 మి.మీ. వర్షం కురిసిం దంటే కుంభవృష్టి ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు. నిన్నంతా దాదాపు ప్రశాంతంగానే ఉన్నట్టు కనబడిన ఆ మహానగరం, మళ్లీ భారీ వర్షాలుంటాయన్న హెచ్చ రికలతో బెంబేలెత్తుతోంది. ఏటా వర్షాకాలంలో కనీసం ఒక్కసారైనా వరదలు ముంబైని పలకరించటం ఆనవాయితీ. ఈసారి మే నెలలోనే ఒక రోజు నడుంలోతు వరదల్లో నగరం నానా యాతనలూ పడింది. ఆ నెలలో కొత్తగా ప్రారంభమైన వొర్లి మెట్రో స్టేషన్ భారీ వరదతో వణికిపోయింది. రెండు నెలలు గడిచాయో లేదో మళ్లీ నగరానికి కుంభవృష్టి తప్పలేదు. నిరుడు 21 దఫాలు 100 మి.మీ. వర్షం పడిందని గణాంకాలు చెబుతు న్నాయి. వాతావరణంలో పెనుమార్పులు విపత్తుల తీవ్రతను పెం చాయి. అస్తవ్యస్థ పట్టణీకరణ ఈ సమస్యను వందల రెట్లు పెంచింది. ఈసారి వర్షాలవల్ల సంపన్నులు, సినీతారలు నివ సించే ప్రాంతాలు సైతం వరద నీటన మునిగాయి. ఇటీవలే ఆర్భాటంగా ప్రారంభించిన మోనోరైల్ సైతం భారీ వర్షాలతో విద్యుత్ సరఫరా అందక గంటసేపు నిలిచిపోయింది. చివరకు అద్దాలు బద్దలుకొట్టి వందమంది ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకురావాల్సి వచ్చింది. ముంబై తూర్పు శివారులోని మీథి నది ఆ మహానగరంపై విరుచుకుపడింది. అయిదు రోజులపాటు వరసగా కురిసిన వర్షాలతో ఆ నది కట్టు తెంచుకుని అటువైపుగల రైల్వే ట్రాక్‌లన్నిటినీ ముంచెత్తింది. అరేబియా సముద్రం భారీ కెరటాలతో అల్లకల్లోలంగా ఉండటంతో దానిలో కలవాల్సిన మీథి వరద నీరు కాస్తా వెనక్కొచ్చి నగరంలోని అనేక ప్రాంతాలను జలమయం చేసింది. హైదరాబాద్ నగరంలో మూసీ మాదిరిగా ముంబైలో మీథి నదిని కూడా మురికిమయం చేశారు. అందులో 70 శాతం మురికినీరు కాగా, 30 శాతం చెత్తాచెదారం, 10 శాతం పారిశ్రామిక వ్యర్థాలు కలుస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యా లుగా కనబడు తున్నవన్నీ సారాంశంలో మానవ తప్పిదాల పర్యవసానం. గత యేభైయ్యే ళ్లుగా నగరాన్ని విస్తరించుకుంటూ పోవటమే తప్ప అందుకు తగిన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టినవారు లేరు. అలాగని మీథి నది ప్రక్షాళనకు ప్రయత్నాలు జరగ లేదని కాదు. 2013%-%23 మధ్య బృహన్ ముంబై కార్పొరేషన్ (బీఎంసీ) రూ. 2,000 కోట్లు వ్యయం చేసింది. కానీ చివరకు తాజా వర్షాల ధాటికి మురికి నీటితో, ప్లాస్టిక్ వ్యర్థాలతో నివాస ప్రాంతాలన్నీ నిండిపోయాయి. 70వ దశకం వరకూ పరిశుభ్రంగా ఉండే ఆ నది మురికి కూపంగా మారిందంటే పాలకులు, అధికార యంత్రాంగం నిర్లక్ష్యమే కారణం. భౌగోళికంగా ముంబై తీరం పశ్చిమ కనుమలకు దగ్గరలో ఉంది. వాటివల్ల నైరుతి రుతుపవనాల్లో గాలుల తీవ్రత హెచ్చుగా ఉంటుంది. అందుకే ఏటా భారీవర్షాలు, వరదలు తప్పవు. దేశ ఆర్థిక రాజధానిగా, ఢిల్లీ తర్వాత అత్యధిక జనసాంద్రత గల నగరంగా ముంబై మన దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రాణప్రదమైనది. దేశ జీడీపీలో ఆ నగరం వాటా దాదాపు 7 శాతం. కానీ వరదలు ముంచుకొచ్చిన ప్రతిసారీ మౌలిక సదుపాయాలు దెబ్బతినటం, ఉత్పాదకత పడకేయటం రివాజైంది. పునర్నిర్మాణానికి ఏటా రూ. 550 కోట్ల వ్యయమవుతోంది. నిజానికి ఈ సంక్షోభం అక్కడే కాదు... దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల పాలకులనూ పునరాలోచనకు పురిగొల్పాలి. నగర నిర్మాణాల్లో ఎలాంటి మెలకువలు తీసుకోవాలో, పెద్ద నగరాల నిర్మాణంపై మోజువల్ల చివరకు జరిగేదేమిటో గ్రహించేలా చేయాలి. కానీ అదెక్కడా కనబడదు. ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని అమరావతి తాజా వర్షాలకు ఎంత దయనీయ స్థితిలో పడిందో కనబడుతూనే ఉంది. పెద్ద నగరాల నిర్మాణంవల్ల జనసాంద్రత పెరిగి మౌలిక సదుపాయాల కల్పన అసాధ్యమవుతుందనీ, పైగా అభివృద్ధి మొత్తం ఒకే చోట కేంద్రీకరించటం వల్ల ఇతర ప్రాంతాలు ఎప్పటికీ ఎదుగూబొదుగూ లేకుండా ఉండిపోతాయనీ నిపుణులు హెచ్చరిస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు తలకెక్కటం లేదు. మన కోసం ప్రకృతి మారదు. మనమే దానికి అనుగుణంగా మారాలన్న స్పృహ పాలకులకు కలగాలి. మళ్లీ మళ్లీ మునుగుతున్న ముంబై మహానగరాన్ని చూసైనా గుణపాఠం నేర్వకపోతే భవిష్యత్తు క్షమించదు.



## పండుగను భక్తిశ్రద్ధలతో ఆనందోత్సవాల మధ్య జరుపుకోండి...

**ఆసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు... సి ఐ దొర రాజు...**



**మండపేట టౌన్... విశ్వం వాయిస్ న్యూస్...** భక్తి శ్రద్ధలతో ఆనందోత్సవాలు మధ్య నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలు వలన ఎదుటి వారికి ఇబ్బందులు కలగకుండా జరుపుకోవాలని రూరల్ సిఐ పి దొర రాజు అన్నారు. ఎటువంటి ఆసౌకర్యం కలగజేయకుండా శబ్ద కాలుష్యాలు లేకుండా వినాయక చవితి ఉత్సవ కమిటీ పోలీస్ వారు ఇచ్చిన నిబంధనలు పాటిస్తూ భక్తి శ్రద్ధలతో, భక్తి భావాలతో ఆనందోత్సవాల మధ్య నిర్వహించుకోవాలని సూచించారు. మండపేట రూరల్ పోలీస్ స్టేషన్ లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వినాయక ఉత్సవ కమిటీల వారికి కొన్ని సూచనలు చేశారు. వినాయక చవితి సందర్భంగా విగ్రహం నిలబెట్టే వారు తప్పనిసరిగా పోలీస్ వారి అనుమతి పొందాలన్నారు. పోలీస్ వారు వెరిఫై చేసిన అనంతరం పర్మిషన్ మంజూరు అవుతుందని అన్నారు. ఉత్సవ విగ్రహాలను ట్రాఫిక్ కి ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. వినాయక చవితి మండపాల వద్ద ఎక్కువ శబ్ద కాలుష్యం చేసే స్పీకర్లను ఉపయోగించరాదని చెప్పారు. స్పీకర్లను ఉదయం 6.00 గంటల నుండి రాత్రి 10.00 గంటల వరకు మాత్రమే వినియోగించాలని చెప్పారు. ఉత్సవ మండపాలు వద్ద విగ్రహాలకు భద్రతగా కమిటీ సభ్యులు రాత్రులు మండపాలు వద్దనే ఉండాలని తప్పనిసరిగా తాత్కాలిక సీసీ కెమెరాల నిఘా ఏర్పాట్లు చేయాలని, వినాయక నిమజ్జనం చేసే సమయాలను రూట్ మ్యాప్ ను ముందుగా పోలీసు వారికి తెలియ చేయాలన్నారు. వినాయక చవితి మండపాల వద్ద ట్రాఫిక్ కు ఎటువంటి అంతరాయం కలగకుండా వాహనాలను ఒక ప్రక్కగా పార్కింగ్ చేసేలాగా ఏర్పాట్లను చేసుకోవాలన్నారు. ఉత్సవ మండపాలలో మండే స్వభావం కలిగిన వాటితో జాగ్రత్తలు తీసుకుంటూ విద్యుత్ అలంకరణల పట్ల తగిన జాగ్రత్తలు వహించాలన్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరారు. ఉత్సవ కమిటీలు పందిర్లను ఏర్పాటు చేసుకునే విషయాలలో సంబంధిత అధికారుల అనుమతిని పొందాలన్నారు. వినాయక ఉత్సవ మండపాల వద్ద ఊరేగింపులలో బాణసంచాను ఉపయోగించరాదని చెప్పారు. వినాయక నిమజ్జనం సమయంలో ఆశ్లీల నృత్య ప్రదర్శనలు పెట్టకూడదని హెచ్చరించారు. ఊరేగింపులో డీజే బాక్సులను ఉపయోగించరాదన్నారు. ప్రతీ విగ్రహం 5 అడుగులకు మించరాదన్నారు. ఇతర మతాల మందిరాల దగ్గరలో పందిరి వేయకుండా కమిటీ వారు చూడాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లో మండపేట రూరల్ ఎస్సై కిషోర్ , కమిటీ నిర్వాహకులు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు .

## కాపు విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** కోనసీమ కాపు ఉద్యోగ సేవా సమితి ఆధ్వర్యంలో కాపు విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు కోనసీమ కాపు ఉద్యోగ సేవా సమితి ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు అందిస్తున్న ఆర్థికసాయం ప్రశంసనీయమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కోనసీమ కాపు ఉద్యోగ సేవ సమితి ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన 75 మంది కాపు విద్యార్థులకు రూ.5లక్షలు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమలాపురం మండలం సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూలోఆదివారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఉపకార వేతనాలు కాపు సంఘం నాయకులు అందించారు.కాపు సంఘం కోనసీమ అధ్యక్షుడు నల్లా రామకృష్ణ అధ్యక్షతన జరిగినఈ సభలో కాపు సంఘం నాయకులు ఆకుల రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు పీఆర్డీఈఈ అన్యం రాంబాబులు మాట్లాడుతూ కాపు సంఘంలో ఆర్థికంగా వెనుకబడి ఉన్న ప్రతిభ గల పేద విద్యార్థులకు చేయుతగా ఈ సాయం అందిచడం జరిగిందన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుని ఉద్యోగాల్లో స్థిర పడాలని అన్నారు. కాపు సంఘం నేతలు నల్లా విష్ణుమూర్తి, త్సవటపల్లి నాగేంద్ర మాట్లాడుతూ ప్రతిభ గల కాపు విద్యార్థులకు ప్రోత్సహిస్తున్న కాపు ఉద్యోగ సేవా సమితిని కోనియాడారు.ఈ కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఎఎంసీ చైర్మన్ అధికారి జయవెంకట లక్ష్మి. సంఘం ప్రధాన కార్యదర్శ పండి శివ మారుతిప్రసాద్, సంఘం నాయులు పోతంశెట్టి దొరబాబు, నంద్యాల నాయుడు, వేమన సత్యనారాయణ,నంద్యాల మను విహర్, కునసా రామకృష్ణ, వంగా అయ్యప్ప, కోళ్ల స్వామి, లింగోలు పండు,యిళ్ల నాగ సతీష్, చిక్కం మహేష్, బొర్రా ఈశ్వరరావు, , కోనసీమ లో కాపు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# 50 సంవత్సరాలు తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు



రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్ :-రామచంద్రపురం పట్టణం స్థానిక బుచ్చిరాజు కళ్యాణ మండపంలో వి ఎస్ఎం కాలేజీలో 1975,1978 బ్యాచ్ బీఎస్సీ చదువుకున్న పూర్వ విద్యార్థులు కలయిక జరిగింది.ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా కె.సార్వభౌమారావు హైకోర్టు న్యాయవాది మరియు డి.ఎల్.కామేశ్వరి రిటైర్డ్ జిల్లా కోర్టు జడ్జి దంపతుల ఆధ్వర్యంలో చాలా ఘనంగా ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి వారి గురువులు నగరాజకుమారి ముఖ్యఅతిథిగా విచ్చేశారు.జూనియర్ కాలేజీ రిటైర్డ్ బోటనీ లెక్చరర్ సోమేశ్వర కృష్ణశాస్త్రి,ప్రస్తుతం వివిఎస్ ఎం కాలేజీలో ప్రిన్సిపల్ గా పనిచేస్తున్న అన్సారి వారి ఫ్యామిలీ మరియు విశ్రాంత గౌరవ అధ్యక్షులు మాస్టర్ కామేశ్వరరావు లను ఈ సందర్భంగా సన్మానించారు.ఈ సందర్భంగా వ్యక్తులు మాట్లాడుతూ మేము చదువుకుని 47 సంవత్సరాలు అయిందని ఇన్ని రోజులకు మేమందరం కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని, మేము చదువుకున్నప్పుడు 80 మంది ఉండేవారమని కానీ ఇక్కడికి వచ్చింది 30 మంది మాత్రమే,కాని ఇందులో కొంతమంది దూర ప్రాంతంలో ఉండడం వలన కొంత మంది కాలం చేయడం వలన కలుసుకోలేకపోయామన్నారు.ఇందులో ముఖ్యంగా మాతో చదువుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన చలం చత్తీస్గడ్ ఎన్కౌంటర్లో చనిపోయారని తెలిసి మేము చాలా బాధపడ్డామని,మాతో చదువుకున్న వ్యక్తిగా మేము ఎప్పటికీ మరువమని ఆయన ఆత్మకు శాంతి జరగాలని రెండు నిమిషాలు మౌనం వహించాలని కోరారు. చదువుకునేటప్పుడు ఏదో చేయాలి ఏదో సాధించాలని అనుకునే వారము అని కానీ మనం అనుకున్నవి జరగవని ఎవరిక నచ్చిన వృత్తి వారు చేసుకుని ఈరోజు అందరం స్థిరపడ్డామని ఇన్ని సంవత్సరాలకు భార్యాభర్తలతో పూర్వ విద్యార్థులతో ఇలా కలవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో మల్లేశ్వరరావు తదితర పూర్వ విద్యార్థులు పాల్గొని కాలేజీలో జరిగిన గత స్మృతులను అందరూ పంచుకున్నారు.

# ఘనంగా చైర్ పర్సన్ రాణి పుట్టినరోజు వేడుకలు

**సేవా కార్యక్రమాలతో దాతృత్వం చాటారు...**







**మండపేట టౌన్... విశ్వం వాయిస్ న్యూస్...** మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పుట్టినరోజు సందర్భంగా రధం సెంటర్ వద్ద ఆమె కార్యాలయంలో కౌన్సిలర్లు, వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి మాట్లాడుతు కార్మికుల సేవలు వెలకట్టలేనివి అని వారు చేసిన కృషి ఫలితమే పారిశుధ్యం లో మొదటి స్థానం వరించిందని అన్నారు. ఆంధ్రా ఆటోవాల రామచంద్రపురం డివిజన్ అధ్యక్షుడు పెనుముచ్చి బాబు సుకుమార్, లంక జాన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, గర్భిణీ లకు బ్రెడ్ మరియు ఆపిల్ పండ్లు పంపిణీ చేశారు. ఈ జన్మదిన వేడుకలలో వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు, కౌన్సిలర్ లు తనపై చూపిస్తున్న అభిమానానికి సర్వదా కృతజ్ఞత కలిగి ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొని దుర్గారాణి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

**ఆదర్శలో మందపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో చైర్ పర్సన్ రాణి జన్మదిన వేడుకలు...**

మండపేట మున్సిపల్ చైర్పర్సన్ పతివాడ నూక దుర్గారాణి జన్మదిన వేడుకలు 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా ఆదర్శ హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదర్శలో నిరుపేద వృద్ధులు, వికలాంగులు, అనాధలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. దుగ్గిరాల చిన్న, అయినవిల్లి రమణ, దార్ల అబ్రహం, చిన్ని విజయ, శీలి అరవింద్, పైడిమళ్ళ గౌతమ్, నేదూరి రూబేను తదితరులు పాల్గొని చైర్పర్సన్ రాణికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


# స్మార్ట్ బియ్యం కార్డులు పంపిణీకి రంగం సిద్ధం

**జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయ భాస్కర్**



**అమలాపురం జిల్లా ప్రతినిధి విశ్వం వాయిస్ న్యూస్ ఆగస్టు 24:** సెప్టెంబర్ 6 వ తేదీ క్యూఆర్ కోడ్ బేస్డ్ స్మార్ట్ బియ్యం కార్డులు పంపిణీకి రంగం సిద్ధం చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయ భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు..రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయాన్ని అమలులోనికి తీసుకుని వచ్చిందన్నారు. చౌక ధరల దుకాణాల నిత్యావసర పదక లబ్దిదారులకు పంపిణీ చేసిన రేషన్ గుర్తింపు కార్డుల స్థానంలో కొత్తగా స్మార్ట్ రేషన్ కార్డు లను పంపిణీ చేయడానికి సన్నాహాలు చేసిందన్నారు. కోనసీమ జిల్లా వ్యాప్తంగా 5,31,926 రేషన్ కార్డు దారులకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు అర్హులు అందరికీ కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తామన్నారు. ఆ మేరకు కార్డులు జారీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని. ఈ కొత్త స్మార్ట్ రేషన్ కార్డులకూ అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఎటీఎం కార్డు పరిమాణంలో రూపొందించిందన్నారు. కార్డు ముందు వైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్న%శీ%, కుటుంబ పెద్ద చిత్రం, రేషన్ దుకాణం సంఖ్య క్యూఆర్ కోడ్ వంటి సెక్యూరిటీ ఫీచర్లు ఉంటాయన్నారు. ఈ-పోస్ నూతన యంత్రాల సాయంతో కార్డుపై ఉన్న క్యూబర్ కోడ్ స్కాన్ చేస్తే కుటుంబానికి సంబంధించి తీసుకునే సరుకుల వివ రాలన్నీ కనిపించేలా కార్డు ను డిజైన్ చేశారన్నారు. కుటుంబ పెద్ద ఫోటో, కుటుంబ సభ్యుల పేర్ల వివరాలు, దీని ద్వారా లబ్ధిదారుల గుర్తింపు మరింత తేలిక అవ్వతుం దన్నారు. కార్డుదారులకు దుకాణాల వద్ద గంటల కొద్దీ పడిగాపులు కాయాల్సిన అవసరం ఉండదని సర్కార్ భావించి. తాజాగా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకం గా కొత్తగా తీసుకొచ్చిన స్మార్ట్ రేషన్ కార్డులు ఆయా ముద్రణ సంస్థల కార్యాల యాల నుంచి ఇప్పటికి జిల్లాలోని మండలాలకు చేరుతున్నాయన్నారు. ఇప్పటికీ పాత కార్డులు పొందిన వారితో సహా కొత్త వారికి కూడా ఈ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నారన్నారు. ఎంతో కాలంగా కొత్త రేషన్ కార్డుల కోసం వేచి చూస్తు న్న నూతన లబ్ధిదారులకు మాత్రం ఇది నిజంగా శుభ వార్త అన్నారు.అర్హతే ప్రధా న ఏకైక ప్రామాణికంగా కొత్త గా స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తామన్నారు కాగా, అర్హత జాబితాల్లో తమ పేరును నిర్ధారణ చేసుకునే అవకాశం కూడా రాష్ట్ర ప్రభుత్వం వెబ్సైట్ ద్వారా కల్పించిందన్నారు ఇ%శీ%దుకు అనుకూలంగా జాబితాలను సచివాలయా ల్లో అందుబాటులో ఉంచిం దన్నారు లబ్దిదారుల జాబి తాల్లో పేర్లు ఉన్నవో లేదో తెలుసుకోవాలని భావిస్తే వెబ్సైట్ ద్వారా హెూమ్ పేజీలో ఉన్న సర్వీసు రిక్వెస్ట్ స్టేటస్ లింక్ పై క్లిక్ దరఖాస్తు సమయంలో పొందిన నంబరు సమోదు చేయా లనీ. దీంతో రేషన్ కార్డు దరఖాస్తు ఏ దశలో ఉందో పూర్తి సమాచారం తెలుస్తుం దన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల జారీ ద్వారా నిత్యవసరాల పంపిణీ పూర్తి పారదర్శకంగా చే పట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. కొత్త స్మార్ట్ కార్డులు ఆధారంగా లబ్ధి దారులు సెప్టెంబర్ నెల నుంచి రేషన్ సరుకులు పొందుతారని తెలిపారు. త్వరలో స్మార్ట్ ఈ-పాస్ మిషన్లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకు రానుందన్నారు. ఇప్పుడు ఇస్తున్న స్మార్ట్ కార్డులను ఈ యుత్రం ద్వారా సైప్ చేస్తే కార్డుదారుల వివరాలు వస్తాయన్నారు.వైఫై, హాట్ స్పాట్, బ్లూ టూత్, వంటి ఆధునిక సదుపాయాలతో, అండ్రాయిడ్ సాంకేతికతతో నూతన వ్యవస్థ పని చేస్తుం దన్నారు.

## కలెక్టరేట్లో యధావిధిగా స్పందన అర్జీ పరిష్కార వేదిక కలెక్టర్



**అమలాపురం, జిల్లా ప్రతినిధి విశ్వం వాయిస్ న్యూస్ ఆగస్టు 24** ఈనెల 25 వ తేదీ సోమవా రం స్థానిక కలెక్టరేట్లోనీ గోదావరి భవన్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక పిజిఆర్ఎస్ కార్యక్రమం ఉదయం 10 గంటల నుండి ప్రారంభమవుతుందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా డివిజన్ మునిసిపల్ మండల స్థాయిలలో పిజిఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగు తుందన్నారు. కావున అర్జీదారులు ఆ యొక్క స్థాయి లలోని పిజిఆర్ఎస్ సంబంధిత సమస్యలను ఆయా స్థాయి అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కార మార్గాలు కోరుతూ ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన ప్రకటనలో కోరారు

## ఆదివాసీ మహిళపై అత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

**అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా)**



**విశ్వం వాయిస్ న్యూస్ :-** చర్ల వద్ద ఆదివాసి గుత్తి కోయ మహిళ పై మత్తుమందు ఇచ్చి అత్యాచారం చేసిన దుండగులపై కఠినమైన చర్యలు చేపట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి సీతాలక్ష్మి,మందలపు జ్యోతి లు డిమాండ్ చేశారు.అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) భద్రాచలం పట్టణ కమిటీ సమావేశం నాదెళ్ల లీలావతి అధ్యక్షతన జరిగింది.సందర్భంగా వారు మాట్లాడుతూ పొట్టకూటి కోసం పనులు వెతుక్కుంటూ చత్తీస్గడ్ నుంచి చర్ల ప్రాంతానికి వచ్చిన ఆదివాసీ గుత్తి కోయ మహిళ అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు ఆటో డ్రైవర్లు సామూహిక అత్యాచారం చేసినట్లుగా వస్తున్న వార్తలపై పోలీసు అధికారులు వేగవంతంగా విచారణ చేసి అందుకు సంబంధించిన నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని వారు ప్రభుత్వాన్ని అధికారులను విజ్ఞప్తి చేశారు.సమాజంలో మహిళల పై కామాంధుల దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని ఈ దాడులు అరికట్టేందుకు నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.లైంగిక వేధింపులకు గురైన ఆదివాసి గుత్తి కోయ మహిళ సంరక్షణ బాధ్యత పూర్తిగా ప్రభుత్వం తీసుకోవాలని,ఆమెను వారి కుటుంబ సభ్యులకు చేరే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.ఈ సమావేశంలో ఐద్వా పట్టణ కమిటీ సభ్యులు ఉస్తెల జ్యోతి, సుబ్బలక్ష్మి,జి నాగలక్ష్మి,కనక శ్రీ, డి.నాగలక్ష్మి,కే.రాధా,జి గణపతమ్మ,సరోజినీ హాలేమా పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ నగర్లో వినాయక చవితి రాట ముహూర్తం



**రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్ :-** రామచంద్రపురం ఐదవ వార్డు వైయస్సార్ నగర్ లో చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఎంతో ఘనంగా నిర్వహించే గణపతి నవరాత్ర మహెూత్సవాలు ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు యువజన సంఘం భక్త సమాజం సంయుక్తంగా సన్నాహాలు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 9:15 నిమిషాలకు రాట ముహూర్తం జరిగింది. విగ్రహ దాతలు రాంబాబు అలివేలు దంపతులు అలాగే పెద్దలు గుమ్మల్ల రత్నం,నేల శ్రీను,శివ మరియు అధిక సంఖ్యలో స్థానిక భక్తులు మహిళలు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవా పథకం అందుకున్న సి ఐ వీరబాబు కి సత్కారం



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** రాష్ట్ర ప్రభుత్వం చే ఉత్తమ సేవా పథకం అందుకున్న సి ఐ వీరబాబును సత్కరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం అమలాపురం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం సమావేశం జరిగినది సంఘం సభ్యుల ఆహ్వానం మేరకు ఆదివారం సమావేశంలో ప్రముఖులు పాల్గొనడం జరిగింది. ఈ సమావేశంలో పట్టణ సి ఐ వీరబాబు కు ఆగస్టు 15 న రాష్ట్ర ప్రభుత్వం చే ఉత్తమ సేవ పథకం వచ్చిన సందర్భంగా సన్మానం చేశారు.సి ఐ వీరబాబు చేసిన సేవలను పట్టణ ప్రజలు ఎప్పటికి మరచిపోరాదని ఆర్య వైశ్య సంఘం కోరింది వారి సేవలను గుర్తించి ఉత్తమ సేవా పథకం అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి పట్టణ సి ఐ వీరబాబు శుభాకాంక్షలు తెలియజేసారు ఈ సందర్భంగా అవార్డు అందుకున్న సి ఐ వీరబాబు కి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ తరుపున కేకేసి రాష్ట్ర అధికార ప్రతినిధి,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వంటెద్దు బాబి ఆధ్వర్యంలో సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్షులు ఏలేశ్వరపు రాధాకృష్ణ, పట్టణ కార్యదర్శి ముల్లేటి వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సుగ్గ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జనవిజ్ఞాన వేదిక (ఆం.ప్ర.), కాకినాడ జిల్లా మహాసభలు జయప్రదం.....



**కాకినాడ సిటీ: విశ్వం వాయిస్ న్యూస్** జనవిజ్ఞాన వేదిక కాకినాడ జిల్లా మహాసభలు, కాకినాడ యు.టి.ఎఫ్. హోమ్ నందు ఘనంగా జరిగాయి. జిల్లా గౌరవాధ్యక్షులు వి.సత్యనారాయణ రెడ్డి జెవివి పతాక ఆవిష్కరణతోమహాసభ ప్రారంభమైనది.గత రెండు సంవత్సరాల కార్యక్రమాల సమిక్ష జరిగింది. రాబోయే రెండు సంవత్సరాలకు నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశీలకులుగా విచ్చేసిన కె. త్రిమూర్తులు గారు మాట్లాడుతూ సమాజంలో జెవివి ఆవశ్యకత ఎన్నడూ లేనంతగా ఇప్పుడు పెరిగింది అని, దానిని తగివట్లుగా జిల్లా కమిటీ తమ కార్యక్రమాలను రూపొందించుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమానికి 10 మండలాల నుండి 50 మంది ప్రతినిధులు హాజరైనారు. ఎస్.ఎఫ్.ఐ., జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిబాబు, ఎ.పి.ఆర్.ఎమ్.ఎస్.ఎ., రాష్ట్ర అధ్యక్షులు కె. సత్తిరాజు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి రమణి హాజరై తమ సౌహార్ద్ర సందేశాలు తెలియజేశారు. మద్యాహ్నం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జనవిజ్ఞాన వేదిక నూతన అధ్యక్షప్రధాన కార్యదర్శులుగా కె.ఎమ్.ఎమ్.ఆర్. ప్రసాద్. జి.ఎస్.హెచ్. ప్రసాద్ వర్మలు, కోశాధికారిగా పి. బాలాజీ ఎన్నికైనారు.

## "సంప్రదాయబద్ధంగా ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలు జరుపుకుందాం"....




**కాకినాడ సిటీ:విశ్వం వాయిస్ న్యూస్** ది.27.09.25 తేదీన వినాయక చవితి పండుగ సందర్భంగా పందిళ్ళు ఏర్పాటు మరియు ఊరేగింపు కార్యక్రమాల నిర్వాహకులకు పోలీస్ వారి సూచనలు....

**ముఖ్య సూచనలు :** పందిళ్లు / మండపాలు పెట్టాలంటే కమిటీ ఏర్పాటు చేసి పోలీస్ అనుమతి తీసుకోవాలి. ప్రైవేట్ స్థలమైతే యజమాని అనుమతి – ప్రభుత్వ స్థలమైతే మున్సిపల్/పంచాయతీ అనుమతి తప్పనిసరి. ఫైర్, మున్సిపల్, విద్యుత్ శాఖల అనుమతులు తీసుకుని సేఫ్టీ చర్యలు పాటించాలి. అగ్ని ప్రమాదాలు జరగకుండా విద్యుత్, దీపారాధన వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి. విగ్రహ ఎత్తు, బరువు, ఉత్సవం రోజులు, నిమజ్జన మార్గం పోలీస్ వారికి ముందుగానే తెలియజేయాలి. రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వాడరాదు. మండపాల వద్ద రాత్రి భద్రతా కాపలా ఉండాలి %–% డబ్బు, బంగారం ఉంచరాదు. రోడ్డు మీద పందిళ్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు పెట్టరాదు. ఊరేగింపులో ఇతర మతాలు, కులాలు, రాజకీయాలపై నినాదాలు చేయరాదు. అసభ్య నాట్యాలు, మద్యం, మత్తు పదార్థాలు నిషేధం. పోలీస్ అనుమతి లేకుండా డీజే లు, బాణాసంచా వాడరాదు. నిమజ్జన వాహనం కండిషన్ బాగుండాలి %–% డ్రైవర్ లైసెన్స్ తప్పనిసరి. మత్తు పదార్థాలు సేవించిన వారు, మైనర్లు వాహనంపై ఉండరాదు. ట్రాఫిక్ మార్గాలు ముందుగానే పోలీస్ వారికి తెలపాలి.కమిటీ సభ్యులు ట్రాఫిక్ కంట్రోల్‌కి సహకరించాలి.ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే పూర్తి బాధ్యత నిర్వాహకులదే ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరపాలి మీ భద్రతే, మా కర్తవ్యం అని తెలియజేసారు

# జగ్గంపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మండల టిడిపి అధ్యక్షులు జీనుమణి బాబుకి ఘన సత్కారం



**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లా జగ్గంపేట స్థానిక జేవియర్ అపార్ట్మెంట్ వద్ద జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘ అధ్యక్షులు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు), సంఘ పెద్దలు కలిసి జగ్గంపేట మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జీను మణిబాబుని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొత్తకొండ బాబు మాట్లాడుతూ మా అందరి ఆరాధ్య దైవం జ్యోతుల నెహ్రూ ఆశీస్సులతో జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ సహకారంతో మండల టిడిపి అధ్యక్షులుగా నియమితులైన జీను మణి బాబుని ఘనంగా సత్కరించామని ఆయన ఆధ్వర్యంలో ఆర్యవైశ్య లలో పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే విధంగా ఎమ్మెల్యే నెహ్రూ సహకారంతో అందేవిధంగా చూడాలని ఆర్యవైశ్యుల్లో పేదవారికి ఇళ్ల స్థలం ఇప్పించాలని కోరారు. మణిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్తకొండ బాబు సహకారంతో ఎమ్మెల్యే నెహ్రూ, నవీన్ తో కలిసి మీ సమస్యలన్నీ పరిష్కరించి మీకు అన్ని సంక్షేమ పథకాలు అందే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మానేపల్లి బంగారాజు, పాలకుర్తి సురేష్, బోండా వీరసత్య, కొత్త శ్రీరామకృష్ణ, దారా శ్రీనివాస్, బోండా రాజేష్, వి నాగసత్య, కంచర్ల బాబు, బొండాడ జగన్, పొట్టి రాజేష్, మానేపల్లి రామానుజ, కొత్త ప్రసాద్, ఉద్ద గిరి కామేష్, నీట్టాల శ్రీనివాస్ తదితర ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు పాల్గొన్నారు.

# తాళ్లూరు లిఫ్ట్ కు 52 కోట్ల ఆమోదం సీఎం చేతుల మీదుగా జీవో స్వీకరించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ





వెంకటేశ్వర స్వామి ప్రతిమతో సత్కారం ..ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టిడిపి నేతలు అభినందనలు

**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** జగ్గంపేట నియోజకవర్గంలో కీలకమైన పుష్కర ఎత్తిపోతల పథకం అంతర్భాగం తాళ్లూరు లిఫ్ట్ కు ప్రభుత్వం 52 కోట్లు నిధులు మంజూరు చేస్తూ క్యాబినెట్ ఆమోదం చేసి ఆ పత్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఉండవల్లిలోని ఆయన నివాసంలో జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ కు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే నెహ్రూ, పుష్కర ప్రాజెక్టు కమిటీ చైర్మన్ అడబాల భాస్కరరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భారత్, గండేపల్లి మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు, అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు మారిశెట్టి భద్రం, కందుల చిట్టిబాబు తదితరులు ముఖ్యమంత్రిని ఘనంగా సత్కరించి వెంకటేశ్వర స్వామి ప్రతిమను జ్ఞాపకగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో పైపులైన్లు మరమ్మతుకు గురైమూ లనపడ్డ ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు ఊపిరి పోసిపుష్కర ఎత్తిపోతల పథకం తాళ్లూరు లిఫ్ట్ కు పైపులైన్ల మార్పునకు ఆమోదముద్ర వేసి రూ.51.67 కోట్లతో పరిపాలన ఆమోదం ఇచ్చే ప్రతిపాదనకు, పనులు ప్రారంభించేందుకు పచ్చజెండా ఊపిన ముఖ్యమంత్రి చంద్రబాబు కు కృతజ్ఞతలు తెలియజేసేందుకు విచ్చేసామని ఈ ప్రాజెక్టు వల్ల31వేల ఎకరాల ఆయకట్టుకు రైతులు ముఖ్యమంత్రి చంద్రబాబు కు రుణపడి ఉంటారని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు.

# మత్స్యకారులకు అండగా ఉంటా....

కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్





**కాకినాడసిటీ: విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లాలో మత్స్యకారులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉండడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా తన వంతు కృషి చేస్తానని కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ స్పష్టం చేశారు. పిఠాపురం నియోజవర్గం యు.కొత్తపల్లి మండలానికి చెందిన మత్స్యకార సంఘాల నాయకులు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తో భేటీ అయ్యి పలు సమస్యలపై చర్చించారు. యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ, అమీనాబాద్, కోనపాప పేట,మూలపేట తదితర గ్రామాలు చెందిన మత్స్యకారులు వేటకు వెళ్లి కృష్ణా జిల్లా పెడన నియోజకవర్గం,చిన గొల్లపాలెం మరియు డా. బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది నరసాపురం ప్రాంతాల వద్ద తమ మత్స్య సంపదను అన్ లోడింగ్ చేసుకుంటుంటే స్థానిక మత్స్యకారులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని మొరపెట్టుకున్నారు దీనిపై తక్షణమే స్పందించిన ఆయన మచిలీపట్నం ఎంపీ బాలసౌరి, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ లతో ఫోన్లో మాట్లాడి అక్కడికక్కడే సమస్యను పరిష్కరించారు. అలాగే యు. కొత్తపల్లి మండలం, అమీనాబాద్ హార్బర్ వద్ద రోడ్డును నిర్మించాలని మత్స్యకార నాయకులు విజ్ఞప్తి చేయగా, ఎంపీ లాడ్స్ నిధులతో అభివృద్ధి చేస్తానని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘాల నాయకులు గంటా విజయ్ కుమార్, నక్కా చినబాబు, సురాడ నాగేశ్వరరావు, మరడ కొండయ్య, చోడిపల్లి చిట్టిబాబు,ముడి జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

# గణేశ పంచరత్న పోటీలకు విశేష స్పందన





**కాకినాడసిటీ :విశ్వం వాయిస్ న్యూస్** వినాయక చవితి సందర్భంగా భరద్వాజ సేవా సంఘం ఆధ్వర్యంలో 15 సంవత్సరాలలోపు పిల్లలకు నిర్వహించిన గణేశ పంచరత్న పోటీలకు విశేష స్పందన వచ్చింది. ఆదివారం స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవన ప్రాంగణంలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను సంఘ అధ్యక్షులు డాక్టర్ ఐ వి రావు జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం కార్యదర్శి ముంజులూరి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఈ పోటీలను రెండు విభాగాలుగా నిర్వహిస్తున్నామని తొలుత జూనియర్స్ విభాగంలో ఐదు నుంచి పదవ సంవత్సరం వరకు సీనియర్స్ విభాగంలో 11 నుండి 15వ సంవత్సరం లోపు వరకు ఉంటుందని చెప్పారు .సుమారు 30 పాఠశాల నుండి 75 మంది దాకా విద్యార్థిని విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారని విశ్వేశ్వర రావు చెప్పారు. అధ్యక్షులు డాక్టర్ ఐ.వి రావు మాట్లాడుతూ భారతీయ ఇతిహాస పురాణాలకు చెందిన విషయాలు నేటితరంకు పరిచయం చేయడం ద్వారా వాటి గొప్పతనాన్ని తెలుసుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు .అందులో భాగమే మన పండుగలు యొక్క విశిష్టత దానిలోని విషయాలను చిన్నతనం నుండే పిల్లలకు పరిచయం చేయవలసిన బాధ్యత మన అందరి పైన ఉందన్నారు. వినాయక చవితి సందర్భంగా గణేశ పంచరత్న స్తోత్రం పై పోటీలు నిర్వహించడం జరిగిందని చెప్పారు .ఈ పోటీలకు పిల్లల నుండి స్పందన రావడం ఆనందదాయకమని వీరిని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు అని డాక్టర్ రావు అన్నారు . న్యాయ నిర్ణయితలుగా సి ఎస్ సత్యనారాయణ, ఆకొండి సూర్యనారాయణ ,వాసుదేవరావు, జానకిరామ్ చౌదరి వ్యవహరించారు. జూనియర్ విభాగంలో విజేతలు ప్రథమ స్థానం శ్రీ చైతన్య స్కూల్ కి చెందిన భమిడిపాటి లాస్య ,ద్వితీయ స్థానం మోహన్ హై స్కూల్ కి చెందిన జుత్తుక అన్నపూర్ణాదేవి, తృతీయ స్థానం నారాయణ ఈ టెక్నో స్కూల్ కి చెందిన కౌశిక్. సీనియర్స్ విభాగంలో ప్రథమ స్థానం ఆదిత్య జూనియర్ కాలేజీకి చెందిన జి కృష్ణ సంహిత ,ద్వితీయ స్థానం అగస్త్య స్కూల్ కి చెందిన లాస్య ,తృతీయ స్థానం లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ కి చెందిన వేదిత .బహుమతులు కైవసం చేసుకున్నారు .రెండు విభాగాలకు చెందిన 20 మందికి కన్సోలేషన్ బహుమతిని అందజేశారు పోటీలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు అందరికీ ప్రశంసా పత్రాలను అందజేశారు . కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ భరద్వాజ సేవా సంఘం ఆధ్వర్యంలో పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు దివ్య ఆశీస్సులతో ప్రత్యేకంగా ముద్రించిన శ్రీ వినాయక వ్రత కల్ప పుస్తకము మరియు పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ తయారుచేసిన వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు .కార్యక్రమంలో ఇంద్రగంటి శ్రీనివాస్ ,అయ్యగారి వెంకటేష్, మండలీక శాస్త్రి ,సీతారామశాస్త్రి, రంగాభట్ల శ్రీనివాస్ శ్రీనివాస్, లయన్స్ ఎలైట్ క్లబ్ అధ్యక్షులు కందాలం రవి ,బులుసు కిషోర్ కుమార్ ,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గణేశ్ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

జగ్గంపేట సి ఐ వై ఆర్ కె శ్రీనివాస్




**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** ఈ నెల 27వ తేదీన ప్రారంభమయ్యే వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో జగ్గంపేట ,కిర్లంపూడి ,గండేపల్లి మండల గ్రామాల్లో గణేశ్ మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలని జగ్గంపేట సి ఐ వై ఆర్ కె శ్రీనివాస్ సూచించారు.ఆదివారం నిర్వహించిన విలేకరులతో సమావేశం లో ఆయన మాట్లాడుతూ గణేశ్ మండపాల ఏర్పాటు చేయదలచిన నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ శాఖ అనుమతులు పొందాలని చెప్పారు. అనుమతులు పొందడంలో ఎటువంటి చలానాలు చెల్లించవలసిన అవసరం లేదని తెలిపారు. %ట్ట్రజూం://ష్తురుఅవంష్ట్రబ్‌యుజ.అవ్% లోకి వెళ్లి వివరాలు ఎంట్రీ చేసి, అప్లికేషన్ స్టేటస్‌లోకి వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.నాలుగు అడుగులకంటే పెద్ద విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరి అని,మండపాలు రోడ్డు ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేయాలి. రాత్రివేళ ముగ్గురు వాలంటీర్లు కాపలా ఉండాలి. అగ్ని ప్రమాదాలు, విద్యుత్ లోపాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.జూదం, మత్తు పదార్థాలు, అశ్లీల నృత్యాలు నిషేధం. ఊరేగింపులు నిర్ణీత రూట్‌లో, నిర్ణీత సమయాల్లో శాంతియుతంగా జరగాలి. రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వాడరాదు.నిమజ్జనం నిర్ణీత ప్రాంతంలోనే జరగాలని, నీటి ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు తెలిపారు. ఉత్సవాలు క్రమశిక్షణ, సామరస్యం, భక్తి భావంతో జరగాలని సీఐ వై.ఆర్.కె. సూచించారు.

## జే.కొత్తూరు గ్రామ శివారులో పేకాట రాయుళ్లపై జగ్గంపేట పోలీసులు దాడి

నలుగురి వద్ద నుంచి రూ.10,250 నగదు స్వాధీనం

జూదక్రీడలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు జగ్గంపేట సి ఐ వై ఆర్ కె హెచ్చరిక



**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ (ఐపీఎస్) ఆదేశాల మేరకు జిల్లాలో జూదక్రీడలు, క్రికెట్ బెట్టింగులు, బొమ్మా బొరుసు, కోతా బంతి, ఎత్తు లాట వంటి అక్రమ కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు.ఆ దిశగా జగ్గంపేట సీఐ వై.ఆర్.కె. శ్రీనివాస్ సూచనలతో ఎస్సై రఘునందన్ రావు సిబ్బందితో కలిసి ఆదివారం జగ్గంపేట మండలం జే.కొత్తూరు గ్రామ శివారులో పేకాట దందాపై దాడి చేశారు.ఈ దాడిలో నలుగురు పేకాటరాయుళ్లు అదుపులోకి తీసుకున్నారు .వారి వద్ద నుండి రూ.10,250 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.జూదం, కోడిపందాలు, గుండాటలు, క్రికెట్ బెట్టింగ్లు, ఆన్‌లైన్ గేమ్స్ వంటి అక్రమ క్రీడలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జగ్గంపేట సి ఐ వై ఆర్ కె శ్రీనివాస్ హెచ్చరించారు.

## కత్తిపూడిలో రోడ్డు ప్రమాదంలో ఒకని మృతి



శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో కత్తిపూడి జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు మోతే సూరిబాబు (40) కుటుంబంలేని ఒంటరి వ్యక్తి. లారీ క్లీనర్. పూర్తి వివరాలు ఇవీ. ప్రకాశం జిల్లాలోని పలకల తయారీ వ్యాపారానికి పేరుపొందిన మార్కాపురం మండలంలోని తాటిపర్తి గ్రామం నుండి బీహార్ రాష్ట్ర రాజధాని పాట్నాకు బొగ్గును లారీలో రవాణా చేస్తూ మార్గం మధ్యలో కత్తిపూడి శివారు జాతీయ రహదారిపై తూర్పు దిక్కున ఉన్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద లారీని ఆపిన డ్రైవర్ ఆ పక్కనే ఉన్న అటవీశాఖ ఠాణా వద్ద లారీ పత్రాలను తనిఖీ చేయించుకు రమ్మని క్లీనర్ మోతే సూరిబాబు (40) ను పురమాయించాడు. లారీ దిగి రోడ్డును దాటుకుంటూ వెళుతున్న సూరిబాబును రాజమహేంద్రవరం వైపు వెళుతున్న కారు ప్రమాద వసాత్తూ బలంగా ఢీకొట్టింది. దీంతో అతను అవతలివైపు తాను దిగిన లారీ ఉన్న రోడ్డుపైనే తూలి పడ్డారు. అదే సమయంలో రాజమహేంద్రవరం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న ఓల్వో బస్సు ప్రమాద వసాత్తూ మోతే సూరిబాబును ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతునికి భార్యా, పిల్లలు లేరు. ఒంటరిగా ఉంటున్నాడు. పోస్ట్ మార్టం నిమిత్తం మృత దేహాన్ని ప్రత్తిపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని అన్నవరం పోలీసు ఎస్సై ప్రసాద్ నేతృత్వంలో దర్యాప్తు చేస్తున్నారు.

# రంపచోడవరం కేంద్రంగా కారం తమన్నదొర పేరుతో జిల్లా ఏర్పాటు చేయాలి.

- రాజమండ్రిలో కలిపితే సహించం.
- ఏపీ ఆదివాసీ జేఏసీ,జిల్లా సాధన కమిటీ.
- ఎస్టి కమిషన్ చైర్మన్ సోళ్ళ బొజ్జిరెడ్డి వినతి.



**దేవీ పట్నం,విశ్వంవాయిస్ న్యూస్.** రంపచోడవరం మండల కేంద్రంలోని యు.టి.ఎఫ్ హెూమ్ నందు ఏ.పీ ఆదివాసీ జేఏసీ కోరు కమిటీ సభ్యులు కంగాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ట్రంప్ చోడవరం కేంద్రంగా కారం తమన్నదొర పేరుతో జిల్లా ఏర్పాటు చేయాలని అంశంపై సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏపీ ఎస్టీ కమిటీ చైర్మన్ సోళ్ళ బొజ్జి రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశానికి పోలవరం నియోజక వర్గం,రంపచోడవరం నియోజకవర్గం ప్రతినిధులతో రంపచోడ వరం జిల్లా సాధన కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. రంపచోడవరం జిల్లా సాధన కమిటీ జిల్లా చైర్మన్ గా పల్లాల రాజ్ కుమార్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరియు పోలవరం, రంపచోడవరం నియోజకవర్గాల ప్రతినిధుల తో జిల్లా సాధన కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హాజరైన ప్రతినిధులందరూ రంపచోడవరం కేంద్రంగా కారం తమన్న దొర పేరుతో జిల్లా ఏర్పాటు చేయాలని 2014 నాటి ఏపీ సీఎం హామి పోలవరం నియోజకవర్గం,రంపచోడవరం నియోజకవర్గం కలుపుతూ రంపచోడవరం కేంద్రంగా జిల్లా ప్రకటించాలని ఉపన్యాసం ద్వారా డిమాండ్ చేశారు. అనంతరం ఏపీ ఎస్టి కమిటీ చైర్మన్ సోళ్ళ సోజ్జి రెడ్డికి రంపచోడవరం కేంద్రంగా కారం తమన్న దొర పేరుతో జిల్లా ప్రకటించాలని వినతి పత్రం అందజేశారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో అన్ని ఆదివాసి సంఘాల నాయకులు,ప్రజా సంఘాల నాయకులు,ప్రజాప్రతినిధులు,మహిళలు,యువతీ యువకులు మొదలైన ఆదివాసి మేధావులు పాల్గొన్నారు. ఈ సమావేశం లో రంపచోడవరం కేంద్రంగా కారం తమన్న దొర పేరుతో జిల్లా ప్రకటించాలని ఈరోజు నుండే భవిష్యత్తు కార్యచరణ ప్రకటించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఏపీ ఆదివాసీ జేఏసీ సెంట్రల్ కమిటీ సమన్వయకర్త మడివి నెహ్రూ,తెల్లం శేఖర్,కారం రామన్న దొర,చవలం శుభ కృష్ణ దొర,మడకం వరప్రసాద్ దొర,కర్రీ సన్యాసిరెడ్డి,సార్ల మంగిరెడ్డి మాజీ సర్పంచ్, వంతు బాలకృష్ణ,మద్దేటి అంజిరెడ్డి,చెదల దినేష్ రెడ్డి,శీలం కృష్ణ,జల్లి నరేష్,దూసరి కనక దుర్గ,సార్ల రమాదేవి సర్పంచ్,మాజీ ఎంపీపీ అన్నం సత్యనారాయణ రెడ్డి,మాజీ జడ్పీటిసి పల్లాల వెంకటరమణారెడ్డి,మద్దేటి జగన్నాథ్ రెడ్డి,లోత మంగమ్మ,కత్తుల రత్నారెడ్డి, కుండ్ల రామి రెడ్డి,కోండ్ల విజయ్ కుమార్ రెడ్డి,మట్ల కృష్ణారెడ్డి,మణికంఠ, అందాల సూర్య నారాయణరెడ్డి మొదలైన వారు పాల్గొన్నారు.

## దోసకాయలపల్లిలో పదిమంది పేకాట రాయుళ్లు అరెస్ట్.

- 41వేల నగదు స్వాధీనం.

**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:** కోరుకొండ మండలం దోసకాయపల్లి తోటల్లో పేకాట శిబిరంపై దాడి చేసి పదిమంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు కోరుకొండ ఎస్సై నాగార్జున తెలిపారు. ఆదివారం దోసకాయలపల్లి తోటలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేసి, పదిమందిని అరెస్టు చేసి 41వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నామన్నారు. పదిమందిపై కేసు నమోదు చేసి, కోర్టుకు పంపించామన్నారు. కోరుకొండ మండలంలో ఎటువంటి అసంఘిక కార్యక్రమాలు జరిగిన పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ ఎస్సై నాగార్జున, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రైస్తవులపై జరుగుతున్న దాడులపై జంతర్ మంతర్ వద్ద ధర్నా



**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** దేశావ్యాప్తంగా క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికటెందుకు ప్రత్యేక చట్టం తేవాలని డిమాండ్ చేస్తూ శనివారం ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించడం జరిగిందని ఆల్ ఇండియా క్రిస్టియన్ జేఏసీ జాతీయ కన్వీనర్ బొంతా శ్యామ్ రవిప్రకాష్ తెలిపారు జాతీయ కోఆర్డినేటర్ మార్టేన్ లూధర్ అధ్యకత న జరిగిన ఇ కార్యక్రమనిక్కి లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఐఏఎస్ అధికారి జి యస్ ఆర్ కే ఆర్ విజయ్ కుమార్ మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం ముఖ్య అతిధిలుగా పాల్గొన్నరు పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం పై క్రైస్తవులకు వున్నఅనుమానలను ప్రభుత్వం నివృత్తి చెయ్యాలని డిమెండ్ చేశారు క్రైస్తవులు ఐక్యము గా ఉండి హక్కులు సాధించుకోవాలని మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం పిలుపు నిచ్చారు జాతీయ అధ్యక్షులు మల్లెల రాజు నాయకత్వం లో జరిగిన ఈకార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు ఉదిత్ రాజ్ పెరికె వరప్రసాద్ బిషప్ లు పాస్టర్లు అనేకమంది క్రైస్తవులు పాల్గొన్నారు

## వరి బోనస్ ఎప్పుడు

**అదిలాబాద్ :** జిల్లాలో 2024-25 రబీ సీజన్‌లో 345 కొనుగోలు కేంద్రాల నుంచి 1,97,590.920 (దొడ్డు 1,90,665.120, సన్న రకం 6,925.800) మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 34,004 మంది రైతుల నుంచి పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో కొనుగోలు చేశారు. వీటికిగాను రైతుల అకౌంట్లలో 54,76,57,616 రూపాయలు జమ చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాలు సాగు చేసిన రైతులకు బోనస్ రూ. 500 ప్రకటించింది. కానీ ఈ సీజన్ గడిచినా బోనస్ డబ్బులు రైతుల అకౌంట్లలో జమ కాలేదు. రబీ సీజన్‌లో జిల్లాలోని 34,004 మం ది రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. ఇందులో 1041 మంది రైతులు రబీలో కూడా సన్నా లు సాగు చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు క్వింటాలుకు కామన్ రకానికి రూ. 2,300, 'ఏ' గ్రేడ్ రకానికి రూ. 2,320 మద్దతు ధర ప్రకటించగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో ప్రకటించిన విధంగా 'ఏ' గ్రేడ్ రకానికి క్వింటాలుకు ప్రభుత్వ మద్ధతు ధరతో పాటు రూ. 500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించి వానా కాలం సీజన్ లో అందజేసింది. కానీ రబీలో మాత్రం సీజన్ ముగిసి రెండు నెలలు దాటవస్తున్నా ఇంత వరకు దానీ ఊసే లేదు. జిల్లాలో 1041 మంది రైతులు సన్నాలు సాగు చేశారు. కొనుగోలు కేంద్రాలకు 69,258 క్వింటాళ్ల సన్న ధాన్యం విక్రయించి వారికి రావాల్సిన 3,46,29,000 రూపాయల కోసం ఎదురు చూస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లు జిల్లాలోని నాలుగు ఏజన్సీల ద్వారా జరిపారు. రైతులు బోనస్ కోసం ఆయా ఏజెన్సీల కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వడ్లు సొసైటీ సెంటర్‌లో అమ్మి రెండు నెలలు దా టింది. ఇంత

# అబద్ధాలతో అమరావతిపై వైసీపీ దుష్ప్రచారం

- మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** రాష్ట్ర రాజధాని అమరావతిపై వైసీపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారంపై మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. అమరావతిని లేపడానికి, పొన్నూరును ముంచేశారంటూ మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన ఆరోపణలు నీటి మూటలు, నీటి మాటలని తేలిపోయాయని విమర్శించారు. గుంటూరు ఛానల్ హెడ్ రెగ్యులేటర్ మూసి ఉందా, తెరిచి ఉందా అంటే అంబటి ఎందుకు సమాధానం చెప్పడం లేదని ఆయన ప్రశ్నించారు. పొన్నూరుపైనే కాదు, ప్రకాశం బ్యారేజ్ గేట్లు పనిచేయడం లేదని, బెజవాడ మునిగిపోతుందని, కాపర్ డ్యాం కొట్టుకుపోతుందని, తుంగభద్ర గేట్లు లేవడం లేదంటూ నిత్యం అబద్ధాలు, అసత్యాలే వైసీపీ ప్రచారమని ధ్వజమెత్తారు. వైసీపీ మీడియా, సోషల్ మీడియా ప్రజల్లో భయాందోళనలు, అనుమానాలు రేకెత్తించడం అశాంతిని సృష్టించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాయని దుయ్యబట్టారు. నేతి బీరకాయలో నెయ్యి ఉండదన్నట్లుగానే వైసీపీ నేతల మాటల్లో నిజాయితీ కూడా ఉండదని ఎద్దేవా చేశారు మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు. ఇక ప్రభుత్వంపై బురదచల్లడం తగదని సూచించారు. సంక్షేమం దిశగా రాష్ట్ర ప్రభుత్వం అన్నీ చర్యలు తీసుకొని ముందుకు వెళ్తుంటే ప్రతిపక్ష పాత్ర పోషించి ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాల్సిన వైసీపీ మాత్రం బురదచల్లే ప్రయత్నం చేస్తుండడం తగదని పేర్కొన్నారు. సూపర్‌సిక్స్ కార్యక్రమాలు సూపర్‌హిట్ కావడంతో వైసీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. ఏదో ఒక విధంగా బురదచల్లి రాజకీయ లబ్ధి పొందా లనుకునే వారికి ఇప్పటికే ప్రజలు బుద్ధి చెప్పారని, ఇదేవిధానం కొనసాగితే వారికి శాశ్వతంగా స్వస్తి చెబుతారన్నారు. వికలాంగుల పింఛన్ల వ్యవహారంలో సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయడాన్ని ఇప్పటికే అంతా గుర్తించారని, వారివి ఫేక్ అని తేలిపోయిందన్నారు. వర్షాలు వస్తే అమరావతి మునిగిపోయిందని, ఉచితంగా మహిళలకు బస్సు సౌకర్యం కల్పిస్తే దానిపై కల్పితాలు అల్లారని, వారు ఏనాడయినా ప్రజలకు నిజం చెప్పారా అని ఆదిరెడ్డి అప్పారావు ప్రశ్నించారు.

## వడ్డీ వ్యాపారస్తుల వేధింపుల నుండి

# ఋణ గ్రస్తులకు రక్షణ కల్పించాలి

- మేడా శ్రీనివాస్, డిమాండ్.



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** ఋణ లావాదేవీలకు సంబంధించి న్యాయవాది ధ్రువీకరణ తప్పనిసరి చేసే విధంగా ప్రభుత్వం బిల్లును ప్రవేశ పెట్టాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టి వారాంతపు సమావేశంలో అర్పిసి వ్యవస్తాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ సందర్భంగా మేడా మాట్లాడుతూ ఋణాలు వసూలుకు కిరాయి మూకలతో దాడులు దౌర్జన్యాలు జరిపిస్తున్నారు. ప్రభుత్వాలు కూడా ప్రైవేట్ వ్యక్తులను ఋణాలు వసూలుకు ఉపాధి ముసుగులో దాదా గిరికి కిరాయి సైన్యాన్ని ప్రోత్సహస్తున్నట్టుగా వుంది. తద్వారా వడ్డీ వ్యాపారస్తులు ఘోరమైన దౌర్జన్యాలతో ఋణ గ్రస్తులను వేదిస్తున్నారు. హింసిస్తున్నారు. కొన్ని పరిస్థితుల్లో దాడులు చేస్తు కుటుంబంలో పిల్లలను , వృద్ధులను భయబ్రాంతు లకు గురించేస్తున్నారు. వడ్డీ వ్యాపారస్తులు దౌర్జన్యాలపై పోలీస్ లకు ఫిర్యాదులు చేస్తున్నా బాధితులకు ఏ విధమైన రక్షణ లేకపోతుంది. న్యాయం జరగకుంటుంది. ప్రతి ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ ల్లోను,వడ్డీ వ్యాపార కార్యాలయాల్లోను ఋణ గ్రస్తులను బెదిరించటానికి ఒక రకమైన కిరాయి మూకలను బాహటంగానే పెంచి పోషిస్తున్నారు. వారి వేధింపులు,చేష్టలు చాలా వికృతంగా ఉంటుంటాయి . బాధితుల ఘోషకు ఎవ్వరు అండగా నిలవక పోగా ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై కూడా దాడులు చేస్తున్నారు. ప్రజల జీవన అవసరాలపైన పరిస్థితుల పైన ప్రభుత్వం ఒక ప్రత్యేక పర్యవేక్షణ జరిపించి ఋణ వసూళ్లకు ప్రైవేట్ ఏజెన్సీ లను ప్రభుత్వం ప్రోత్సహించకుండా తక్షణమే ఆతరహా ప్రైవేట్ ఏజెన్సీ లను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ఆయన కోరారు. ఋణ వసూళ్లకు ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకులు కూడా లోను రికవరీలకు ప్రైవేట్ ఏజెన్సీలను నియమించుకోవటం సిగ్గు మాలిన చర్యగా బావించాలి,చట్ట నిబంధనలకూడా వ్యతిరేకంగా ప్రైవేట్ గుండాలను ఉపాధి ముసుగులో ప్రభుత్వం ప్రోత్సహించటం బాదాకరం,బ్యాంకులు అధికారికంగా గురించిన ఋణ వసూళ్ల ప్రభుత్వ ఏజెన్సీల మంటు ఋణగ్రస్తులను తీవ్ర మానసిక వేధింపులకు గురి చేస్తున్నారు. వీరి వీధిపులలో పసి పిల్లలు, మహిళలు,వృద్ధులు సైతం కొన్ని సందర్భాలలో తీవ్రంగా నష్ట పోతున్నారు . గాయ పడుతున్నారు. చట్ట బద్ధమైన హక్కులు కానరాని విధంగా ఋణ వసూళ్లకు ప్రైవేట్ ఏజెన్సీలు తెగబడుతున్నాయి . రికవరీ మూకల దాడుల్లో గాయపడిన బాధితులకు పోలీస్ లు సైతం రక్షణ కల్పించలేని విధంగా ప్రేక్షక పాత్రకు పరిమితం అవుతున్నారు. న్యాయం అందక, రక్షణ దొరకక ప్రైవేట్ ఏజెన్సీ దాడులకు బాధితులు తలాగ్గాల్సి వస్తుంది. కొన్ని ప్రాంతాల్లో వడ్డీ వ్యాపారస్తుల వేధింపులకు తాళలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈ మధ్య వడ్డీ వ్యారస్తులు, కార్పొరేట్, ప్రైవేట్ , ప్రభుత్వం నియమించు కుంటున్న ప్రైవేట్ ఏజెన్సీలు సాంకేతిక పరిజ్ఞానంతో ఋణ గ్రస్తుడు పరిచయస్తులకు , బందువులకు, కుటుంబ సభ్యులకు ఫోన్లు చేస్తు అసభ్య కరంగా మాట్లాడుతున్నారు. కొన్ని ప్రైవేట్ ఏజెన్సీల దౌర్జన్య మూకలు ఫోన్లు చేసి మీ అమ్మాయి ఫోటోలను నగ్నంగా చిత్రికరించి సోషల్ మీడియాలో అప్లోడ్ చేస్తాం అని బెదిరిస్తున్నారని ఆయన తీవ్ర ఆవేదన చెందారు . కాలయాపనకు , వివాదాలకు తావు లేకుండా ఏ ఋణాన్నైనా చట్ట బద్ధంగా వసూలు కాబడే విధంగా ఒక బలమైన ప్రభుత్వ వ్యవస్థను అమలు చేసే విధంగా ప్రభుత్వం దృష్టి సారించాలి. ఋణ గ్రస్తులు,ఋణదారుల మధ్య ఏర్పడే వివాదాలు 6 నెలలు దాటకుండా తీర్పులు వెలువడే విధంగా చట్ట సవరణలు జరిపి శాంతి భద్రతలకు ప్రభుత్వం ఆదర్శంగా నిలవాలి. ఏ విధమైన ఋణ లావాదేవీలుకైనా ప్రాదమిక రోజు నుండి 10 ఏళు అనుభవం గల న్యాయవాది ధ్రువీకరణను తప్పనిసరి చేస్తు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను అమల్లోకి తేవాలి. తద్వారా ఋణ బాధితులు,ఋణ దారులు మధ్య సమస్యలు సర్దుమణుగుతాయి . ప్రస్తుత వడ్డీ వ్యాపారస్తుల దాడులు, దౌర్జ్యలకు ప్రభుత్వాల అసమర్థతే ప్రధాన కారణంగా బావించాలి. ప్రస్తుతం ప్రచారంలో ఉన్నటువంటి కాల్ మణి కేసులు బాధితులను కాపాడలేక పొగా వడ్డీ వ్యాపారస్తులకు అండగా నిలుస్తు బాధితులను వెక్కిరిస్తున్నట్టుగా వుంది . వేధింపులు ఆగవు , చట్టాలు రక్షించవు , పాలకుల అసమర్ధత బాదితులను నిత్యం వేదిస్తూనే వుంటున్నాయి . మెరుగైన సంస్కరణలతో చట్ట పరమైన హక్కులు ప్రజలకు అందే విధంగా ప్రభుత్వ చర్యలు కాబడే విధంగా పాలనా విధానాలు అమలు కాబడాలని , వడ్డీ వ్యాపారస్తులు,ప్రైవేట్, కార్పొరేట్ ఋణ వేధింపుల నుండి మానసిక ఒత్తిడిలకు గురవుతున్న బాధితులకు రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అండగా నిలుస్తుందని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ బాధితులకు భరోసా ఇచ్చారు.

సభకు అర్పిసి సీనియర్ సెక్యులర్ పెంద్యాల కామరాజు అధ్యక్షత వహించారు ..

ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ సర్వశ్రీ డి వి రమణమూర్తి ,సిమ్మా దుర్గారావు ,దుడ్డే త్రినాథ్, దుడ్డే సురేష్ ,వర్ధనపు శరత్ కుమార్,కారుమూరి యుగంధర్,మాసా అప్పాయమ్మ,నాగూరు అన్నపూర్ణ,గుడ్ల సాయి దుర్గా ప్రసాద్, బసా సోనియా,వాడపల్లి జ్యోతిష్ ,డి వి వి ఎస్ ఎన్ మూర్తి యాదవ్,వల్లి శ్రీనివాసరావు,బత్తెన శివన్నారాయణ,జవ్వాది మోహన్,కాకర ప్రసాద్, మాసా కమల,చల్లా సాంబశివరావు,చల్లా అఖిల్,గెద్దాడ సుందరి,తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ మదర్ థెరిస్సా జాతీయ సేవా పురస్కారం అందుకున్న డా.డి శ్రీను

- సి.సి.యమ్ కు దక్కిన జాతీయ పురస్కారం.



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** తూర్పుగోదావరిజిల్లా రాజమండ్రి రూరల్ బుచ్చియ్యనగర్ కు చెందిన సి.సి.యమ్ ట్రస్టు ఫౌండర్ అండ్ చైర్మన్ డా.ద్వారపూడి శ్రీను సెయింట్ మదర్ థెరిస్సా జాతీయ సేవా పురస్కారం ను విశిష్ట అతిథుల సమక్షంలో ఆదివారం రావులపాలెంలో సి.ఆర్. సి. ఎ.సి ఫంక్షన్ హాలులో జాతీయ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డుల కార్యక్రమం మదర్ థెరిస్సా ఎడ్యుకేషన్ సొసైటీ రావులపాలెం చైర్మన్ డా.దిడ్ల కిషోర్ ఆధ్వర్యంలో పలువురు విశిష్ట అతిథులు సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల నుండి సుమారు 75 మందికి అవార్డులను ప్రధానం చేశామని కిషోర్ తెలిపారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన విక్టరీ వెంకటరెడ్డి,గుడివాడ సి.ఐ రమణమ్మ ఇంకా పలువురు సభను ఉద్దేశించి మాట్లాడారు. డా.ద్వారపూడి శ్రీను మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి మథర్ థెరిస్సా జాతీయ అవార్డు తీసుకోవాలనే కల ఈరోజు నెరవేరిందని,ఈరోజు మా సి.సి.యమ్.ట్రస్టుకు దక్కిన అరుదైన గౌరవం అని అన్నారు. ఈ అవార్డు రావడం చాల సంతోషంగా ఉందని, మరింత సేవా చేయాలని బాధ్యతను పెంచిందన్నారు. అవార్డును ప్రధానం చేసిన కిషోర్ మరియు టీం సభ్యులందరికి కృతజ్ఞతలు తెలిపారు.

## డా.మణికుమార్ కు మదర్ థెరిస్సా జాతీయ పురస్కారం అందజేత



**రాజానగరం,విశ్వం వాయిస్ న్యూస్:** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో సి.ఆర్.సి. పంక్షన్ హాల్లో మదర్ థెరిస్సా ఎడ్యుకేషనల్ సొసైటీ వారు 17వ వార్షికోత్సవం సందర్భంగా మదర్ థెరిస్సా జాతీయ సేవా పురస్కారలలో భాగంగా పవన్ కళ్యాణ్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ పెంటగట్ల మణికుమార్ మదర్ థెరిస్సా జాతీయ ప్రేరణ అవార్డును మదర్ థెరిస్సా ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ దిడ్ల కిషోర్ డాక్టర్ వడియర్,సి.ఆర్.సి రూపకర్త విక్టరీ వెంకట్రామిరెడ్డి,సర్కిల్ ఇన్స్పెక్టర్ రమణమ్మ ఇతర ప్రముఖులు చేతులు మీదగా మదర్ థెరిస్సా జాతీయ అవార్డును డాక్టర్ పెంటగట్ల మణికుమార్ అందుకోవడం జరిగింది. మదర్ థెరిస్సా ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ దిడ్ల కిషోర్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మణి అన్న బ్లడ్ ఆర్మీ సేవ సంస్థ , గ్లోబల్ మానవహక్కుల సంఘం సమాచార హక్కు చట్టం-2005 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు డా" పెంటగట్ల మణికుమార్ చేస్తున అనేక రక్తదాన శిబిరాలు ఏర్పాటు , జాతీయ అంతర్జాతీయ అవార్డులు3 డాక్టరేట్లు అందుకోవడం,అనేక సేవా కార్యక్రమాలు నిర్వహణ చేయడం జరిగిందనీ అన్నారు. ఈ కార్యక్రమంలో సి. ఆర్.సి ప్రధాన కార్యదర్శి వీర రాఘవరెడ్డి,శివ కుమార్, చంద్ర సుబ్బారెడ్డి , ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎల్ ఐ సి అభివృద్ధికి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు కృషి చెయ్యాలి




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** ఆదివారం ఉదయం స్థానిక మోరంపూడి జంక్షన్ లో గల ఏపీ ఎస్ సి బి హాల్ లో జరిగిన ఎల్ఐసి ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రాజమండ్రి డివిజన్ 33వ జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి డివిజన్ ప్రధాన కార్యదర్శి సమతం గన్నేయ్య స్వాగతం పలికారు. ఆల్ ఇండియా ఎల్ఐసి ఎస్సి,ఎస్టీ ఉద్యోగులు జాతీయ ప్రధాన కార్యదర్శి. సి.సిద్దార్థన్ పాల్గొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షుడుగా డివిజన్ ప్రెసిడెంట్ జె. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయం సాధనకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలి అని కోరారు. ముఖ్య అతిధి సిద్దార్థన్ మాట్లాడుతూ దేశంలోనే జీవిత భీమా సంస్థ ఎంతో అభివృద్ధి చెందింది,గనుక ఉద్యోగులు తమ సేవలను పూర్తి స్థాయిలో నిర్వహించాలని అన్నారు. సీనియర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహు మాట్లాడుతూ రాజమండ్రి డివిజన్ జీవిత బీమా సంస్థ వ్యాపారంలోని జోనల్ లెవెల్ లోనే ముందు స్థాయిలో ఉండుటకు ఉద్యోగుల కృషి ఎంతో ఉంది,అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల హక్కులను కాపాడుటలో తమ వంతు సహకారం పూర్తిగా ఉంటుందని తెలియజేసారు. ఎన్ఏడి పాల్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చూపిన మార్గములో ఉద్యోగు లందరూ పనిచేసే సమాజం లో గల పేదరికం, విద్య అసమానతలను తొలగించుటలో తమ వంతు కృషి చేయవలసింది గా కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ జనరల్ సెక్రటరీ ఆర్ వెంకటేశ్వరరావు, సామాజికవేత్త తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్,పి అండ్ ఐ ఆర్ మేనేజర్ పూర్ణచంద్రరావు, హైదరాబాదు, విశాఖపట్నం ప్రధాన కార్యదర్శులు కే విశ్వనిధి, గణపతి, డివిజనల్ నాయకులు శ్రీనివాస్,డివి కిషోర్, సిహెచ్ భాస్కర్,రాధాకృష్ణ, అరవింద, కె విద్యాసాగర్, రాజ్ కుమార్, అశోక్ కుమార్, అబ్రహాం, శ్రీ కిరణ్, ఆనంద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# భారత్ ఎకానమీకి 'పర్యాటకం' దన్ను

2024లో రూ.21.15 లక్షల కోట్ల ఆదాయం

దేశీయ పర్యాటక రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ముఖ్యంగా కోవిడ్ మహమ్మారి అనంతరం పర్యాటకం తిరిగి పూర్వ స్థాయిని మించి పుంజుకుంది. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకం రెండూ బలంగా విస్తరిస్తున్నప్పటికీ, వసతి మౌలిక సదుపాయాలలో గణనీయమైన కొరత ఉందని నీతిఆయోగ్ తాజా నివేదికలో స్పష్టం చేసింది. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ అంచనాల ప్రకారం పీక్ సీజన్లలో దేశవ్యాప్తంగా రెండు లక్షలకు పైగా హెూటల్ గదుల కొరత ఉంటుందని నివేదిక పేర్కొంది. ఈ నేపథ్యంలో హెూమ్ స్టేలు కీలక ప్రత్యామ్నాయంగా మారుతున్నాయని, వాటి విస్తరణకు మరిన్ని మార్గాలను అనుసరించాల్సిన అవసరం ఉందని నివేదిక సూచించింది.

**ప్రత్యామ్నాయ వసతి రంగం పురోగతి**

పర్యాటక రంగం విస్తృతంగా పెరుగుతున్న తరుణంలో వసతి మౌలిక సదుపాయాల లోటును భర్తీ చేయడానికి ప్రత్యామ్నాయ వసతి కీలక పరిష్కారంగా నిలుస్తోంది. కొత్త హెూటళ్ల నిర్మాణానికి అధిక పెట్టుబడి, నియంత్రణ ఆమోదాలు, భూమి లభ్యత అవసరం. అయితే, హెూమ్ స్టేలు తక్కువ ఖర్చుతోనే చక్కటి వసతి సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ప్రత్యేకించి మారుమూల ప్రాంతాలు, ద్వితీయ%–%తృతీయ శ్రేణి నగరాలకు ఇవి ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయి. పర్యావరణ స్పృహ, కమ్యూనిటీ ఆధారిత పర్యాటకంతో వీటిని అనుసంధానం చేయాలని నివేదిక సూచించింది. హెూమ్ స్టేల కోసం కేంద్రం, రాష్ట్రాలు ఒక నమూనా విధానం రూపొందించాల్సిన అవసరం ఉందని స్పష్టం



చేసింది. నివేదిక సిఫారసు చేసిన అంశాల్లో.. కొత్త ఆపరేటర్లకు సాంకేతిక సహాయం, ప్రాజెక్టు నిర్వహణ నైపుణ్యం, ఉత్తమ పద్ధతులపై మార్గదర్శకం, ఆర్థిక, ఆర్థికేతర రాయితీలు, గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు ప్రత్యేక మద్దతు, నీరు, విద్యుత్, ఆస్తి పన్నులలో నివాస రేట్ల రాయితీలు, హెూమ్ స్టే రిజిస్ట్రేషన్ కోసం సింగిల్ విండో క్లియరెన్స్ వ్యవస్థ ఏర్పాటు వంటివి ఉన్నాయి.

**నివేదికలోని కొన్ని ముఖ్యాంశాలు..**

' 2024లో ప్రయాణ%–%పర్యాటక రంగం దేశ ఆర్థిక వ్యవస్థకు రూ.21.15 లక్షల కోట్లు అందించింది. ఇది 2019తో పోలిస్తే 21 శాతం పెరుగుదల.

' వచ్చే దశాబ్దంలో ఈ రంగం రూ.43.25 లక్షల కోట్లు ఆర్థిక వ్యవస్థకు అందజేస్తుంది. ఇది దేశ జీడీపీలో 7.6 శాతంగా ఉంటుంది.

' 2024లో దేశీయ పర్యాటకులు రూ.16 లక్షల కోట్లు ఖర్చు చేశారు. ఇది 2019తో పోలిస్తే దాదాపు 25 శాతం అధికం. 2034 నాటికి ఈ ఖర్చు రూ.28.70 లక్షల కోట్లు చేరనుంది.

' అంతర్జాతీయ పర్యాటకులు 2024లో రూ.2.85 లక్షల కోట్లు ఖర్చు చేయగా, 2034 నాటికి అది రూ.4.07 లక్షల కోట్లు దాటుతుందని అంచనా.

' ప్రస్తుతం పర్యాటక రంగంలో 4.32 కోట్ల మంది ఉపాధి పొందుతున్నారు. అంటే, ప్రతి 11 ఉద్యోగాలలో ఒకటి ఈ రంగానిదే. 2034 నాటికి ఈ రంగంలో ఉపాధి 6.3 కోట్లకు పెరుగుతుంది.

' పర్యాటకుల అభిరుచులు కూడా మారుతున్నాయి. సుదీర్ఘమైన, ప్రయోజనకరమైన ప్రయాణాలపై వారు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.

' 87 శాతం మంది పర్యాటకులు కొత్త గమ్యస్థానాల్లో పర్యటించి, ఆ అనుభూతులను పదిలపరచుకోడానికి దీర్ఘకాల పర్యటనలను కోరుకుంటున్నారు.

' వర్కేషన్స్ (విహార ప్రదేశంలో ఉంటూ పని చేయడం), డిజిటల్ నోమాడ్ (స్థిర నివాసం లేకుండా, ప్రపంచంలోని ఏ ప్రదేశం నుంచైనా ఆన్‌లైన్‌లో పని చేసేవాడు) సంస్కృతి పెరుగుతున్నందున దీర్ఘకాల వసతిపై డిమాండ్ పెరిగింది.

' హెూమ్ స్టేలు, ఆఫ్‌బీట్ అలాగే గ్రామీణ పర్యాటకం వేగంగా విస్తరిస్తున్నాయి. దేశీయ హెూమ్ స్టే మార్కెట్ 2024ులో రూ.4,722 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది.

' ఈ మారుతున్న ధోరణులు పర్యావరణ హిత, వెల్‌నెస్ టూరిజం, గ్రామీణ హెూమ్ స్టేల వంటి ప్రత్యామ్నాయ పర్యాటక నమూనాలకు దారి తీస్తున్నాయి.

## మొదటిసారి రుణం తీసుకునేవారికి కనీస సిబిల్ స్కోర్ అక్కర్లేదు



న్యూఢిల్లీ

మొదటిసారి బ్యాంకు రుణం తీసుకునే వారికి కనీస సిబిల్ స్కోర్ అవసరం లేదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా గత వారం లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి మాట్లాడుతూ.. మొదటిసారి రుణం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి క్రెడిట్ స్కోర్ తక్కువగా లేదా సున్నాగా ఉంటే రుణ దరఖాస్తులను బ్యాంకులు తిరస్కరించరాదన్నారు. ఈ సందర్భంగా ఆర్బీఐ ఇచ్చిన ఆదేశాలను ఆయన ప్రస్తావించారు. కేవలం క్రెడిట్ చరిత్ర లేదన్న కారణంతో మొదటిసారి రుణం తీసుకునే వారి రుణ దరఖాస్తును బ్యాంకులు తిరస్కరించరాదని ఆర్బీఐ సూచించినట్టు తెలిపారు. రుణ దరఖాస్తులకు ఆర్బీఐ కనీస క్రెడిట్ స్కోర్‌ను ఏమీ సూచించలేదన్నారు. మొదటిసారి రుణం తీసుకునే వారికి సిబిల్ స్కోర్ తప్పనిసరి కాకపోయినప్పటికీ దరఖాస్తుదారుల నేపథ్య తనిఖీని నిర్వహించాలని ఆర్థిక మంత్రిత్వ శాఖ బ్యాంకులను కోరింది. వీటిలో క్రెడిట్ చరిత్ర, గత చెల్లింపుల చరిత్ర, చెల్లింపుల్లో జాప్యం, రుణాల సెటిల్‌మెంట్ వంటివి ఉంటాయి. కాగా క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీలు(సీఐసీ) ఒక వ్యక్తికి క్రెడిట్ రిపోర్టులను ఇవ్వడానికి రూ.100 వరకు చార్జీని వసూలు చేయవచ్చని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. అంతకు మించిన మొత్తం ఆమోదనీయం కాదన్నారు.

**సిబిల్ స్కోర్ అంటే?**

సిబిల్ అంటే.. క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (ఇండియా) లిమిటెడ్. సిబిల్ స్కోర్ అనేది క్రెడిట్ యోగ్యతను నిర్ణయించే మూడంకెల సంఖ్య. ఈ స్కోర్ 300 నుంచి 900 వరకు ఉంటుంది. వ్యక్తిగత, బంగారం, గృహ, ఇతర బ్యాంకు రుణాలను తీసుకోవడానికి ఒక వ్యక్తి అర్హతను నిర్ణయించడానికి గాను సిబిల్ ఇచ్చే స్కోర్‌ను బ్యాంకులు వినియోగిస్తుంటాయి. స్కోరు 750అంతకంటే మెరుగ్గా ఉంటే పలు రుణాల ఆమోదానికి అర్హత ఎక్కువగా ఉంటుంది.

## ఓట్ల తారుమారుకు మోదీ యత్నం



అరారియా

ఓటర్ల జాబితాలను తారుమారు చేసేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. బిహార్లో జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) ద్వారా పేదల ఓట్లు దొంగిలించాలని ఆయన అనుకుంటున్నారని విమర్శించారు. చిన్న పిల్లలు సైతం 'ఓట్ల దొంగా.. గద్దె దిగు' అంటున్నారని.. ఈసీ వారితో మాట్లాడాలని సూచించారు. ఆయన చేపట్టిన 'ఓటర్ అధికార యాత్ర' ఆదివారం అరారియా చేరుకుంది. ఓటర్ అధికార యాత్ర సందర్భంగా రాహుల్, తేజస్వి బుల్లెట్‌పై కాసేపు ప్రయాణించారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తి భద్రతావలయాన్ని ఛేదించుకుని వచ్చి రాహుల్ ఎడమ భుజంపై ముద్దుపెట్టాడు. వెంటనే భద్రతాసిబ్బంది అతడిని కొట్టి సెక్యూరిటీ జోన్‌కు దూరంగా తీసుకెళ్లి వదిలిపెట్టారు. ఇదిలా ఉండగా, బిహార్లో ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా చేపట్టిన ఓటర్ల డాక్యుమెంట్ల తనిఖీ ముమ్మరంగా సాగుతోందని ఎన్నికల కమిషన్ వెల్లడించింది. ఇప్పటివరకు 98.2 శాతం మంది డాక్యుమెంట్లు సమర్పించారని తెలిపింది. ధ్రువపత్రాలకు ఇంకా 8రోజుల సమయం మాత్రమే ఉందని పేర్కొంది.

# 'ఓట్ల చోరీ' తరువాత అధికారాన్ని చోరీ చేసే పనిలో బీజేపీ ఉంది

ఓట్ల చోరీ తరువాత అధికారాన్ని చోరీ చేసే పనిలో బీజేపీ నిమగ్నమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. విపక్షాల ప్రభుత్వాలను 30 రోజుల్లో కూల్చి వేసేందుకే కేంద్రం 130వ రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకొచ్చిందని అన్నారు. అరెస్టులను ఆయుధంగా ఉపయోగించి ప్రజాస్వామ్యాన్ని అస్థిరపరిచడమే లక్ష్యంగా బీజేపీ ఈ బిల్లు తీసుకువచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఏదైనా కేసులో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు అరెస్టు అయ్యి వరుసగా 30 రోజులపాటు జైలులో ఉంటే, వారు పదవి కోల్పోయేలా కేంద్ర ప్రభుత్వం ఇటీవల లోక్‌సభలో మూడు బిల్లులు ప్రవేశపెట్టింది. వాటిని ఉద్దేశించి ఖర్గే మాట్లాడుతూ, 'ఈ బిల్లులు పౌరులు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూల్చివేయడానికి ఈడీ, సీబీఐ లాంటి సంస్థలకు అవకాశం కల్పిస్తాయి. ఇది ప్రజాస్వామ్యంపై బుల్డోజర్ నడపడం లాంటిది' అని పేర్కొన్నారు.

హరియాణా, మధ్యప్రదేశ్‌లో నూతనంగా నియమితులైన డీసీసీ అధ్యక్షులకు దిల్లీలోని ఇందిరా భవన్‌లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఖర్గే బీజేపీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఓటు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్?ఐఆర్?) ద్వారా ఓట్లను తొలగించే ప్రక్రియను బీజేపీ మున్ముందు కొనసాగిస్తుందని, వాటి పట్ల జిల్లా అధ్యక్షులు అప్రమత్తంగా ఉండాలని ఖర్గే సూచించారు. రాహుల్ గాంధీ చేపడుతున్న 'ఓటు అధికార్ యాత్ర' నుంచి ప్రజలను పక్కదోవ పట్టించేందుకు ప్రధాని మోదీ చొరబాటుదారుల అంశాన్ని లేవనెత్తారని మండిపడ్డారు. అవినీతి గురించి మాట్లాడుతున్న ప్రధాని అక్రమాలు చేసిన వారందరినీ పార్టీలో చేర్చుకొని మంత్రులు చేశారని ఖర్గే ఆరోపించారు.



**'కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి'**

ఈ సందర్భంగా, సంస్థాగతంగా కాంగ్రెస్?ను బలోపేతం చేయాలని ఖర్గే డీసీసీ అధ్యక్షులకు సూచించారు. బూత్?, మండల్ కమిటీలను ఏర్పాటు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ ప్యానెల్?లోని వ్యక్తులు పార్టీకి విధేయులుగా ఉండేలా, కాంగ్రెస్ సిద్ధాంతం నుంచి చలించకుండా చూసుకోవాలని ఖర్గే సూచించారు. ఎవరు ప్రలోభపెట్టినా, కాంగ్రెస్?కు విధేయలుగా ఉండే వ్యక్తులు పార్టీకి అవసరం అని నొక్కి చెప్పారు. అంతేకాదు, 'జిల్లా అధ్యక్షులకు ప్రాధాన్యం ఇవ్వకుండా పార్టీని తిరిగి అధికారంలోకి తేలేమని నేను, రాహుల్ గాంధీ గ్రహించాము. అందుకే డీసీసీలకు ప్రాధాన్యం కల్పిస్తున్నాం' అని ఖర్గే తెలిపారు.

**'ఓట్ల చోరీని 6నెలల తర్వాత గుర్తించాం'**

"కర్ణాటకలోని మహాదేవపురలో ఓట్ల చోరీ గురించి మాకు ఆరు నెలల పరిశోధన తర్వాత తెలిసింది. దీని గురించే రాహుల్ గాంధీ వివరణాత్మకంగా ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇప్పుడు బిహార్?లో బీజేపీ, ఈసీ కలిసి ఎస్?ఐఆర్ అనే కొత్త ఎత్తుగడను వేశాయి. అయితే దీనికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పార్లమెంట్?లో ఈ అంశంపై చర్చించాలని మేము కోరాం. కానీ ఓటు చోరీ చర్చ జరగకుండా బీజేపీ జాగ్రత్తపడింది. ఇకపై ఎస్?ఐఆర్ వంటి స్కీమ్?లతో బీజేపీ మన ప్రజల ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తూనే ఉంటుంది. కనుక కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు దీనిపై చాలా అప్రమత్తంగా ఉండాలి. బీజేపీ వ్యక్తులు, బీఎల్?ఓలు మన ప్రజల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగిస్తే, వెంటనే వారిని పట్టుకోవాలి. ఈ దేశంలో ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కాంగ్రెస్ ఇచ్చిన గిఫ్ట్ అని చెప్పాలి. ఎందుకంటే రాజీవ్ గాంధీ ఓటు హక్కు వయస్సును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించారు. దీని ద్వారా ప్రజాస్వామ్యంలో యువత పాల్గొనేలా చేశారు" అని మల్లికార్జున ఖర్గే చెప్పారు.

**'ప్రతిపక్ష నేతలను తొలగించే కుట్ర'**

"మన దేశంలో ప్రతిపక్ష నేతలపై ఈడీ, సీబీఐలు 193 కేసులు పెట్టాయి. కానీ వాటిలో కేవలం రెండు కేసుల్లో మాత్రమే నిందితులు దోషులుగా తేలారు. సీబీఐ చాలా మంది ముఖ్యంత్రులు, మంత్రులను అరెస్ట్ చేసి నెలల తరబడి జైలులో ఉంచింది. కానీ ఇప్పుడు తన వద్ద ఎలాంటి ఆధారాలు లేవని చెబుతోంది. ఒక వేళ కేంద్రం తెచ్చిన బిల్లులు పార్లమెంట్?లో పాస్? అయితే, విపక్ష నేతలను అరెస్టులు అనే ఆయుధంతో బీజేపీ తొలగించే ప్రయత్నం చేస్తుంది" అని ఖర్గే ఆరోపించారు. కేంద్రం తెచ్చిన బిల్లుల ప్రకారం, కనీసం ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధించదగిన నేరాలపై ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, మంత్రులు అరెస్ట్ అయితే, వారు వరుసగా 30 రోజులు కస్టడీలో ఉంటే, వారు 31వ రోజున తమ పదవులు కోల్పోతారు.

# అంతరిక్షం నుంచి ఎంతో అందంగా భారత్

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి భారత్ చాలా అందంగా కనిపించిందని భారతీయ వ్యోమగామి శు భాంశు శుక్లా చెప్పారు. ప్రపంచంలోని ప్రత్యేక స్థానంలో, విశిష్ట ఆకారంలో ఉన్నందు వల్లే మన దేశం అలా కనిపించి ఉండొచ్చన్నారు. తాను భారతీయుడిని అయినందున ఈ మాట చెప్పడం లేదని, ఐఎస్ఎస్‌లోని ఏ వ్యోమగామిని అడిగినా ఈ విషయాన్నే చెబుతారని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేకించి రాత్రి టైంలో హిందూ మహాసముద్ర మార్గంలో దక్షిణ దిశ నుంచి ఉత్తర దిశకు ఐఎస్ఎస్ వెళ్లేటప్పుడు, భారత్ చాలా అద్భుతంగా కనిపిస్తుందన్నారు. గగన్‌యాన్ మిషన్ కోసం ఎంపికైన నలుగురు గగన్ యాత్రీలను సత్కరించేందుకు భారత వాయుసేన ఆదివారం న్యూదిల్లీలోని సుబ్రతో పార్క్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈసందర్భంగా నలుగురు గగన్ యాత్రీలు శుభాంశు శుక్లా (గ్రూప్ కెప్టెన్), పీవీ నాయర్ (గ్రూప్ కెప్టెన్), అజిత్ క్రిష్ణన్ (గ్రూప్ కెప్టెన్), అంగద్ ప్రతాప్ (గ్రూప్ కెప్టెన్)లను రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సన్మానించారు. ఈ సందర్భంగా శుభాంశు శుక్లా మాట్లాడుతూ, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో తాను చవిచూసిన అనుభూతి గురించి వివరించారు. అక్కడి నుంచి తాను రికార్డ్ చేసిన భారతదేశం వీడియోను చూపిస్తూ, భూమి ఎగువ వాతావరణంలో ఆక్సిజన్ ఆకుపచ్చ కాంతి, నక్షత్రమయ ఆకాశం ఉన్నాయన్నారు. హైదరాబాద్, బెంగళూరు నగరాలను శుభాంశు శుక్లా ప్రస్తావిస్తూ, ఈ రెండు నగరాల్లో సూర్యోదయం కావడాన్ని ఐఎస్ఎస్‌లోని వ్యోమగాములు రోజూ



స్పష్టంగా చూడగలుగుతారని చెప్పారు. ఈ గొప్ప సీన్‌ను వ్యోమగాములు ఒక రోజులో ఏకంగా 16 సార్లు చూడగలుగుతారని, అయినా ఏ ఒక్కసారి కూడా బోర్ కొట్టదన్నారు. కొన్ని నెలల క్రితమే అమెరికాకు చెందిన యాక్సియం– 4 మిషన్ ద్వారా శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాని(ఐఎస్ఎస్)కు వెళ్లొచ్చారు. అక్కడ ఎదురైన అనుభూతిని తెలిపే క్రమంలో ఆయన ఈవివరాలను వెల్లడించారు.

**నేను సిగ్గరిని, సంకోచించే వాడిని!**

"భారత వాయుసేనలో చేరిన కొత్తలో నేను సిగ్గరిని. మాట్లాడాలన్నా సంకోచించే వాడిని. నా నిర్ణయాలపై నాకే సందేహాలు వస్తుండేవి. అంతరిక్ష ప్రయాణం చేసే అవకాశం లభిస్తుందని అస్సలు అనుకోలేదు. దాని గురించి ఎన్నడూ కలలు కూడా కనలేదు. రాకేశ్ శర్మ అంతరిక్ష యాత్ర గురించి చిన్నప్పుడు కథలు మాత్రం వినేవాడిని. అటువంటి నన్ను భారత వాయుసేన ఈ స్థాయికి తీసుకొచ్చింది. నాలో ఈ గొప్ప మార్పుకు వాయుసేనే కారణం. విమానంలోని కాక్‌పిట్ నా గొప్ప గురువు. ఈ యూనిఫామ్‌కు నేను రుణపడి ఉంటాను. భారత వాయుసేనకు నా ధన్యవాదాలు. ఇక్కడ కూర్చున్న వాళ్లంతా తమతమ స్థాయిల్లో చక్కగా విధులను నిర్వర్తించి ఉంటారు. నేనూ అలాగే ఫీలవుతాను. ఏ బాధ్యతను అప్పగించినా చక్కగా నిర్వర్తిస్తాను. ఎయిర్‌ఫోర్స్‌లో చేరే ప్రతీ ఒక్కరికి ఇదే విధమైన బాధ్యతాయుత ప్రవర్తన అలవడుతుంది" అని వ్యోమగామి శుభాంశు శుక్లా చెప్పారు.

**దేవుడికి, పైలట్‌కు మధ్యనున్న తేడా ఏమిటో తెలుసా?!**

"నేను యాక్సియం– 4 మిషన్ ద్వారా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లాను. మా మిషన్‌కు కమాండర్‌గా పెగ్గీ విట్సన్ ఉన్నారు. అంతరిక్షంలో ఏకంగా 695 రోజుల పాటు గడిపిన రికార్డు ఆమెకు ఉంది. నేను ఒకసారి ఆమెతో సరదాగా మాట్లాడుతూ, దేవుడికి, పైలట్‌కు మధ్యనున్న తేడా ఏమిటో తెలుసా? అని అడిగాను. ఆమె తెలియదు అని చెప్పింది. తాను పైలట్ అని దేవుడు అనుకోడు అని ఆమెకు ఆన్సర్ ఇచ్చాను" అని శుభాంశు శుక్లా వివరించారు.

**గగన్ యాత్రీలను చూసి భారత్ గర్విస్తోంది : రాజ్‌నాథ్**

గగన్ యాన్ మిషన్‌కు వెళ్లనున్న నలుగురు గగన్ యాత్రీలు భారతదేశానికే గర్వకారణమని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. ఇందుకోసం వారు చాలా కఠినమైన శిక్షణను పొందారని చెప్పారు. అంతరిక్ష అన్వేషణలో భారత్ పెట్టుకున్న లక్ష్యాల సాకారంలో ఈ గగన్ యాత్రీలు కీలక పాత్ర పోషించబోతున్నారని ఆయన తెలిపారు. గగన్ యాత్రీల టీమ్‌లోని శుభాంశు శుక్లా, పీవీ నాయర్, అజిత్ క్రిష్ణన్, అంగద్ ప్రతాప్ భారతమాత ముద్దుబిడ్డలని, వారిని చూసి గర్విస్తున్నామని రాజ్‌నాథ్ చెప్పారు. యాక్సియం–4 మిషన్‌ను ముగించుకొని ఆగస్టు 17న భారత్‌కు తిరిగొచ్చిన శుభాంశు శు క్లాకు యావత్ భారతదేశం ఘన స్వాగతం పలికిందన్నారు. భారత్ చేపట్టబోయే గగన్ యాన్ మిషన్ అనేది ఆత్మనిర్భర్ భారత్ ప్రస్థానంలో కొత్త అధ్యాయం లాంటిదని ఆయన పేర్కొన్నారు. దీని ద్వారా ప్రపంచంలోని ప్రధాన అంతరిక్ష శక్తుల సరసన నిలిచేందుకు భారత్ గొప్ప క్రతువు చేయబోతోందని చెప్పారు. ఈ మిషన్ కోసం రత్నాల్లాంటి నలుగురు భారతీయ వ్యోమగాములు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. 40 ఏళ్ల క్రితం భారతీయ వ్యోమగామి రాకేశ్ శర్మ అంతరిక్షంలోకి అడుగుపెట్టారని, మళ్లీ ఇప్పుడు శుభాంశు శుక్లా ఆ ఘనతను సొంతం చేసుకున్నారని కొనియాడారు.

# వేములవాడ అభివృద్ధికి తొలి అడుగు!

**ములవాగు బ్రిడ్జి నుండి రాజన్న ఆలయం దాకా రూ.6.5 కోట్లతో 80 ఫీట్ల రోడ్డుకు శంకుస్థాపన**



వేములవాడ పట్టణంలోని ములవాగు బ్రిడ్జి నుండి రాజన్న ఆలయం వరకు రూ.6 కోట్ల 50 లక్షల వ్యయంతో 80 ఫీట్ల వెడల్పుతో రోడ్డుకు శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అతనితో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా ఎస్పీ మహేష్ బి గితే, ఆలయ ఈవో రాధ భాయి, మార్కెట్ కమిటీ చైర్మన్లు రొండి రాజు, చెలకల తిరుపతి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వేములవాడ రోడ్డు వెడల్పు కోసం ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కోడెను కట్టే ప్రాచీన ఆనవాయితీ ఉన్న రాజన్న ఆలయం అభివృద్ధి తెలంగాణ ప్రభుత్వానికి ప్రాధాన్యత అంశమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రత్యేక ప్రణాళికలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి నెలలోనే వీటిడిఏ సమావేశం నిర్వహించి గతంలో పోయిన రూ.20 కోట్ల నిధులను తిరిగి తెప్పించి బద్దిపోచమ్మ ఆలయం అభివృద్ధికి ప్రారంభించామని తెలిపారు. గతంలో రాష్ట్రాన్ని నడిపించిన కేసీఆర్ వేములవాడ అభివృద్ధిపై వాగ్దానాలు ఇచ్చినప్పటికీ వాటిని అమలు చేయలేకపోయారని విమర్శించారు. రాజన్న భక్తులు ఎన్నిసార్లు కోరినప్పటికీ ఒక్క ఇటుక మార్చని స్థితిలో వదిలేశారని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.150 కోట్లను కేటాయించి రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. గత సంవత్సరం నవంబర్ 20న సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎనిమిది మంది మంత్రుల చేతుల మీదుగా సుమారు రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్టు గుర్తు చేశారు. ఇప్పుడు ఆ పనులు వేగంగా కొనసాగుతున్నాయనీ, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పర్యవేక్షణలో అధికారులు క్షేత్రస్థాయిలో పనులను అమలు చేస్తున్నారని తెలిపారు. గత 54 ఏళ్లుగా ఎదురుచూస్తున్న వేములవాడ పట్టణ రోడ్డు వెడల్పు పనులను నేడు మొదలుపెట్టడం మైలురాయిగా పేర్కొన్నారు. 47 కోట్ల రూపాయల ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్రానికి పంపి, నిధులు కలెక్టర్ ఖాతాలో జమ చేయించినట్టు వివరించారు. భూసేకరణలో నిర్వాసితుల త్యాగం వెలకట్టలేనిదని, వారికి 2013 చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లించామని అన్నారు. రోడ్డు ఇరువైపులా ఆధునిక డ్రైనేజీ, లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఇప్పటికే ఆలయ అభివృద్ధికి సంబంధించిన 76 కోట్ల రూపాయల పనులకు అగ్రిమెంట్లు పూర్తయ్యాయని, నమూనాలు త్వరలో విడుదల కానున్నాయని తెలిపారు. 35 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయని, పనులు ప్రారంభం కావనున్నాయని చెప్పారు. శృంగేరి పీఠాధిపతుల సూచనలతో వేములవాడ పరిరక్షణ సమితి ఏర్పడి ప్రజల సలహాలు సూచనలు తీసుకున్నట్టు చెప్పారు. రాజన్న ఆలయ అభివృద్ధి ఒక్కరి పనికాదు, ఇది ప్రజల, భక్తుల ఎజెండా అని స్పష్టం చేశారు. వేములవాడ పట్టణాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేస్తామని, భక్తులకు శీఘ్ర దర్శన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వంలో ఈరోజు అభివృద్ధికి క్షేత్రస్థాయిలో తొలి అడుగు వేసినట్టు పేర్కొంటూ, కార్యక్రమానికి హాజరైన పట్టణ ప్రజలకు, భక్తులకు ధన్యవాదాలు తెలిపారు.

# ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

## పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్



విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ హెచ్చరించారు. త్వరలో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో ఆదివారం ఆయన ఈ ప్రకటన విడుదల చేశారు. ర్యాగింగ్‌కు పాల్పడడం తీవ్రమైన నేరమని, ఇది విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తుందని ఆయన అన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్లపై చేసే వేధింపులు, అసభ్యకర కార్యకలాపాలు చట్ట ప్రకారం శిక్షార్హమని ఆయన స్పష్టం చేశారు. అటువంటి చర్యలకు పాల్పడిన విద్యార్థులను విద్యాసంస్థల నుండి తొలగించడమే కాకుండా, క్రిమినల్ కేసులు నమోదు చేసి వారి ఉజ్వల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు.

**విద్యాసంస్థల యాజమాన్యానికి సూచనలు:**

ర్యాగింగ్ నియంత్రణ కోసం విద్యాసంస్థల యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సూచించారు. ప్రతి కళాశాలలో యాంటీ-ర్యాగింగ్ కమిటీలు, స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని, కొత్తగా వచ్చిన విద్యార్థులకు ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. అంతేకాకుండా, ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు, సెమినార్లను నిరంతరం నిర్వహించాలని, విద్యార్థుల ఫిర్యాదుల కోసం 24 గంటల హెల్ప్ లైన్ నెంబర్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

**విద్యార్థులకు విజ్ఞప్తి**

సహ విద్యార్థుల పట్ల ఎటువంటి వేధింపులకు, అసభ్య కార్యకలాపాలకు పాల్పడవద్దని పోలీస్ కమిషనర్ విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా ర్యాగింగ్‌కు గురైతే తక్షణమే ప్రిన్సిపాల్, యాజమాన్యం లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ర్యాగింగ్ విద్యార్థుల భవిష్యత్తును మాత్రమే కాకుండా సమాజంపైనా ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు. ర్యాగింగ్ సమాచారం అందించడానికి డయల్ 100 లేదా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్లు 8712670744, 8712670745కు కాల్ చేయవచ్చుని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని కమిషనర్ తెలిపారు. అందరి సహకారంతో ర్యాగింగ్ రహిత సమాజాన్ని నిర్మించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ర్యాగింగ్‌కు పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటాం

**ర్యాగింగ్ మన సంస్కృతి కాదు, ఇలాంటి విష సంస్కృతికి ఎవరూ పాల్పడవద్దు**

**తోటి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయొద్దు**

**ర్యాగింగ్ చేయడం నేరం, ర్యాగింగ్ లాంటి అసాంఘిక చర్యకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు**


**ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ చట్టం యాక్ట్ 1997 నుండి అమల్లోకి వచ్చింది**



పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ, ఐపీఎస్ మేడమ్ గారు విద్యాసంస్థల్లో ఎవరైన విద్యార్థులు ర్యాగింగ్ లాంటి వికృత చేష్టలకు పాల్పడే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ మేడమ్ హెచ్చరించారు. త్వరలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాబోవుతున్న తరుణంలో సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో ర్యాగింగ్ నియంత్రణపై సిద్దిపేట పోలీస్ కమిషనర్ మేడమ్ ఆదివారం ఓ ప్రకటన చేస్తూ విద్యా సంస్థలలో ర్యాగింగ్‌కు పాల్పడటం అనేది తీవ్రమైన నేరమంగా పరిగణించబడుతుందని. ఈ చర్యల ద్వారా విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలో పడే విధంగా వుంటుందని. ముఖ్యంగా సీనియర్ల ముసుగులో జూనియర్ విద్యార్థుల పట్ల అసాంఘిక కృత్యాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరిస్తూ విద్యాసంస్థల నుండి తొలగించడంతో పాటు ర్యాగింగ్ లాంటి చర్యలకు పాల్పడే విద్యార్థులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని. దీనితో ర్యాగింగ్ పాల్పడిన విద్యార్థుల విద్యా, ఉద్యోగ, భవిష్యత్తు అవకాశాలపై తీవ్ర ప్రభావం పడుతుందని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. అలాగే విద్యా సంస్థల్లో ర్యాగింగ్ నియంత్రణకై యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి వుంటుందని. ఇందులో భాగంగా ప్రతి ఉన్నత విద్యా సంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని, నూతనంగా వచ్చిన విద్యార్థుల కొసం ప్రత్యేక పరివేక్షణ వుండాలని. ముఖ్యంగా ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలతో పాటు సెమినార్లు, వర్క్‌షాపులు నిరంతరం నిర్వహించాలని. విద్యార్థులు ఫిర్యాదు చేసేందుకు గాను 24గంటల హైల్ప్‌లైన్ నంబర్లను విద్యాసంస్థల యాజమాన్యం అందుబాటులో వుంచాలని. విద్యార్థులు సహ విద్యార్థులపై ఎటువంటి వేధింపులు, దౌర్జన్యాలు, అసభ్య కార్యకలాపాలకు పాల్పడవద్దని. ఎవరైన ర్యాగింగ్‌కు గురైతే తక్షణమే ప్రిన్సిపాల్, యాజమాన్యం లేదా పోలీసులకు సమచారం అందించాలని. ర్యాగింగ్‌కు పాల్పడం ద్వారా విద్యా భవిష్యత్తు నాశనం అవుతుందని ప్రతి ఒక్క విద్యార్థి గుర్తుంచుకోవాలని పోలీస్ కమిషనర్ సూచిస్తూ. ర్యాగింగ్ అనేది విద్యార్థుల భవిష్యత్తును మాత్రమే కాకుండా సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని. కావున విద్యా సంస్థల యాజమాన్యం, అధ్యాపకులు, విధ్యార్థులు పోలీసులు కలిసి పనిచేసిప్పుడే ర్యాగింగ్ సంస్కృతిని పూర్తిగా నిర్మూలించగలుతామని పోలీస్ కమిషనర్ మేడమ్ తెలియజేసారు. విద్యార్థిని విద్యార్థిని ఎవరైనా అవహేళన చేసిన అవమానంగా మాట్లాడిన ర్యాగింగ్ చేసిన వెంటనే డయల్ 100, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712667100 సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు.

### సభను విజయవంతము చేసిన నాయకులకు కార్యకర్తలకు ధన్యవాదాలు

**శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లిలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గం సమావేశంను విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ సీనియర్ నేత రవీందర్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. సభలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన సూచనలు ప్రతి ఒక్కరు పాటించాలి అన్నారు.ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుంది అన్నారు.ఇదే స్ఫూర్తితో రానున్న ఎన్నికల్లో పని చేయాలి అన్నారు. కెసిఆర్ చేసిన అభివృద్ధి తప్పితే కాంగ్రెస్ పార్టీ చేసింది ఏమి లేదు అన్నారు.శేరిలింగంపల్లిలో మొదటి నుంచి పార్టీ కోసం పని చేసే వారికి రానున్న రోజుల్లో మంచి అవకాశాలు ఉంటాయి అన్నారు. కార్యకర్తలు పార్టీకి బలం అని కేటీఆర్ చెప్పారని, అదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరు పని చేయాలి అన్నారు. సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలోని అన్నీ డివిజన్ ల నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు అని హర్షము వ్యక్తం చేశారు.శేరిలింగంపల్లిలో బీ ఆర్ ఎస్ పార్టీ బలంగా ఉంది అన్నారు. రానున్న ఎన్నికల్లో బీ ఆర్ ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుంది అని రవీందర్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు





### భార్యపై మారణాయుధంతో దాడి చేసిన భర్త

**తీవ్ర రక్తస్రావంతో అపస్మారక స్థితిలోకి బాధితురాలు**

**హుటాహుటిన ఆసుపత్రికి తరలించిన స్థానికులు**

**సంఘటన స్థలానికి చేరుకునీ విచారణ నిర్వహించిన ఎస్సై లక్ష్మీ భార్గవి**



కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యపై ఆగ్రహానికి గురైన భర్త మారణాయుధంతో ఆమెపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన మండల పరిధిలోని మాటూరు గ్రామం బీసీ కాలనీలో జరిగింది. శనివారం అర్ధరాత్రి జరిగినట్లుగా తెలుస్తున్న ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చిల్లసూర్యనారాయణ ప్రైవేట్ లారీ డ్రైవర్ గా పనిచేస్తూ జీవన సాగిస్తున్నారు. అరకొర ఆర్థిక సమస్యలు కుటుంబ భారంతో భార్యాభర్తల మధ్య నెలకొన్న మనస్పర్థలు నేపథ్యంలో శనివారం డ్రైవర్ విధులకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన భర్త సూర్యనారాయణ(32) భార్య సాయి నాగలక్ష్మి(26) తో చిన్న సమస్యపై ఘర్షణపడ్డారు. ఈ క్రమంలో తీవ్ర ఆగ్రహానికి గురైన సూర్యనారాయణ అందుబాటులో ఉన్న మారణాయుదంగా ఉన్నట్లుగా గుర్తించిన వస్తువుతో భార్యపై దాడికి దిగినట్లు, ఈ దాడిలో నాగలక్ష్మి మెడపై బలమైన ఘాట్లు పడి రక్తస్రావం కావడంతో బాధితురాలు కేకలు వేసుకుంటూ ఇంట్లో నుండి రోడ్డుపైకి వచ్చి కింద పడిపోవడంతో బయటికి వచ్చిన స్థానికులు 108 అంబులెన్స్ సహాయంతో ఆమెను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. నాగలక్ష్మి మెడపై బలమైన గాయం తో తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సంఘటన జరిగిన సమాచారాన్ని తెలుసుకున్న మధిర రూరల్ ఎస్సై లక్ష్మీ భార్గవి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని విచారణ నిర్వహించారు. స్థానికులతో ఆదివారం ఉదయం మరోసారి పరిశీలన సందర్భంగా విచారణ నిర్వహించిన ఆమె నిందితునిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సూర్యనారాయణ దంపతులకు ఇద్దరు మగ పిల్లలు ఉండగా ప్రస్తుతం నాగలక్ష్మి గర్భవతిగా ఉన్నట్లు సమాచారం. బాధితురాలు అమాయకురాలు గా అణుకువగా ఉంటుందని, సూర్యనారాయణ ఆమెపై గతంలో కూడా దాడి చేసి కొట్టినట్లు నమోదైన కేసు పోలీస్ రికార్డుల్లో ఉన్నట్లు ఈ సంఘటన అనంతరం గ్రామంలో పలు విధాలుగా చర్చించుకోవడం గమనార్హం.

### అమ్మాయి కోసం గొడవ..!

### కత్తులు, కొడవళ్ళతో యువకులు హల్చల్..



మహహబూబాబాద్ పట్టణంలో యువకులు కత్తులు, కొడవళ్ళతో హల్చల్ చేశారు. అమ్మాయి కోసం ఇద్దరు యువకుల మధ్య మొదలైన గొడవ కత్తులు, కొడవళ్ళతో దాడికి దిగేవరకు వెళ్ళింది. ఆదివారం ( ఆగస్టు 24 ) జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని బయ్యారం మండలానికి చెందిన ఒక వర్గం యువకులు మహబూబాబాద్ పట్టణానికి చెందిన మరో వర్గం యువకులపై కత్తులతో దాడికి పాల్పడ్డారు.ప్రియురాలి కోసం ఇద్దరు యువకుల మధ్య మొదలైన గొడవ కత్తులతో దాడికి దిగే స్థాయికి వెళ్ళింది. ఇరువర్గాల యువకులు ఒకరిపై ఒకరు కత్తులతో దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో స్థానికులు అడ్డుకోవడంతో ఒక వర్గం యువకులు కారులోనే కత్తులు వదిలేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు స్థానికులు. స్థానికుల సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు. పరారీలో ఉన్న బ్యాచ్ కోసం గాలిస్తున్నారు పోలీసులు. యువకుల మధ్య ఘర్షణకు కారణమైన అమ్మాయి ఎవరు?, గొడవకు గల కారణాలేంటి వంటి వివరాలపై ఆరా తీస్తున్నారు పోలీసులు.


### రక్తదానం చేయండి ప్రాణదాతలుకండి

**పోచారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బాల్ రెడ్డి**

**ఘట్‌కేసర్ :** బ్రహ్మకుమారి సోషల్ సర్వీసింగ్ యూనివర్సల్ బ్రదర్ హుడ్ డే విశ్వ సౌభ్రాతృత్వ దినోత్సవం సెకండ్ చీఫ్ అడ్మినిస్ట్రేషన్ హెడ్ దాది ప్రకాష్ మని స్మృతి ద్వితీయ సంవత్సరం సందర్భంగా పోచారం మున్సిపాలిటీ టౌన్షిప్ బ్లాక్ ఏ, బి 10 ఫ్లాట్ లో నిర్వహించారు, లైన్స్ క్లబ్ మరియు ఆదిత్య హాస్పిటల్ బ్లడ్ సెంటర్ వారి సౌజన్యంతో ఈ క్యాంపు నిర్వహించారు, ఈ సందర్భంగా మెట్టు బాల్ రెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేసి మనిషి ఆరోగ్యాన్ని కాపాడిన వాళ్లు అవుతారని, ఈ క్యాంపు ఉదయం 10 గంటలనుండి సాయంత్రం ఏడు గంటలకు నిర్వహించబడుతుందన్నారు, ఇప్పటివరకు దాదాపు వంద మంది పైగా రక్తదానంలో పాల్గొంటారని అనుకుంటున్నామన్నారు, రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాన్ని కాపాడవచ్చుని, ఒక వ్యక్తి రక్తాన్ని ఎన్నిసార్లు అయినా దానం చేయొచ్చన్నారు, మీ దాతృత్వం మరొకరి జీవితంలో సరికొత్త ఆశను చిగురింపజేస్తుంది. సాటి మనిషి ప్రాణాలు కాపాడటంలో రక్తదానానికి మించిన దానం లేదు. రక్తదానం చేసి ప్రాణదాతలు కండి అన్నారు,ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డాక్టర్లు డాక్టర్ కమల డాక్టర్ విజయకుమార్ వారి బృందం మరియు ఆదిత్య హాస్పిటల్ బ్లడ్ సెంటర్ మెట్టు బాల్ రెడ్డి దంపతులు ఈ శిబిరంలో పాల్గొన్నా రు, అనంతరం నూతనంగా పదవి భాద్యతలు చేపట్టిన మున్సిపల్ కమీషనర్ ను కలిసి శాలువాతో సన్మానించారు,

### ఉచితంగా మట్టి వినాయకులు పంపిణీ చేసిన మిరియాల ప్రీతం

**టిపిసిసి జనరల్ సెక్రటరీ శేరిలింగంపల్లి ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్,మిరియాల ప్రీతం ఆధ్వర్యంలో నిర్వహణ**



**శేరిలింగంపల్లి :** వినాయక చవితి పర్వదినాన పురస్కరించుకుని మిరియాల రాఘవ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ మిరియాల ప్రీతం ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ ప్రశంసనీయం అని జగదీశ్వర్ గౌడ్ అన్నారు.మిరియాల ప్రీతం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సుమారు 3 వేల మట్టి వినాయకులు ఉచితంగా పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం టిపిసిసి జనరల్ సెక్రటరీ శేరిలింగంపల్లి ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్,రంగారెడ్డి డిసిసి వైస్ ప్రెసిడెంట్ విజయ భాస్కర్, గిరి కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ... మిరియాల ప్రీతం తమ ట్రస్ట్ ద్వారా ప్రతి సంవత్సరం మట్టి వినాయకులు పంపిణీ కార్యక్రమం చాలా అద్భుతంగా నిర్వహిస్తారు.మట్టి వినాయకులు పూజించడం ద్వారా పర్యవరానికి ఎంతో మేలు చేసిన వాళ్ళు అవుతామని భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండడానికి కాలుష్య రహిత సమాజాన్ని ఏర్పాటు చేసే బాధ్యత మనందరికీ ఉందని ఆయన పేర్కొన్నారు

# జీవితంలో సక్సెస్ సాధించాలనే తపన మీకూ ఉందా?

జీవితంలో



విజయం సాధించాలని అందరూ కోరుకుంటారు. కానీ కొందరికే ఇది సాధ్యమవుతుంది. విజయం అంత తేలికగా ఎవరికీ దక్కదు. ఇందుకోసం స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవడం, సానుకూల దృక్పథం కలిగి ఉండటం, స్వీయక్రమశిక్షణ, కృషిని పెంపొందించుకోవడం చాలా ముఖ్యం.అదేవిధంగా విజయం కోసం పరితపించేవాళ్లు ప్రతి ఉదయం కొన్ని అలవాట్లను అనుసరించాలి. ఎందుకంటే ఉదయం అలవాట్లు మొత్తం రోజును ప్రభావితం చేస్తాయి. ఉదయం సరైన మార్గంలో ప్రారంభిస్తే మన శక్తిసామర్థ్యాలు, మానసిక స్థితి మెరుగుపడుతాయి. మీరూ జీవితంలో విజయం సాధించాలనుకుంటున్నారా? అయితే మీరూ ఈ అలవాట్లను కొనసాగించండి..

విజయవంతమైన వ్యక్తులు ఎల్లప్పుడూ ఉదయాన్నే నిద్రలేస్తారు. ఇలాంటి వారు సాధారణంగా ఉదయం 4:30 నుంచి 6:00 గంటల మధ్య నిద్రలేచి తమ రోజును ప్రారంభిస్తారు. ఇలా ఉదయాన్నే నిద్రలేవడం వల్ల రోజంతా అప్రమత్తంగా ఉంటారు. జడత్వం అనేదే వీరిలో ఉండదు. విజయవంతమైన వ్యక్తులు తమ ఉదయాలను ప్రశాంతంగా గడుపుతారు. వీరు ప్రతి ఉదయం ధ్యానం, శ్వాస వ్యాయామాలను అభ్యసిస్తారు. తద్వారా వారి మనస్సును కేంద్రీకరించి సానుకూలంగా మార్చుకుంటారు. ఈ అలవాటు వారి మనస్సును ప్రశాంతంగా ఉంచుతుంది. రోజంతా దృష్టి కేంద్రీకరించడంలో సహాయపడుతుంది. విజయవంతమైన వ్యక్తులు ఎల్లప్పుడూ చాలా చురుకుగా ఉంటారు. ఎందుకంటే వీరు ఉదయాన్నే నిద్రలేచి యోగా, తేలికపాటి వ్యాయామం వంటి శారీరక శ్రమ చేస్తుంటారు. తద్వారా శరీరాన్ని తాజాగా ఉంచుకోవచ్చు. ఇది రోజంతా చురుకుగా ఉండటానికి సహాయపడుతుంది. విజయవంతమైన వ్యక్తులు ఆరోగ్యకరమైన ఆహారం మాత్రమే తింటారు. వారు ఉదయం పండ్లు, పెరుగు, ఓట్స్, గింజలు వంటి ఆరోగ్యకరమైన, పోషకమైన ఆహారాన్ని తింటారు. ఇది సరైన పోషకాహారాన్ని అందిస్తుంది. రోజంతా మరింత సమర్థవంతంగా పనిచేయడానికి సహాయపడుతుంది. విజయవంతమైన వ్యక్తులు ఎల్లప్పుడూ ఉదయం పూట తమ రోజంతా లక్ష్యాలను నిర్దేశించుకుంటారు. వారు ముందుగా ఏ పనులు చేయాలో, మరింత ఉన్నతంగా ఎదగడానికి ఏ ప్రణాళికలు వేయాలో లక్ష్యాలను నిర్దేశిస్తారు. మీరు కూడా అదే విధంగా లక్ష్యాలను నిర్దేశించుకోవడం ద్వారా దశలవారీగా విజయ శిఖరాలను అధిరోహించవచ్చు. సానుకూల ఆలోచనలు విజయానికి మార్గం సుగమం చేస్తాయి. విజయవంతమైన వ్యక్తులు ప్రతి ఉదయం తమను తాము ప్రేరేపించుకుంటూ, సానుకూలంగా ఆలోచిస్తూ గడుపుతారు. ఇది వారిని రోజంతా ఉత్సాహంగా ఉంచుతుంది. మీరు కూడా మీ రోజును ఇలా సానుకూలంగా ప్రారంభించవచ్చు. సక్సెస్‌ఫుల్ వ్యక్తులు తమ సమయంలో ఒక్క సెకను కూడా వృధా చేయరు. వీరు తమ సమయాన్ని చక్కగా నిర్వహిస్తారు. సమయం వృధా కాకుండా ఉండటానికి రోజులో ముందుగా ఏ పనులు చేయాలో వారు ముందుగానే నిర్ణయించుకుంటారు. మీరు కూడా ఇదే విధంగా సమయ నిర్వహణ పాఠాన్ని నేర్చుకోవాలి.

# ఈ ఒక్క చిట్కాతో నిగారించే చర్మం మీ సొంతం!



మీరు ఏమి చేసినా, మన చర్మాన్ని జాగ్రత్తగా చూసుకోవడానికి మన ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవాలి. ఈ మార్పులు ఖచ్చితంగా మన చర్మంపై ప్రభావాన్ని చూపుతాయి. ప్రజెంట్ డేస్‌లో చాలా మంది ఎదుర్కొనే సాధారణ సమస్య నిస్తేజమైన చర్మం. దీని నుంచి బయటపడి మంచి నిగారించే చర్మాన్ని పొందాలని చాలా మంది అనుకుంటారు. అందుకోసం ఏవేవో ప్రయత్నాలు చేసి విఫలం అయి ఉంటారు. కానీ మన ఇంటి పరిసరాల్లో లభించే సహజమైన పుదీనా, నిమ్మరసంతో మన చర్మాన్ని మెరిసేలా చేసుకోవచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఈ రెండింటిని కలిపి రసం తయారు చేసుకుని త్రాగడం వల్ల. కొద్ది రోజుల్లోనే మన చర్మం నిగారింపుగా మారుతుందని చెబుతున్నాయి. పుదీనా, నిమ్మరసం మీ చర్మ ఆరోగ్యాన్ని పెంచడానికి సహాయపడుతాయి. చర్మ సమస్యలకే కాదు.. వేసవి వేడి నుండి ఉపశమనం పొందడానికి కూడా ఈ రసం గొప్ప మార్గం. వీటిలో ఉండే పోషకాలు మీరు కోరుకునే మెరిసే చర్మాన్ని అందించడంలో సహాయపడతాయి. మొటిమలు ఉన్నవారికి పుదీనా చాలా మంచిది. పుదీనా ఆకులు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను, సాలిసిలిక్ ఆమ్లాన్ని కూడా కలిగి ఉంటాయి. కాబట్టి మీ ఆహారంలో పుదీనాను చేర్చుకోవడం ద్వారా, మీ చర్మం బిగుతగా మారడంతో పాలు సహజమైన మెరుపును పొందుతుంది. పుదీనా రసం తాగడమే కాకుండా, మీరు పుదీనాను నేరుగా మీ చర్మానికి మాస్క్ రూపంలో కూడా అప్లై చేయవచ్చు. నిమ్మకాయలో మనకు విటమిన్ సి పుష్కలంగా దొరుకుతుంది. ఇది మీ చర్మ ఆరోగ్యానికి అత్యంత అవసరమైన విటమిన్లలో ఒకటి. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (%చీ×ు%) ప్రకారం, నిమ్మకాయలలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వాటిలో సిట్రిక్ యాసిడ్ కూడా ఉంటుంది. ఇది చనిపోయిన చర్మ కణాలను తొలగించడంలో సహాయపడుతుంది. బ్లాక్ హెడ్స్, మొటిమల వంటి చర్మ సమస్యలను వదిలించుకోవడానికి నిమ్మరసం చాలా మంచిది. పుదీనా, నిమ్మరసం రసాన్ని మీరు ఇంట్లోనే ఈజీగా తయారు చేసుకోవచ్చు. మీరు ఇంట్లో తయారు చేసుకోగల సులభమైన జ్యూస్‌లలో ఇది కూడా ఒకటి. దీన్ని తయారు చేయడానికి, ముందుగా మీరు పుదీనా ఆకులు, ఉప్పు, నిమ్మరసం, తేనె, సోంపు గింజలను బ్లెండర్‌లో కొద్దిగా నీటితో రుబ్బుకోవాలి. తరువాత ఐస్ క్యూబ్స్, దోసకాయ ముక్కలు, తులసి ఆకులు ఒక గ్లాసులో వేసుకోవాలి. తయారుచేసిన మిశ్రమాన్ని గ్లాసులో పోసి బాగా కలపండి. ఇప్పుడు మీరు ఈ రుచికరమైన రసాన్ని తాగవచ్చు. ఇలా చేయడం ద్వారా కొన్ని రోజుల్లోనే మీ చర్మం నిగారింపుగా మారుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

# బ్యూటీ పార్లర్లకు వెళ్లే మహిళలు జాగ్రత్త..!



ప్రస్తుత రోజుల్లో చాలా మంది అందంగా కనిపించేందుకు ఆరాటపడుతున్నారు. అందంకోసం రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. కొంత మంది తమ జుట్టు, ముఖ సౌందర్యం, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సెలూన్, బ్యూటీ పార్లర్లకు వెళతారు. అలా తరచూగా బ్యూటీ పార్లర్లలో షాంపూ చేయించుకునే వారికి ఇదోక హెచ్చరిక..ఇప్పుడు 'బ్యూటీ పార్లర్ స్ట్రోక్ సింద్రోమ్' అనే కొత్త సమస్య ప్రజల్ని భయపెడుతోంది. ఇది మీ మెడ, వీపుపై ఒత్తిడి వల్ల కలిగే తీవ్రమైన ఆరోగ్య సమస్య. చాలా సెలూన్లలో షేవింగ్ చేసిన తర్వాత, లేదంటే హెయిర్ కలర్ వేయించున్న తరువాత అక్కడే హెయిర్ వాష్ చేయించుకుంటారు. ఇందులో వాషింగ్ కోసం ఉపయోగించే బ్యాక్ వాష్ బేసిన్లపై వాలతాము. ఇది మన మెడలను ఇబ్బందికరమైన కోణంలో కుదిస్తుంది. ఇది మెడ నొప్పి, గాయం, చాలా అరుదైన సందర్భాల్లో ప్రాణాంతక స్ట్రోక్‌లకు దారితీస్తుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. బ్యూటీ పార్లర్ స్ట్రోక్ సింద్రోమ్‌ను మొదట 1993లో అమెరికన్ న్యూరాలజిస్ట్ మైఖేల్ విన్ట్రాబ్ గుర్తించారు. ఈ సమస్యతో బాధపడే ముందు బ్యూటీ పార్లర్‌లో జుట్టును షాంపూతో శుభ్రం చేసుకున్న రోగులకు తీవ్రమైన స్ట్రోక్‌కు సంబంధించిన లక్షణాలు కనిపిస్తాయని ఆయన కనుగొన్నారు. స్ట్రోక్ అంటే మెదడుకు రక్త ప్రసరణలో అకస్మాత్తుగా అంతరాయం ఏర్పడటం వల్ల కలిగే మెదడు దాడి. ఇది సాధారణంగా రక్తం గడ్డకట్టడం వల్ల వస్తుంది. ఈ సందర్భంలో, ఆక్సిజన్, గ్లూకోజ్, పోషకాలు లేకపోవడం వల్ల మెదడు కణాలు దెబ్బతింటాయి. బ్యూటీ పార్లర్ స్ట్రోక్ సింద్రోమ్‌కు ప్రాథమిక కారణం కస్టమర్ తలకు షాంపూతో శుభ్రం చేస్తున్నప్పుడు వాష్‌బేసిన్ అంచున అధిక ఒత్తిడి అని పరిశోధనలు సూచిస్తున్నాయి. బ్యూటీ పార్లర్ స్ట్రోక్ సింద్రోమ్ నివారించడానికి ఏం చేయాలి.? : బ్యూటీ పార్లర్ స్ట్రోక్ సింద్రోమ్‌ను నివారించడానికి, బ్యాక్‌వాష్ సింక్‌ను ఉపయోగిస్తున్నప్పుడు మీకు నొప్పి, అసౌకర్యం ఎదురైతే, వెంటనే లేచి మీ మెడకు విశ్రాంతి ఇవ్వండి. లేకపోతే, కొంత వ్యాయామం కోసం మీ మెడను కుడి, ఎడమ వైపుకు తిప్పడానికి ప్రయత్నించండి. మీరు మీ జుట్టును కడుక్కోవాల్సిన అవసరం ఉంటే, ఒత్తిడిని తగ్గించడానికి మీ మెడ కింద ఒక టవల్ పెట్టుకోండి. ఇది ఒత్తిడిని తగ్గిస్తుంది.

# గర్భిణీలలో కాల్షియం లోపిస్తే.. ఆ సమస్యలను ఆహ్వానించినట్టే..



ప్రతీ మహిళ జీవితంలో గర్భం దాల్చడం అనేది ఒక కీలక ఘట్టం. మరో జీవికి జన్మనిస్తున్నాన్న సంతోషం ఓవైపు, ఏదో తెలియని భయం మరోవైపు. మహిళల్లో మానసిక ఇబ్బందులకు దారి తీస్తుంటాయి. అందుకు గర్భిణీలుగా ఉన్న సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని చెబుతుంటారు. ముఖ్యంగా తీసుకునే ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. తల్లితో పోటు కడుపులో బిడ్డకు కూడా అవసరమైన పోషకాలు అందేలా ఫుడ్ తీసుకోవాలని సూచిస్తుంటారు. గర్భం దాల్చిన సమయంలో మహిళల శరీరంలో విటమిన్స్ లోపం అస్సలు ఉండకూడదు. ముఖ్యంగా క్యాల్షియం లోపం ఉన్నట్లయితే ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని నిపుణులు చెబుతున్నారు. గర్భధారణ సమయంలో కాల్షియం శరీరంలో కీలక పాత్ర పోషిస్తుందని అంటున్నారు. కాల్షియం ఎముకలు, దంతాలను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. గర్భధారణ సమయంలో శిశువు ఎముకలు, దంతాలు వేగంగా అభివృద్ధి చెందుతాయి. ఇందుకు కాల్షియం ఎంతో అవసరం. శిశువుకు కాల్షియం తల్లి శరీరం నుంచి లభిస్తుంది. తల్లి శరీరంలో కాల్షియం లోపం ఉంటే పుట్టబోయే బిడ్డపై ప్రభావం పడుతుంది. అంతేకాకుండా గర్భిణీలోనూ ఎముకలు బలహీనంగా మారుతాయి. భవిష్యత్తులో బోలు ఎముకల వ్యాధి వంటి వ్యాధుల ప్రమాదం పెరుగుతుంది. ఇక పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై కూడా కాల్షియం లోపం తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. శిశువు ఎముకలు సరిగ్గా అభివృద్ధి చెందవు. ఇది పుట్టిన తరువాత శిశువులో బలహీనతకు దారితీస్తుంది. అలాగే శిశువు గుండె, కండరాలతో పాటు నరాల అభివృద్ధిపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. బిడ్డ కడుపులో తగినంత కాల్షియం పొందకపోతే.. అది భవిష్యత్తులో చిన్నారుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. గర్భధారణ సమయంలో స్త్రీలకు రోజుకు 1000 నుంచి 1200 %ఎమ్% కాల్షియం అవసరం ఉంటుంది. ఇది పాలు, పెరుగు, జున్ను, ఆకుకూరలు, నువ్వులు, బాదం వంటి ఆహార పదార్థాల ద్వారా లభిస్తుంది. అయితే నువ్వులు వేడి చేసే అవకాశం కూడా ఉంటుంది. కాల్షియం లోపం ఉంటే వైద్యుడి సూచన మేరకు కాల్షియం సప్లిమెంట్స్‌ను తీసుకోవచ్చు.

# బాడీలో ఈ లక్షణాలు కనిపిస్తే.. కొలెస్ట్రాల్ పెరిగినట్లే..?

కొలెస్ట్రాల్ స్థాయి పెరిగినప్పుడు, మొదటగా కనిపించే లక్షణం కాళ్ళలో నొప్పి లేదా తిమ్మిరి. నడుస్తున్నప్పుడు లేదా విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు కాళ్ళలో బరువు లేదా తిమ్మిరి ద్వారా దీనిని గుర్తించవచ్చు. చేతులు మరియు కాళ్ళలో తిమ్మిరి, జలదరింపు లేదా చల్లగా అనిపించడం కూడా అధిక కొలెస్ట్రాల్ లక్షణాలు. కొంతమందిలో, పాదాల రంగు కూడా నీలం రంగులో కనిపించడం ప్రారంభమవుతుంది.ఛాతీలో నొప్పి లేదా ఒత్తిడి కూడా పెరిగిన కొలెస్ట్రాల్ ప్రధాన లక్షణం. వాస్తవానికి, కొలెస్ట్రాల్ ధమనులలో పేరుకుపోయినప్పుడు, ఛాతీలో మంట లేదా బిగుతుగా అనిపించడం జరుగుతుంది. ఇది గుండెపోటు లేదా కరోనరీ ఆర్టరీ వ్యాధికి సంకేతం కావచ్చు.మెడ, దవడ లేదా భుజంలో నొప్పి కూడా దీనికి సంకేతం కావచ్చు. శరీరంలో రక్త ప్రవాహం తగ్గినప్పుడు, ఈ భాగాలలో అసాధారణ నొప్పి లేదా దృఢత్వం అనుభూతి కలుగుతుంది. దీనిని ప్రజలు తరచుగా కండరాల నొప్పిగా భావించి విస్మరిస్తారు. తల బరువుగా అనిపించడం లేదా తల తిరుగుతున్నట్లు అనిపించడం కూడా కొలెస్ట్రాల్ పెరిగినట్లు సూచిస్తుంది. మెట్లు ఎక్కేటప్పుడు ఊపిరి ఆడకపోవడం లేదా త్వరగా అలసిపోవడం వంటివి కూడా విస్మరించకూడదు.పసుపు రంగు లేదా కళ్ళ చుట్టూ పసుపు వలయాలు ఏర్పడటం కూడా దాని లక్షణాలు కావచ్చు. ఇది శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయి క్షీణిస్తోందనడానికి సంకేతం.మీ శరీరంలో ఇలాంటి మార్పులు గమనించినట్లయితే, వెంటనే మీ వైద్యుడిని సంప్రదించండి. సకాలంలో రోగ నిర్ధారణ, చికిత్స ఈ పరిస్థితి తీవ్రంగా మారకుండా నిరోధించవచ్చు. తల బరువుగా అనిపించడం లేదా తల తిరుగుతున్నట్లు అనిపించడం కూడా కొలెస్ట్రాల్ పెరిగినట్లు సూచిస్తుంది. మెట్లు ఎక్కేటప్పుడు ఊపిరి ఆడకపోవడం లేదా త్వరగా అలసిపోవడం వంటివి కూడా విస్మరించకూడదు.

బిజినెస్ వాయిస్

## మొరాయించిన ఎయిర్‌టెల్ సేవలు..
## కంపెనీపై యూజర్ల ఆగ్రహం..!

భారతీ ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ మరోసారి మొరాయించింది. ఈ సారి బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్ సహా పలు కీలక నగరాల్లో ప్రభావం కనిపించింది. ఈ నెల 8న ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలో ఎయిర్‌టెల్, జియో నెట్‌వర్క్ నిలిచిపోయిన విషయం తెలిసిందే. దాంతో కాల్స్, ఎస్ఎంఎస్, ఇంటర్‌నెట్ సేవలు స్తంభించాయి. డౌన్‌డెటెక్టర్ నుంచి వచ్చిన డేటా ప్రకారం.. మధ్యాహ్నం 12:15 గంటల ప్రాంతంలో ఫిర్యాదులు వచ్చాయి. 7,100 మందికి పైగా వినియోగదారులు ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ పనిచేయడం లేదని పేర్కొన్నారు. ఎయిర్‌టెల్ కస్టమర్ సపోర్ట్ హ్యాండిల్ ఎయిర్‌టెల్ కేర్స్ 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. 'తాత్కాలిక కనెక్టివిటీ సమస్య'గా పేర్కొంది. సమస్యను గంటలోగా పరిష్కారమవుతుందని పేర్కొంది. యూజర్లు తమ మొబైల్స్‌ను రీ స్టార్ట్ చేయాలని కంపెనీ సూచించింది. ఎయిర్ ట్వీట్‌లో 'ఈ అసౌకర్యానికి మమ్మల్ని క్షమించండి. ఈ సమస్య తాత్కాలిక కనెక్టివిటీ అంతరాయం కారణంగా జరుగుతుంది. దాదాపు ఒక గంటలో పరిష్కారమవుతుంది. మీ మొబైల్‌ను ఒకసారి రీస్టార్ట్ చేయండి' అని పేర్కొంది. నెట్‌వర్క్‌లో అంతరాయంపై సోషల్ మీడియా వేదికగా యూజర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఈ రోజు బెంగళూరులో ఎయిర్‌టెల్ ఇంటర్‌నెట్ నిలిచిపోయింది. కంపెనీ వినియోగదారులకు ముందుగానే తెలియజేయకూడదా?' అంటూ ఓ యూజర్ ప్రశ్నించాడు. మరొక యూజర్ 'గత 6 గంటలుగా ఎయిర్‌టెల్ పోస్ట్‌పెయిడ్ సేవలు నిలిచిపోయాయి. కాల్స్ రావడం లేదు. ఇంటర్నెట్ కూడా స్తంభించింది. కస్టమర్ కేర్ నుంచి కూడా స్పందన లేదు. దీనిపై %ట=ూ×% చర్య తీసుకోవాలి' అంటూ డిమాండ్ చేశాడు.

## అనిల్ అంబానీకి పెరుగుతున్న కష్టాలు..!
# ఫ్రాడ్‌గా ప్రకటించిన బ్యాంక్ ఆఫ్ ఇండియా!

పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి కష్టాలు పెరుగుతున్నాయి. దివాళా తీసిన రియలన్స్ కమ్యూనికేషన్ అకౌంట్లను ఎస్‌బీఐ బ్యాంక్ ఫ్రాడ్‌గా ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా బ్యాంక్ ఆఫ్ ఇండియా సైతం కంపెనీ అకౌంట్స్ మోసపూరితమని ప్రకటించింది. ఇందులో మాజీ డైరెక్టర్, పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ పేరు సైతం ఈ కేసులో చేర్చింది. రెగ్యులేటరీ ఫైలింగ్స్ ప్రకారం.. బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా ఈ రుణ ఖాతాను మోసపూరితంగా ప్రకటించింది. 2016లో నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపించింది. ప్రభుత్వ యాజమాన్యంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆగస్టు 2016లో రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు మూలధనం, నిర్వహణ వ్యయాన్ని అవసరాలను తీర్చడానికి రూ.700 కోట్ల రుణాన్ని మంజూరు చేసింది. ఆర్‌కామ్, రిలయన్స్ టెలికామ్, అంబానీ అకౌంట్లను ఫ్రాడ్ అకౌంట్లుగా నిర్ధారించింది. మంజూరు చేసిన రుణాలను ఇతర మార్గాలకు మళ్లించడం, నిబంధనలు పాటించలేదని పేర్కొంది. ఈ కంపెనీతో సంబంధాలు ఉన్న కొంత మందికి నోటీసులు పంపించినట్లు చెప్పింది. ఈ మేరకు ఆగస్టు 22, 2025 రోజున ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో రిలయన్స్ కమ్యూనికేషన్స్ వెల్లడించింది. ఆగస్టు 8వ తేదీన తమకు నోటీసులు అందినట్లు తెలిపింది. నోటీసుల ప్రకారం.. రూ.724.78 కోట్ల రుణాలకు సంబంధించి రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ లోన్ అకౌంట్లు, అనిల్ ధీరూభాయ్ అంబానీ, మంజారి ఆశిష్ కాకెర్‌లను ఫ్రాడ్‌గా పేర్కొంది. 2017, జూన్ 30 నాటికే నిరర్థక ఆస్తులుగా నిర్ణయం తీసుకున్నారని.. ఈ విషయంపై రుణ గ్రహీతలు, గ్యారెంటీ ఇచ్చిన వారికి సమాచారం అందిస్తూ వచ్చామని.. అయినప్పటికీ ఆ విషయాన్ని వారు పట్టించుకోలేదని పేర్కొంది. ఇదిలా




ఉండగా.. ఈ ఏడాది జూన్‌లో ఎస్‌బీఐ సైతం అకౌంట్లను మోసపూరితమని ప్రకటించిన విషయం తెలిసిందే. రుణాల నిబంధనలు ఉల్లంఘించడం ద్వారా బ్యాంకు నిధులను దుర్వినియోగం చేసినట్లుగా ఆరోపణలు వచ్చాయి. ఎస్‌బీఐ ఫిర్యాదు మేరకు సీబీఐ శనివారం రిలయన్స్ కమ్యూనికేషన్, అంబానీ నివాసానికి సంబంధించిన ప్రాంగణాల్లో సోదాలు నిర్వహించింది. ఆసియాలోనే ధనవంతుడైన ముకేశ్ అంబానీ తమ్ముడైన అనిల్ అంబానీపై ఎస్‌బీఐని మోసం చేశారన్న ఫిర్యాదు అందిందని పేర్కొంది. అనిల్ అంబానీ ప్రతినిధి వివరణ ఆరోపణలను ఖండించారు. ఎస్‌బీఐ దాఖలు చేసిన ఫిర్యాదు పది సంవత్సరాల కంటే పాత విషయాలకు సంబంధించిందని.. ఆ సమయంలో అంబానీ కంపెనీకి నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నారని.. కంపెనీ రోజువారీ నిర్వహణలో ఎలాంటి పాత్రలేదని పేర్కొన్నారు. అయితే, రిలయన్స్ కమ్యూనికేషన్స్ కంపెనీకి ఎస్‌బీఐ రూ. 2,227.64 కోట్లు రుణాలు ఇచ్చింది. 2016 ఆగస్టు 26 నుంచి వడ్డీ, ఖర్చులు అదనం కాగా.. రూ.786.52 కోట్ల బ్యాంక్ గ్యారెంటీ సైతం ఉన్నది. ఈ క్రమంలో ఆ కంపెనీని, ప్రమోటర్ అనిల్ అంబానీ అకౌంట్లను ఫ్రాడ్‌గా ఎస్‌బీఐ ప్రకటించింది.

# ఆన్‌లైన్ గేమింగ్ నుంచి ఆర్థిక సేవల వైపు.. డ్రీమ్11 కొత్త బిజినెస్

దేశంలో ఆన్‌లైన్ మనీ ఆధారిత గేమింగ్‌పై నిషేధం పడింది. దీంతో అనేక గేమింగ్ సంస్థలు కొత్త మార్గాలను వెతుకుతున్నాయి. ఈ క్రమంలోనే డ్రీమ్11 ఇప్పుడు కొత్త బిజినెస్ ప్రారంభించేందుకు సిద్ధమైంది. చాలా మందికి డ్రీమ్11 ఫాంటసీ స్పోర్ట్స్ ప్లాట్‌ఫామ్ గురించి తెలిసే ఉంటుంది. ఇప్పుడు ఈ సంస్థ కొత్త రంగంలోకి అడుగుపెడుతోంది. ఎందుకంటే ఆన్‌లైన్ గేమింగ్‌పై ప్రభుత్వం నిషేధం విధించిన తర్వాత, డ్రీమ్11 మాతృ సంస్థ డ్రీమ్ స్పోర్ట్స్ ఇప్పుడు ఆర్థిక సేవల రంగంలోకి ఎంట్రీ ఇవ్వడానికి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో డ్రీమ్ మనీ పేరుతో కొత్త యాప్‌తో వచ్చేస్తోంది.

**కొత్త ప్రయాణం**

డ్రీమ్ 11 స్పోర్ట్స్ భారతదేశంలో మనీ ఆధారిత ఆన్‌లైన్ గేమ్‌లలో కీలకంగా ఉండేది. కానీ, ప్రభుత్వం డబ్బు ఆధారిత ఆన్‌లైన్ గేమ్‌లపై నిషేధం విధించడంతో, వాళ్లు ఆ గేమ్‌లను మూసివేయాల్సి వచ్చింది. అయినా, డ్రీమ్ స్పోర్ట్స్ అక్కడితో ఆగిపోకుండా కొత్త బిజినెస్ చేసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఈ యాప్ గత కొన్ని నెలలుగా పైలట్ ప్రాజెక్ట్‌గా నడుస్తోంది. ఇంకా అధికారికంగా లాంచ్ కాలేదు. గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, ఈ యాప్‌లో చిన్న మొత్తం రూ.10 నుంచి బంగారం కొనుగోలు చేయొచ్చు. రూ.1,000 నుంచి ఫిక్స్‌డ్ డిపాజిట్ సేవలు కూడా అందుబాటులో ఉంటాయి. అంటే, ఇది ఒక సరికొత్త ఆర్థిక సేవల ప్లాట్‌ఫామ్‌గా రూపొందుతోందని చెప్పవచ్చు.

**డ్రీమ్ సూట్ ఫైనాన్స్**

డ్రీమ్ మనీ యాప్‌ని డ్రీమ్ స్పోర్ట్స్‌లో ఒక భాగమైన డ్రీమ్‌సూట్ అనే యూనిట్ అభివృద్ధి చేస్తోంది. డ్రీమ్‌సూట్ వెబ్‌సైట్‌లో వాళ్లు చెప్పిన ప్రకారం, త్వరలోనే సజావుగా ఆర్థిక సేవలు అందించే ప్లాట్‌ఫామ్‌ని లాంచ్ చేయబోతున్నారు. అంటే, డ్రీమ్11 ఇప్పుడు గేమింగ్ నుంచి ఫైనాన్షియల్ సర్వీసెస్ వైపు మళ్లుతోందని స్పష్టమవుతోంది. ఈ కొత్త వెంచర్ ద్వారా డ్రీమ్ స్పోర్ట్స్ సామాన్యులకు సులువైన ఆర్థిక సేవలను అందించాలని చూస్తోంది. బంగారం కొనుగోలు, ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు వంటి సేవలతో యూజర్లకు స్మార్ట్ నిర్ణయాలు తీసుకునే అవకాశం కల్పించాలని భావిస్తోంది.

**ఇంకా ఏం చేస్తోంది?**

డ్రీమ్ స్పోర్ట్స్ కేవలం డ్రీమ్11 గేమింగ్ ప్లాట్‌ఫామ్‌కే పరిమితం కాదు. వాళ్లు ఇప్పటికే ఎన్నో రంగాల్లో తమ వ్యాపారాన్ని విస్తరించింది. వాటిలో స్పోర్ట్స్ ఎక్స్‌పీరియన్స్, ట్రావెల్ ప్లాట్‌ఫామ్, స్పోర్ట్స్ ఈవెంట్ టికెటింగ్, వ్యాపార సేవలు, గేమ్ డెవలప్‌మెంట్ యూనిట్ ఉన్నాయి. దీంతోపాటు లాభాపేక్ష రహిత సంస్థ, సామాజిక సేవల కోసం కూడా పనిచేస్తోంది. ఈ విధంగా డ్రీమ్ స్పోర్ట్స్ ఒక్క గేమింగ్‌కే కాకుండా, వివిధ రంగాల్లో తమ వ్యాపారాన్ని విస్తరిస్తోంది. ఆన్‌లైన్ గేమింగ్ నిషేధం డ్రీమ్ స్పోర్ట్స్‌కి ఒక పెద్ద షాక్ ఇచ్చినా, మరో వ్యాపారం పేరుతో కస్టమర్లకు సేవలను అందించేందుకు సిద్ధమవుతోంది.




# ప్రభావం చూపని బౌలర్లు..
# టీమిండియాపై ఆస్ట్రేలియా ఘన విజయం

క్రీడా వాయిస్

బ్రిస్బేన్ వేదికగా భారత ఏ మహిళల జట్టుతో జరిగిన ఏకైక అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఏ మహిళల జట్టు 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌ల్లో ఇరు జట్లు సమాంతరంగా నిలిచినా, రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా పైచేయి సాధించి, గెలుపు సొంతం చేసుకుంది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 299 పరుగులకు ఆలౌట్ కాగా.. ఆస్ట్రేలియా 305 పరుగులు చేసింది. 6 పరుగులు వెనుకపడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ 286 పరుగులకు ఆలౌటై, ఆసీస్ ముందు 281 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. ఛేదనలో బ్యాటర్లంతా తలో చేయడంతో ఆసీస్ 85.3 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి విజయతీరాలకు చేరింది. రేచల్ ట్రెనామన్ (64), మ్యాడీ డ్రేక్ (68), అనిక లియారాయ్డ్ (72) అర్ధ సెంచరీలతో సత్తా చాటగా.. కెప్టెన్ తహిల విల్సన్ (46) ఓ మోస్తరు స్కోర్ చేసింది. నికోల్ ఫాల్టుమ్ (16 నాటౌట్), ఎల్లా హేవర్డ్ (4) ఆసీస్‌కు విన్నింగ్స్ రన్స్ అందించారు. 281 పరుగుల లక్ష్యాన్ని డిఫెండ్ చేసుకోవడంలో భారత బౌలర్లు పూర్తిగా విఫలమయ్యారు. కెప్టెన్ రాధా యాదవ్ 8 మంది బౌలర్లు మార్చిమార్చి ప్రయోగించినా ఎలాంటి సానుకూల ఫలితం రాలేదు. సైమా ఠాకోర్ 2, జోషిత, తనుశ్రీ తలో వికెట్




తీశారు. అంతకుముందు యామీ ఎడ్గర్ (19-6-57-5) ఐదు వికెట్ల ప్రదర్శనతో, ప్రెస్ట్‌విడ్జ్ (13.4-2-47-3) మూడు వికెట్ల ప్రదర్శనతో చెలరేగడంతో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 286 పరుగులకే పరిమితమైంది. రాఘ్వి బిస్త్ (86) రెండో ఇన్నింగ్స్‌లోనూ భారత్‌ను ఆదుకుంది. షఫాలీ వర్మ (52) అర్ధ సెంచరీతో రాణించింది. తేజల్ (39), తనుశ్రీ (25), టైటాస్ సాధు (22 నాటౌట్) ఓ మోస్తరు స్కోర్లు చేశారు.

**శతక్కొట్టిన జింజర్**

లోయర్ ఆర్డర్ బ్యాటర్ సియన్నా జింజర్ (103) సెంచరీతో రాణించడంతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో భారత్ స్కోర్‌కు ధీటుగా బదులిచ్చింది. జింజర్‌కు నికోల్ ఫాల్టుమ్ (54), తహిల విల్సన్ (49) సహకరించారు. భారత బౌలర్లలో సైమా ఠాకోర్ 3, రాధా యాదవ్, మిన్నూ మణి తలో 2 వికెట్లు పడగొట్టారు.

**ఆదుకున్న రాఘ్వి**

తొలి ఇన్నింగ్స్‌లో రాఘ్వి బిస్త్ (93), జోషిత (51) ఆదుకోవడంతో భారత్ 299 పరుగులు చేయగలిగింది. ఆసీస్ బౌలర్లలో బ్రౌన్, ప్రెస్ట్‌విడ్జ్ తలో 3 వికెట్లు తీశారు కాగా, భారత ఏ మహిళల జట్టు మల్టీ ఫార్మాట్ సిరీస్ కోసం ఆస్ట్రేలియాలో పర్యటించింది. ఈ సిరీస్‌లో తొలుత టీ20 సిరీస్ జరగగా.. ఆసీస్ 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. అనంతరం భారత్ వన్డే సిరీస్‌ను 2-1 తేడాతో కైవసం చేసుకుంది. తాజాగా ఏకైక అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో గెలిచి ఆసీస్ సిరీస్‌ను చేజిక్కించుకుంది.

## కుప్పకూలిన సౌతాఫ్రికా..
## చరిత్రలో రెండో
## అతి భారీ విజయం సాధించిన ఆస్ట్రేలియా

ఆస్ట్రేలియా జట్టు తమ వన్డే క్రికెట్ చరిత్రలో రెండో అతి భారీ విజయం సాధించింది. ఇవాళ (ఆగస్ట్ 24) సౌతాఫ్రికాతో జరిగిన నామమాత్రపు వన్డేలో 276 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. పరుగుల పరంగా ఆసీస్‌కు అతి భారీ విజయం నెదర్లాండ్స్‌పై (2023 వన్డే వరల్డ్‌కప్‌లో 309 పరుగుల తేడాతో) దక్కింది. యాదృచ్ఛికంగా ఈ మ్యాచ్‌లో ఆసీస్ చేసిన స్కోర్ కూడా వారి వన్డే క్రికెట్ చరిత్రలో రెండో అతి భారీ స్కోర్‌గా నిలిచింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 431 పరుగులు చేసింది. వన్డేల్లో ఆసీస్ తమ అతి భారీ స్కోర్‌ను కూడా సౌతాఫ్రికాపైనే చేసింది. 2006లో జోహనెస్‌బర్గ్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఆసీస్ 4 వికెట్ల నష్టానికి 434 పరుగులు చేసింది. సౌతాఫ్రికా విషయానికొస్తే.. ఆ జట్టుకు పరుగుల పరంగా వన్డేల్లో ఇదే అతి భారీ పరాజయంగా నిలిచింది. దీనికి ముందు 2023 వరల్డ్‌కప్‌లో భారత్ చేతిలో ఎదురైన 243 పరుగుల పరాజయం వారికి వన్డేల్లో అతి భారీ పరాజయంగా ఉండింది. ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా 432 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తూ 24.5 ఓవర్లలో 155 పరుగులకే కుప్పకూలింది. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ కూపర్ కన్నోలీ (5/22) అద్భుత ప్రదర్శనతో చెలరేగి సౌతాఫ్రికా పతనాన్ని శాశించాడు. మ్యాచ్ పూర్తి వివరాల్లోకి వెళితే.. 3 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జరిగిన చివరి వన్డేలో ఆసీస్ టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసింది. ట్రవిస్ హెడ్ (142), మిచెల్ మార్ష్ (100), గ్రీన్ (118 నాటౌట్) సెంచరీలతో కదంతొక్కడంతో నిర్ణీత 50 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 431 పరుగులు చేసింది. ఆసీస్ ఇ?న్నింగ్స్‌లో అలెక్స్ క్యారీ (50 నాటౌట్) అర్ధ సెంచరీతో రాణించాడు. అనంతరం? కష్టసాధ్యమైన లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన సౌతాఫ్రికా.. కూపర్ కన్నోలీ (6-0-22-5), జేవియర్ బార్ట్‌లెట్ (6-0-45-2), సీన్ అబాట్ (4-0-27-2), ఆడమ్ జంపా (4.5-1-31-1) ధాటికి 155 పరుగులకే ఆలౌటైంది. సౌతాఫ్రికా ఇన్నింగ్స్‌లో డెవాల్డ్ బ్రెవిస్ (49) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ గెలుపుతో ఆసీస్ ఇదివరకే కోల్పోయిన సిరీస్‌లో సౌతాఫ్రికా ఆధిక్యాన్ని 1-2కు తగ్గించింది. తొలి రెండు వన్డేల్లో సౌతాఫ్రికా గెలుపొందిన విషయం తెలిసిందే. కాగా, వన్డే సిరీస్‌కు ముందు ఇరు జట్ల మధ్య జరిగిన 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను ఆసీస్ 1-2 తేడాతో కైవసం చేసుకుంది.



## అఫ్గానిస్తాన్ జట్టు ప్రకటన.. కెప్టెన్‌గా రషీద్ ఖాన్

ఆసియాకప్-2025 కోసం 17 మంది సభ్యులతో కూడిన జట్టును అఫ్గానిస్తాన్ క్రికెట్ బోర్డు ఆదివారం ప్రకటించింది. ఈ జట్టుకు స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ నాయకత్వం వహించనున్నాడు. సెప్టెంబర్ 9న అబుదాబిలో జరిగే టోర్నమెంట్ తొలి మ్యాచ్‌లో హాంకాంగ్‌తో అఫ్గానిస్తాన్ తలపడనుంది. ఈ టోర్నీ ఆరంభానికి ముందు అఫ్గాన్ జట్టు.. యూఏఈ, పాకిస్తాన్‌తో ట్రై-సిరీస్ ఆడనుంది. ఆసియాకప్ సన్నాహకాల్లో భాగంగా ఈ ముక్కోణపు సిరీస్‌ను ప్లాన్ చేశారు. ఇంతకముందే ఆగస్టు 5న ఆసియాకప్ కోసం అఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు 22 మంది సభ్యుల ప్రాథమిక జట్టును ప్రకటించింది. ఇప్పుడు అందులో నుంచి 17 మంది పేర్లను ఏసీబీ ఖరారు చేసింది. రషీద్ ఖాన్ డిప్యూటీగా వికెట్ కీపర్ బ్యాటర్ రహ్మానుల్లా గుర్బాజ్ వ్యవహరించనున్నాడు. ఆసియాకప్ ఎంపికైన జట్టులో చాలా మంది ఆటగాళ్లు ట్రై-సిరీస్‌లో పాల్గొంటారని ఏసీబీ ఓ ప్రకటనలో పేర్కొంది. కాగా ట్రై-సిరీస్ ఆగస్టు 29న ప్రారంభమై, సెప్టెంబర్ 7న ముగియనుంది.

**ఆసియాకప్-2025కు అఫ్గాన్ జట్టు ఇదే**

రషీద్ ఖాన్ (కెప్టెన్), రహ్మానుల్లా గుర్బాజ్, ఇబ్రహీం జద్రాన్, దర్విష్ రసూలీ, సెదిఖుల్లా అటల్, అజ్మతుల్లా ఒమర్జాయ్, కరీం జనత్, మహ్మద్ నబీ, గుల్బాదిన్ నాయబ్, షరాఫుద్దీన్ అష్రఫ్, మహ్మద్ ఇషాక్, ముజీబ్ ఉర్ రహమాన్, అల్లాహ్ గజన్ఫార్. నూర్ అహ్మద్, ఫారిక్ అహ్మద్




మాలిక్, నవీన్-ఉల్-హక్, ఫజల్హాక్ ఫరూకీ

రిజర్వ్ ఆటగాళ్లు: వఫివుల్లా తారఖాల్, నంగ్యాల్ ఖరోటే, అబ్దుల్లా అహ్మద్‌జాయ్


**ఆసియాకప్‌లో అఫ్గాన్ షెడ్యూల్**

అఫ్గానిస్తాన్ వర్సెస్ హాంకాంగ్- సెప్టెంబర్ 9 షేక్ జాయెద్ స్టేడియం, అబుదాబి
అఫ్గానిస్తాన్ వర్సెస్ బంగ్లాదేశ్ -సెప్టెంబర్ 16 షేక్ జాయెద్ స్టేడియం, అబుదాబి
అఫ్గానిస్తాన్ వర్సెస్ శ్రీలంక -సెప్టెంబర్ 18 షేక్ జాయెద్ స్టేడియం, అబుదాబి

# ‘మహావతార్ నరసింహ’ బ్లాక్‌బస్టర్ ట్రైలర్ చూశారా?



‘మహావతార్ నరసింహ’ సినిమా విడుదలై నెల కావస్తుంది. అయినప్పటికీ బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తుంది. ఇప్పటికే అత్యధిక కలెక్షన్స్ రాబట్టిన ఇండియన్ యానిమేషన్ మూవీగా రికార్డ్ క్రియేట్ చేసింది. ఇప్పటి వరకు ఏకంగా రూ. 280 కోట్లకు పైగానే కలెక్షన్స్ రాబట్టింది. మూవీ భారీ విజయం అందుకోవడంతో తాజాగా మేకర్స్ కొత్త ట్రైలర్‌ను విడుదల చేశారు. అశ్విన్ కుమార్ దర్శకత్వంలో హొంబలే ఫిల్మ్స్ సమర్పణలో శిల్పా ధవాన్, కుశల్ దేశాయ్, చైతన్య దేశాయ్ సంయుక్తంగా ‘మహావతార్ నరసింహ’ యానిమేటెడ్ చిత్రాన్ని తెరకెక్కించారు. జులై 25న విడుదలైన ఈ చిత్రం మొదటి రోజు నుంచి అద్భుతమైన స్పందన రావడంతో ప్రపంచవ్యాప్తంగా థియేటర్స్ నిండిపోయాయి. ఇప్పటికి కూడా కొన్ని చోట్ల విజయవంతంగా రన్ అవుతుంది.




# విశాల్ 35వ సినిమా ‘మకుటం’ టీజర్ రిలీజ్

ఇటీవల మదగదరాజ అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చి హిట్ అందుకున్న నటుడు విశాల్ మరో కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఆయన కెరీర్‌లో 35వ చిత్రంగా రాబోతున్న ఈ చిత్రానికి ‘మకుటం’ అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందం ఆదివారం ఒక ఆసక్తికరమైన టీజర్‌ను విడుదల చేసింది. ఈ సినిమాకు రవి అరసు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో విశాల్‌ను ఒక శక్తివంతమైన పాత్రలో చూపించారు. యాక్షన్ సన్నివేశాలు, గ్రాఫిక్స్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ చిత్రంలో విశాల్ సరసన దుషారా విజయన్ హీరోయిన్‌గా నటిస్తుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ సూపర్ గుడ్ ఫిల్మ్స్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. వారి బ్యానర్‌లో ఇది 99వ చిత్రం.






# యంగ్ హీరోయిన్ ప్రేమలో ‘అర్జున్ దాస్’ !

కోలీవుడ్ నటుడు అర్జున్ దాస్ ప్రేమలో పడ్డాడు. ఈమేరకు తమిళ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఖైదీ సినిమాలో విలన్‌గా నటించిన అర్జున్ దాస్ తెలుగు ప్రేక్షకులకు కూడా బాగా దగ్గరయ్యాడు. ప్రస్తుతం ఓజీ సినిమాలో ఆయన కీలక పాత్రలో కనిపించనున్నారు. అయితే, ఒక యంగ్ హీరోయిన్‌తో అర్జున్ దాస్ ప్రేమలో ఉన్నారని నెట్టింట వైరల్ అవుతుంది. 2017లో వచ్చిన ‘ఆక్సిజన్’ సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన అర్జున్ దాస్.. మాస్టర్, విక్రమ్ చిత్రాలతో పాపులారిటీ తెచ్చుకున్నారు. అయితే, యంగ్ హీరోయిన్ ఐశ్వర్య లక్ష్మితో ప్రేమలో ఉన్నట్లు కోలీవుడ్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. వారిద్దరూ కలిసి ఒక వెబ్ సిరీస్ కోసం పనిచేస్తుండగా ఈ ప్రచారం జరుగుతుంది. కానీ, అర్జున్ దాస్ ఖండించారు. ఆపై ఐశ్వర్య లక్ష్మి కూడా తామిద్దరం మంచి స్నేహితులమంటూ వివరణ ఇచ్చారు. అయినప్పటికీ ప్రచారం మాత్రం ఆగడం లేదు. కొందరు మాత్రం నిప్పు లేనిదే పొగ రాదంటూనే వారి ప్రేమ నిజమేనంటూ చెప్పుకొస్తున్నారు. సరైన సమయం చూసి ప్రేమ గురించి అందరికీ తెలుపుతారంటూ పేర్కొంటున్నారు. బ్యాంకు ఉద్యోగిగా, రేడియో జాకీగా అర్జున్ దాస్ పనిచేయగా.. ఐశ్వర్య లక్ష్మి వైద్య విద్య పూర్తి చేశారు. ఐశ్వర్య లక్ష్మి తెలుగులో సత్యదేవ్‌తో గాడ్సే మూవీలో నటించారు. ప్రస్తుతం ‘సంబరాల ఏటి గట్టు’లో సాయిధరమ్ తేజ్‌తో నటిస్తున్నారు. మట్టి కుస్తీ, కింగ్ ఆఫ్ కొత్త,పొన్నియిన్ సెల్వన్,థగ్ లైఫ్ వంటి భారీ చిత్రాల్లో ఆమె మెప్పించారు. కేరళలోని తిరువనంతపురంలో జన్మించిన ఈ బ్యూటీ తమిళ ఇండస్ట్రీలో చాలా సినిమాలు చేశారు.





VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com